నవశక్తి

Vol. 2, no. 35

(Aug. 16, 1939)

బెజవాడ, 1939

Navaśakti

Vol. 2, no. 35

(Aug. 16, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

సంపుటం 2
సంచిక 35

నవశక్తి

బుధవారం
16-8-39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

వర్కింగు కమిటీ ఆంక్ష!

గాంధీయుల ప్రతీఘాత విధానానికి పరమావధి లభించింది. "అది పట్టాభి ఓటమి గాదు: నా ఓటమి" అన్న మహాత్ముని ఆక్రోశము ఫలించింది. ఏకాభిప్రాయులైనవారే, గాంధీయులే కాంగ్రెసులో వుండాలనే సంకుచిత వాదానికి పరమార్థము క్రమంగా తేటతెల్లమౌతూంది. గాంధీ ముతావారి డిసిప్లిన్ కత్తికి నేడు రెండు సంవత్సరాలు కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డ సుభాస్ బలి అయ్యాడు. అతడు 3 సంవత్సరాలవరకు బెంగాలు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా వుండనర్హుడుకాడు. అంతేకాదు. అఖిలభారత కాంగ్రెసు సంఘము, రాష్ట్ర కాంగ్రెసు సంఘము, జిల్లా కాంగ్రెసు సంఘము, గ్రామ కాంగ్రెసు సంఘం మరి యే కాంగ్రెసు కమిటీలోను 3 సంవత్సరాల వరకు సభ్యుడుగా ఉండరాదు. ఇది ప్రాసిక్యూషను, జడ్జీలు కూడ తామేఅయిన గాంధీయులు ముద్దాయి బోసుపై యిచ్చిన తీర్పు ఇంక ప్రతి రాష్ట్రంలోనూ మంత్రులకు తాళంవేసే సంస్థగా కాంగ్రెసును చేయవద్దని చెప్పే తీవ్రవాదిపై, దిగజారుడు విధానాన్ని ఎదిరించి ప్రజా పోరాటం ద్వారానే కాంగ్రెసు బలపడుతుందనే సోషలిష్టులపై యీ డిసిప్లిన్ కత్తి ప్రయోగించబడుతుంది. ప్రాథమిక గ్రామ కాంగ్రెసు సంఘము మొదలు అఖిలభారత కాంగ్రెసు సంఘమువరకు, "పోరాటము లేకుండానే అధికారము హస్తగతం అవుతుందనే" గాంధీయుల ముఠాతో నింపివేయబడుతుంది. గాంధీజానికి 'జోహుకుం' అననివారికి కాంగ్రెసులో తావులేకుండా చేయుటకు యిది ఉపక్రమణిక మాత్రమే! గాంధీయుల యీ ప్రయత్నము జయమొందుతుందా?

1906 నాటి కాంగ్రెసు మహాసభ చరిత్ర నేడు 1939 లో తిరిగి పునః ప్రదర్శిత మౌతూంది. నాడు ముద్దాయి బాలగంగాధర తిలక్; నేడు సుభాస్ చంద్ర బోసు. నాడు బిరుదుల కొరకు ప్రాకులాడేవారు, కాంగ్రెసులో నాయకత్వానికి హైకోర్టు జడ్జీపదవో, ప్రభుత్వ కార్యనిర్వాహక సభ్యత్వమో పరమావధిగా ఎంచేవారు. ప్రాసిక్యూషను: నేడు మంత్రిపదవుల నిర్వహించుటద్వారా పోరాటము లేకుండానే స్వరాజ్యం వస్తుందనే వారు, కాంగ్రెసు మంత్రులకు గవర్నర్ల నుండియే సహకారము వచ్చింది గాని కాంగ్రెసు వాదులనుండి రాలేదని నమ్మువారు, ప్రాసిక్యూషను. నాడు ప్రభుత్వోద్యోగులు కన్నెర్రచేసే "అపాయకరమైన భావాలు కల్గి వుండుట" తిలకు చేసిన నేరం: నేడు ప్రజల హక్కులకొరకు. సత్యాగ్రహం సాగించే హక్కును నిషేధించిన తీర్మానాన్ని ఆక్షేపించుట. దానిని మార్చాలని ప్రచారం చేయుట, బోసు, తీవ్రవాదులు, సోషలిష్టులు చేసిననేరం. నాడు మితవాదులు కాంగ్రెసులో చీలికలు తెచ్చి, జాతీయవాదులను బయటకు తరిమి తరువాత వచ్చిన ప్రపంచ సంగ్రామంలో బ్రిటీషు సామ్రాజ్యానికి సాయపడ్డారు. భారతీయుల సంకెళ్లను బలపరచారు.

నేడు, నాటిమితవాదుల చర్యలను సమర్థించ సహసించగల వారుండరు. కాని నేటి గాంధీయుల చర్యలనో? చరిత్ర నేర్పిన గుణపాఠాలను మానవులు సరిగా మననము చేసికోలేరు. ఆచరణలో అనుభవించిన తరువాతగాని తప్పు తెలిసికోలేరు.

ఈ డిసిప్లినరీచర్యకు గురికావడానికి బోసు చేసిన ఘోరమైన నేరమేమిటి? కాంగ్రెసు మంత్రులపై రాష్ట్ర సంఘాల పెత్తనాన్ని, ప్రజాసాహస్య హక్కులకొరకు జరుగు పోరాటాలను సంకుచితపరచే సత్యాగ్రహ వ్యతిరేక తీర్మానాన్ని, మార్చవలసిందని, అమలునందుంచ వద్దని అసమ్మతి సభలు చేయమని చెప్పడం, వానిలో పాల్గొనడం.-ఈ సాంప్రదాయం కాంగ్రెసులో యిదివరకులేదా? జాతీయ ఉద్యమానికి యిది భంగకరమా? అని ఆలోచించాలి. గయా కాంగ్రెసు అనంతరము, అఖిల భారత కాంగ్రెసు సంఘం శాసనసభాప్రవేశాన్ని అంగీకరించి నపుడు, తద్విరుద్ధంగా గుజరాత్ రాష్ట్రీ కాంగ్రెసు సంఘము ఎన్నికల్లో పాల్గొన రాదని తీర్మానించింది. నేడు డిసిప్లినరీ చర్యలకు కారకులైన వల్లభాయి పటేలే నాడు గుజరాతు రాష్ట్రీ కాంగ్రెసు అధ్యక్షుడు. శాసనసభల బహిష్కరించాలను వాదన దేశద్రోహం కాదుగాన సహించబడింది. అఖిలభారత కాంగ్రెస్ సంఘతీర్మానానికి విరుద్ధమైనా, కాంగ్రెసు నేటి మహోన్నత స్థితికి కారణమైన ప్రజాపోరాటము, ప్రజాందోళనను సంకుచితపరచే తీర్మానాలను, కాంగ్రెసును కాంస్టిట్యూషనల్ విధానానికి దారితీస్తున్న దిగ జారుడు పాలసీని, ఆక్షేపించి నందులకు బోసుపై నేడు డిసిప్లినరీ చర్యయా? ఏం సబబు?

సామాన్య సభ్యులకు తీర్మానాలను ఆక్షేపించుటకు, మార్పుచేయాలని ప్రచారము చేయుటకు మార్పించుటకు అధికారము వుందని రాజేంద్రబాబు, కృపాలినీ, నెహ్రూలుకూడ అంగీకరించుతున్నారు. కాని కమిటీల సభ్యులు, కార్యవర్గసభ్యులు ఆపనిచేయడము డిసిప్లిన్‌కు వ్యతిరేక మంటున్నారు. అయితే దీనిప్రకారము అఖిల భారత కాంగ్రెసు కమిటీ తీర్మానాలు దేశక్షేమానికి విరుద్ధమైనవి మార్పుచేయాలని కోరేవారికి గ్రామ కాంగ్రెసుసంఘము మొదలు అఖిలభారత కాంగ్రెసు సంఘము వరకు ఏసంఘములోనూ తావు లేదన్నమాట. అంటే మెజారిటీకి వ్యతిరేకులైన పావలా సభ్యులు ఆకస్మికముగా అఖిలభారత కాంగ్రెసు కమిటీలో మెజారిటీ సంపాదించేవరకు ఏకమిటీలోను సభ్యులుగా వుండరాదన్నమాట. అంతేగాని ఒకజిల్లాలో గాని, రాష్ట్రములోగాని మెజారిటీ సంపాదించడముగాని, ఎన్నికలో నిలబడటము గాని చేయరాదు. పాలసీ, తీర్మానాలు మార్పుచేయించడానికి చేసేప్రయత్నాలు చేసేవారు ఏ అధీన కాంగ్రెసు సంఘములోను సభ్యులుగా వుండరాదంటే, యింకా అఖిలభారత కాంగ్రెసు సంఘములో మెజారిటీ సంపాదించడము ఎలా సాధ్యమౌతుంది? ప్రజాస్వామ్యసూత్రాలకు విరుద్ధమైన యీ బ్యూరాక్రటిక్ విధానము కాంగ్రెసులో ప్రవేశపెట్టుటవలన కాంగ్రెసుసంఘాలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిఫలింప జేయజాలవు. అధికారములో వున్నవారు ప్రజాసామాన్యానికి దూరమయి క్రమంగా ప్రజలతో సంబంధాన్నే గోల్పోతారు. పౌరస్వాతంత్ర్యాన్ని గొంతు నులుముటతో ఒకపాలసీ జయమొందదు: విమర్శనకు అవకాశమిచ్చి ప్రజలకు నచ్చునట్లు చేయగలిగితేనే ఆపాలసీలోని మంచి చెడ్డలు బయల్పడుతాయి.

ఇంక కాంగ్రెసు అధ్యక్షుని ఆజ్ఞను ఉల్లంఘించారను నేరము సంగతి. తీర్మానాలను మార్చుటకు ప్రచారము చేయడానికి హక్కు ఉన్నప్పుడు, ఆ హక్కును భంగపరచే ఆజ్ఞ యివ్వడానికే రాజేంద్రబాబుకు అధికారములేదు. ఏమైతేనేమి? ఈ డిసిప్లినరీ చర్యల ద్వారా వర్కింగు కమిటీ కాంగ్రెసులో చీలికలు కల్గించే, స్వాతంత్ర్యోద్యమ వినాశకరమగు విధాన మవలంబించుతూంది.

ఏమైనా, తీవ్రవాదుల కర్తవ్యము స్పష్టమే. బోసు చెప్పినటుల వారు "కాంగ్రెసును, స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరచుతారు." ప్రస్తుత దిగజారుడు పాలసీకి వ్యతిరేకముగా స్వాతంత్ర్య పోరాటానికి, ఐక్యతకు, అనుకూలముగా ప్రచారం గావించి కాంగ్రెసు వాదులందరికి పోరాట కార్యక్రమానికి సుముఖులుగా చేస్తారు. చైనాలో కమ్యూనిస్టులు తమను 1929 నుండి 36 వరకు నానా హింసలు పెట్టిన చాంకైషేక్ నాయకత్వాననే నేడు జాతీయ శత్రువయిన జపాను సామ్రాజ్యవాదులతో జరిగే పోరాటములో ముందున్నటులే, ఇండియాలో తీవ్రవాదులు బ్రిటీషు సామ్రాజ్యవాదులతో పోరాటంలో అగ్రగాములుగా వుంటారు. బయటకు వెళ్ళగొట్టినా, లోన వున్నా, సామ్రాజ్య వ్యతిరేక సంస్థగావున్న కాంగ్రెసును బలపరుస్తారు. కాని 11 వ తేదీ టైమ్స్ అఫ్ ఇండియా విలేఖరి వ్రాసినటుల గాంధిగారి "యుద్ధ సమయములో బ్రిటను కష్టాలను స్వాతంత్ర్య సంపాదనకొరకు వినియోగించుకోరాదను" వాదనను మాత్రము అంగీకరించజాలరు. ఏమంటే, వారు కోరే ఐక్యత స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించుటకు. బ్రిటిషు సామ్రాజ్యంతో గాంధీయులు రాజీకి దిగుతూంటే ఐక్యతకొరకు వారు వెనుకంజ వేయజాలరు; ఆత్మ వినాశకరముయిన విధానానికి తలలొంచబోరు.

మన రాజకీయాలు

ఇండియాలో యుద్ధసన్నాహాలు.

ఒక వైపు వార్ధాలో కాంగ్రెసు వర్కింగ్ కమిటీ దీర్ఘమైన యుద్ధవ్యతిరేక తీర్మానం ఒకటి చేస్తూంటే, మరోవైపున బ్రిటిష్ ప్రభుత్వం ఇండియాలో ఎడతెగని యుద్ధసన్నాహాలు చేస్తోంది. ఇండియాకు దక్షిణాన, సింగపూర్‌లో, నేడు 4 బ్రిటిష్ యుద్ధవిమానదళాలు ఉన్నాయి. అవిచాలక ఇండియా నుండి మరొక యుద్ధవిమాన దళాన్ని పంపారు. ఇవిగాక, 1 బ్రిటిష్ సైనికదళం, 3 భారతీయ సైనికదళాలు ఇండియా వదలి సింగపూరు వెళ్లాయి. ఇదివరలో సుమారు 4000 మంది సైనికులు సింగపూరుకు రవానా చేయబడ్డారు. వీరుగాక, మొన్న 12 వ తేదీని మరో రెండు ఓడలలో 3000 మంది భారతీయ సైనికులు సింగపూరు వెళ్లారు. 12 జలాంతర్గాములు, 1 తుపాకీ ఓడ, 2 డిస్ట్రాయర్లు, 1 ఎయిర్‌క్రాఫ్టు క్యారియర్ కూడా సింగపూరులో దిగాయి.


యుద్ధం వచ్చినప్పుడు ఇండియా రక్షణార్థై, ఇండియా సరిహద్దులలోనే, యీ సైనికుల్ని ఉంచుతామని యింతవరకూ చెప్పుతూ వచ్చినబ్రిటిష్ ప్రభుత్వం నేడు తమ సామ్రాజ్యం అపాయస్థితిలో ఉందని తెలుసుకోగానే, మనసైనికుల్ని బయటి ప్రదేశాలకు పంపుతున్నారు. పోనీ, విదేశాలలో పనిచేసే కాలములో నారికి అయ్యే ఖర్చు బ్రిటిష్ ప్రభుత్వం భరిస్తుందా అంటే, ఒక్క రాకపోకల ఖర్చులే భరిస్తుందనీ, జీతాలుభత్యాలు ఎప్పటి మాదిరిగానే ఇండియా భరించవలని యుంటుందనీ, తెలియజేశారు. పాతఇండియా రాజ్యాంగ చట్టంయొక్క 22 వ సెక్షనుప్రకారం బ్రిటిష్‌పార్లమెంటులో తీర్మానం ప్యాసైతే గాని యీ విధంగా విదేశాలలో ఉండే భారతీయ సైనికులఖర్చు ఇండియా భరించనవసరము లేదు. కాని నూతన రాజ్యాంగ చట్టం ప్రకారం, పార్లమెంటులో చర్చకూడా అవసరం లేకుండా, యుద్ధం ప్రకటించబడకపోయినప్పటికీ, ఎన్నికోట్ల రూపాయలైనా ఇండియా భరించితీరాలి.

ఇంతే గాక, బ్రిటిష్ ప్రభుత్వం ఇండియాలో స్వయంగా ఎన్నో ఆయుధాగారాలు నడుపుతోంది. కాశీపూర్ (బెంగాల్) ఫ్యాక్టరీలో యుద్ధ విమానాలు, బాంబులు తయారుచేయడానికి 100 యకరాల భూమిని కొంది. మర ఫిరంగులు, తూటాలు వగైరా యుద్ధ సామగ్రి అనేక ఫ్యాక్టరీలలో తయారవుతోంది.

యుద్ధంలో తప్పక తమకు సహాయం చేయనున్న సంస్థానాధీశులకు ప్రత్యుపకారంగా బ్రిటిష్ ప్రభుత్వం "క్రౌన్ పోలీస్ బెటాలియన్" అంటూ ఒక కొత్త సైనికదళాన్ని ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఎక్కువమంది పంజాబ్ సైనికులు ఉంటారు. దీనిని గ్వాలియర్ సంస్థానంలో నీమచ్‌వద్ద ఉంచుతారు. సంస్థానాధీశులయెడ బ్రిటిష్ ప్రభుత్వానికిగల "బాధ్యత" లను నెరవేర్చడానికి యీ సైనికదళం సహాయం చేస్తుందిట! చాలాకాలం నుంచి సంస్థానాధీశులు యిట్టి రక్షణ కావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పుడు ఆకోరిక నెరవేర్చడానికి ప్రభుత్వం పూనుకొంది.

బెంగాల్‌లో నిర్బంధ విధానం.

ఈ విధంగా బ్రిటిష్ ప్రభుత్వం ఒకవైపున ఇండియాలో తీవ్రమైన యుద్ధసన్నాహాలు చేస్తూంటే, బెంగాల్ మంత్రివర్గం తన నిర్బంధ విధానాన్ని ఎక్కువ చేస్తోంది. "అతిప్రమాద పరిస్థితులు" యేర్పడినప్పుడు రాష్ట్రంయొక్క "శాంతి భద్రతలు" కాపాడడానికి వాలంటీర్ పోలీసుదళం ఒకటి యేర్పాటు చేయబోతూంది బెంగాల్ ప్రభుత్వం. అందులో పూర్వము సిపాయిలుగా పనిచేసిన వారిని చేర్చుకుంటారట. వెన్వెంటనే 800 మంది యీదళంలో చేరబోతారట! ఇద్దర్నీ, ముగ్గుర్నీ, చొప్పున రాజకీయ ఖైదీలను విడిచిపెట్టుతూన్నప్పటికీ, హోం మంత్రి స్టేట్‌మెంటువల్ల రెండునెలల అనంతరం బెంగాల్‌లో రాజకీయ ఖైదీల సమస్య తీవ్రరూపాన్ని దాల్చేటట్లుంది. నౌఖాలీ రైతుసంఘ కార్యదర్శియు, కాంగ్రెస్ సేవకుడును, అయిన ఆర్. మజుందార్‌కు కొమిల్లాజిల్లాకలెక్టరు రాజద్రోహ నేరంక్రింద 6 నెలల కఠినశిక్ష విధించాడు. గత ఏప్రిల్‌లో "భారతదేశం—రాబోయే యుద్ధం" అనే విషయాన్ని గురించి కలకత్తాలో ఉపన్యాస మిచ్చినందుకు బాట్లీవాలాగారికి చీఫ్ పెసిడెన్సీ మేజస్ట్రీటు రాజద్రోహనేరం క్రింద 6 నెలల కఠినశిక్ష విధించాడు. బాట్లీవాలాగారు యిచ్చిన స్టేటుమెంటులో యీవిధంగా ఉంది:



కామ్రేడ్ బాట్లీవాలా

"ప్రపంచ యుద్ధాన్ని గురించి కాంగ్రెసు ఆమోదించిన విధానమే నా ఉపన్యాసానికి పునాది. ఆ ఉపన్యాసం మీ దృష్టిలో రాజద్రోహపూరితముయితే, దేశంయొక్క సంపూర్ణ స్వాతంత్ర్యంకొరకు పోరాడుతూన్నట్టియు, ఎవరిచేతను అణచబడజాలనట్టియు, కాంగ్రెసు మహా సంస్థకూడా రాజద్రోహసంస్థ అన్నమాటే"

కాని ఆ విషయం పైననే, ఆ రోజునే, ఉపన్యసించిన రామమనోహర లోహియా (మాసానితో సహా పార్టీ కార్యనిర్వాహక వర్గానికి రాజీనామా యిచ్చిన సోషలిస్టు ప్రముఖుడు) ను మాత్రం మేజస్ట్రేటు విడిచిపెడుతూ యితడు దౌర్జన్యము చేయవలసినదిగా ప్రబోధించలేదనీ, కాంగ్రెసు పద్ధతుల ప్రకారమే నడువవలసినదిగా హెచ్చరించాడనీ, తీర్పుచెప్పాడు.

ఇదేవిధంగా, పంజాబులో మౌలానా మజరాలీ, ఎం. ఎల్. ఏ. అనే అహ్‌రార్‌నాయకుడు 124 (ఎ) సెక్షన్(రాజద్రోహం) క్రింద, 153 (ఎ) సెక్షన్ (వర్గస్పర్ధ) క్రింద ఎరస్టుచేయబడ్డాడు.

కాంగ్రెస్ రాష్ట్రాల్లో ధోరణి.

కాని, కాంగ్రెసు రాష్ట్రాలలోకూడా మంత్రులు ప్రజాప్రతికూల వైఖరినే ప్రదర్శిస్తున్నారు. మద్రాసు ప్రభుత్వంచే ప్రకటించబడ్డ "1938 వ సంవత్సరపు పోలీసుపరిపాలనా నివేదిక" లో, ప్రభుత్వ జమీందారీ విచారణ కమిటీ యేర్పడినప్పుడు కృష్ణాజిల్లాలో అనేకచోట్ల, "రైతు నాయకులు జమీందారీవిధానానికి వ్యతిరేకంగా తీవ్రప్రచారం సాగించా"రని అదొక నేరంగా పేర్కొనబడింది. మలబార్‌లో సోషలిస్టులు "బాధ్యతారహితమైన" ఉపన్యాసాలివ్వడం వల్ల రైతులు జమీందార్లను బహిష్కరించడం, శిస్తులు నిరాకరించడం, అడవులలో కట్టెలుకొట్టి తెచ్చుకోవడం, మొదలుగా గల "న్యాయ నిరుద్ధమైన పనులు" చేశారట! చీరాల కాల్పులను గురించి యీ క్రింది విధంగా వ్రాయబడింది: "ఈ విషయంలో సమ్మెదారులు యుద్ధంలో పోరాడే సైనికుల వైఖరిని ప్రదర్శించారు. పోలీసుల మీద, మేజస్ట్రేట్లమీద, వారు అడవి జంతువులమాదిరిగా పడి యెదుర్కొన్నారు. దోపిడీచేయడం, యిళ్లు తగలపెట్టడం, ఖూనీ చేయడం, వారి ఉద్దేశం. ఇందులో సందేహం ఏమీ లేదు."

ఇట్టి వాక్యాలపై వ్యాఖ్యానం అనవసరం. పోలీసుల పరిపాలనను గురించి నివేదికలో ఎన్నో పొగడ్తలున్నాయి. ఒక్కలోపం కూడా కనపడలేదు ప్రభుత్వానికి! ప్రజలచే యెన్నుకోబడి, ప్రజల తరఫున పరిపాలించే కాంగ్రెసు మంత్రుల అధికారంలోనే యిట్టి నివేదికలు ప్రకటించబడడం, ముఖ్యంగా కార్మికోద్యమాలు, కర్షకోద్యమాలు, నేరాల[illegible]లో జమకట్టబడడం, ఏకాంగ్రెసువాది సహించగలడు?

బీహార్‌లో నిరశన వ్రతాలు

బీహార్‌లో పరిస్థితులు మరీ అధ్వాన్నంగా ఉన్నాయి రైతు సత్యాగ్రహ పోరాటాలకు నాయకత్వం వహించి, ఖైదుశిక్ష విధించబడ్డ బ్రహ్మచారి రామబృక్ష, జగన్నాధ్ గారలు ఛాప్రా జైలులో 80 రోజులనుంచి, హజారీబాగ్ జైలులో అనిలమిత్ర, కార్యానందశర్మ, గారలు 45 రోజులనుంచీ, నిరశనవ్రతం చేస్తున్నారు. రైతు సత్యాగ్రహ ఖైదీలందరినీ కాంగ్రెసు మంత్రివర్గం రాజకీయ ఖైదీలుగా పరిగణించవలసిందంటూ వీరు ఎన్నిసార్లుకోరినా, ప్రయోజనం లేనందున యీ అంతిమ సాధనం చేబట్టవలసి వచ్చింది. అ. భా. కాంగ్రెసు మహాసభాధ్యక్షుడైన రాజేంద్రప్రసాద్ రాష్ట్రంలో కూడా కాంగ్రెసువాదులు 80 రోజులనుంచి నిరశనవ్రతం చేస్తున్నారంటే, సిగ్గుతో తలవంచుకోవలసి వస్తుంది. ఒకవైపు బెంగాల్ రాజకీయ ఖైదీల విడుదలకై జాతీయ విద్రోహ మంత్రివర్గంతో సంభాషణలు సల్పుతూ, మరోవైపున కాంగ్రెసు మంత్రులు అధికారంలోనేడున్న తన రాష్ట్రంలో యింత విషమపరిస్థితి యేర్పడిందంటే, ప్రజలు హర్షిస్తారా?

ఇతర కాంగ్రెసు రాష్ట్రాలలో పరిస్థితు లేవిధంగా ఉన్నాయో చూదాం: ఫార్వర్డుబ్లాక్‌లో తీవ్రంగా పనిచేసే పెషావర్ కంటోన్మెంటు కాంగ్రెసు కమిటీ కార్యదర్శి గలాధర్ రైతు సత్యాగ్రహాన్ని గురించిచేసిన ఒక ప్రకటనకు సరిహద్దు కాంగ్రెసు ప్రభుత్వం ఎరస్టుచేసింది. కాన్పూరునో అశోక కుమార్ అనే కార్మికనాయకుడు, మరో 9 గురు సమ్మెదారులు విక్టోరియా మిల్లు వద్ద పికెటింగు చేసినందుకు పోలీసులు ఎరస్టుచేశారు.

క్రిమినల్ ట్రైబ్సుకు చెందిన వ్యక్తి రెండోసారి నేరంచేస్తే 7 సంవత్సరాలకు తక్కువ కాని కఠినశిక్షయు, మూడో సారి చేస్తే ఆజన్మ ద్వీపాంతరవాసము, విధించాలని యిప్పుడున్న చట్టంయొక్క 23 వ సెక్షన్ పూర్తిగా రద్దుచేయాలని బొంబాయి ప్రభుత్వోపసంఘం సిఫార్సుచేయడం; బొంబాయి నగరములో మధ్యనిషేధచట్టం అమలుపరచడం; యు. పి. లో నూతన ప్రథమిక విద్యావిధానాన్ని ప్రారంభించడం; మద్రాసు రాజధానిలో దేవాలయ ప్రవేశచట్టం ప్యాసుకావడం; గుజరాత్ రాష్ట్రంలో అనావృష్టివల్ల విపరీతమైన క్షామం సంభవించి, గత వారం 40,000 పశువులు నష్టమై ప్రజలు తిండిలేక అల్లాడుతుంటే, ప్రభుత్వమే కాయధాన్యాల ధరలు నిర్ణయించడానికి, అవసరమైన ప్రదేశంనుండి మరోచోటికి ఎగుమతిచేయకుండా అరికట్టడానికి అధికారం తీసుకుంటూ బొంబాయి ప్రభుత్వం ఆర్డినెన్సు ఒకటి ప్రకటించడం. యీ సంస్కరణ లన్నింటికీ కాంగ్రెసు ప్రభుత్వాలను అభినందించవలసినదే. కాని యివి సత్యమూర్తి చెప్పిన విప్లవ కార్యక్రమం మాత్రం కాదు.

హైదరాబాద్ సత్యాగ్రహం విలుపుదల.

సుమారు 10,000 మంది ఆర్యన్ సత్యాగ్రహులు హైదరాబాద్ జైళ్లలోనానాఅవస్థలుపడిప్రభుత్వంయొక్క నిరంకుశత్వాన్ని ప్రపంచానికి వెల్లడిచేసి కొన్ని హక్కులు సంపాదించగలిగారు. మతసంబంధమైన లేక యితర సంస్థలు స్థాపించుకొనడానికి, మతవిషయిక సభలు ప్రభుత్వానికి తెలియజేయ నవసరము లేకుండానే పెట్టుకోవడానికి, ఊరేగింపులకు ఒకసారి అనుమతి పొందితే ఇకయెప్పుడూ జరుపుకోవడానికి, పూజలు వగైరా చేసుకోవడానికి తాత్కాలిక ప్రదేశమయితే అనుమతి పొందనవసరం లేకుండాను, హక్కులిస్తూ నైజాం ప్రభుత్వమొక ప్రకటన చేసింది. రెండుమూడు రోజుల్లో సత్యాగ్రహులందరినీ విడుదల చేయబోయే వార్తలుకూడా వస్తున్నాయి. ఈపరిస్థితులలో ఆర్యన్ సమితివారు సత్యాగ్రహం ఆపుచేశారు.



తప్పటడుగులు – వెక్కిరింతలు

సెంట్రల్ అసెంబ్లీ కాంగెసు పార్టీ డిప్యూటీ లీడరు సత్యమూర్తి, "గవర్నర్ల ప్రత్యేకాధికారాలను కాంగ్రెసు మంత్రులు పాతిపెట్టేశారు" అని కోతలు కోసాడు గోవా మీటింగులో. బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వాన్ని కాపాడటానికి ఏర్పడిన 'లా అండ్ ఆర్డరు' లను రక్షించడమే కాంగ్రెసు మంత్రుల కర్తవ్యమను కొంటే యిది నిజమేగావచ్చు. ఏమంటే గవర్నర్ల ప్రత్యేకాధికారాలు బ్రిటీషువారి దోపిడీ హక్కులను కాపాడు కోటానికే, భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అణచివేయ డానికే, ఏర్పరచబడ్డారు. అందుకొరకే ఏర్పడిన "లా అండ్ ఆర్డరు" లను కాంగ్రెసు మంత్రులే కాపాడుతూంటే యింకా ప్రత్యేకాధికారాల అవసరమెందుకు? అలాగాక కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలోని ప్రజాహక్కులను వృద్ధిచేయడం, స్వాతంత్ర్యోద్యమానికి తోడ్పడటం, కాంగ్రెసు మంత్రుల కర్తవ్యమనుకొంటే గవర్నర్ల ప్రత్యేధికారాలు ఎల్లవేళలా ప్రత్యక్షమే. ఒరిస్సా టెనెన్సీ బిల్లు, సరిహద్దు ప్రభుత్వపు నిర్బంధశాసనం రద్దుచేయు బిల్లు వగైరా ప్రజాహక్కుల కాపాడే శాసనాల నాపు చేసింది ప్రత్యేకాధికారాలుకాదూ?

ప్రజాహక్కులకొరకు పోరాటముంటే ప్రత్యేకాధికారాలు ప్రయోగించ బడుతాయి. పోరాటాన్ని పాతిపెడితే యివీ అంతర్ధాన మయినటుల కాన్పించుతాయి. మొదటిది అక్కరలేని సత్యమూర్తి భాయీ రెండో దాన్ని పాతిపెట్టానిని నృత్యం చేస్తాడు!

* * *

స్వదేశీ సంస్థానాల మోక్షము ఫెడరేషనులో చేరితేనే సుమా! అని సంస్థానాధీశులను హెచ్చరించుతున్నాడు శ్రీమాన్ సత్యమూర్తి. సింధు రెవిన్యూ మంత్రి వజీరానీ, "సింధు రాష్ట్రం ఆర్థిక సహాయము కోసం ఫెడరల్ ప్రభుత్వముపై ఆధారపడాలి, అందుచే మేము కాంగ్రెసులో చేరడానికి సిద్ధముగా వున్నాము" అన్నాడు.

ఫెడరేషన్ భగ్నము చేయాలనే కాంగ్రెసువారికి వుండవలసిందేనా ఆ తహ తహ!

ఫెడరేషన్ నాశనము గావించే కాంగ్రెసు నుండియేనా యీ ఫలాపేక్ష?

* * *

గుంటూరు జిల్లా హెడ్ క్వార్టర్సుకు రిక్రూటింగు కొరకు కొన్ని వందలమంది అభాగ్య యువకులు వచ్చారు. స్థానిక సోషలిస్టులు వారిని సైన్యములో జేరవద్దని ప్రబోధము చేశారు. కాంగ్రెసు తీర్మానము యుద్ధములో బ్రిటనుకు ఎట్టి సహాయము చేయరాదని చెబితే కాంగ్రెసు ప్రభుత్వములోనే యిదేమిటి అని స్థానిక శాసన సభ్యునివద్దకు వెళ్ళి ప్రశ్నించారు.

పాపం! ఆ శాసన సభ్యుడు ప్రధాని రాజాజీకి టెలిఫోన్ కాల్సు పంపాడు. "రాజాజీ, యిచట రిక్రూటుమెంటు జరుగుతోంది ఏమి చేయమంటావ్?" అని ప్రశ్నించాడు. కాని మూడుసార్లు ఒకే జవాబు, రాజాజీ "నిద్ర పోతున్నారు".

ఆ ఎం. యల్. సి యింకా పైవాళ్ళ సలహాకొరకు చూస్తే లాభము లేదనుకొన్నాడు. బాగా ఆలోచించి 'టంకముపొడి' కనిపెట్టాడు. అతడన్నాడట, "కాంగ్రెసు తీర్మానము యుద్ధములో సహాయం చేయరాదని గదా! చేస్తుంటే అడ్డు తగలమని తీర్మానము చేయలేదు గదా!"

"మంత్రుల మీదగాని, వర్కింగు కమిటీవారి మీదగాని నాకు సర్వాధికారం లేదు.... వర్కింగు కమిటీ వారి సభలకు నేను వెళ్లనే వెళ్లను. ఆకమిటీవారితీర్మానాలు - చాలవరకు - సభలో అంగీకరించిన తరువాతనుగాని నాకు తెలియనే తెలియవు. అపుడయినా పత్రికల ద్వారానే తెలుస్తుంటాయి." అని గాంధీజీ యీ వారపు హరిజన్‌లో వ్రాశాడు.

అధ్యక్షుని ఎన్నికానంతరము, అది పట్టాభి ఓటమి కాదు; నా ఓటమి" అని మహాత్ముడు ఆక్రోశించిననాడు; త్రిపురీలో పంత్ తీర్మానము నెగ్గించుకోడానికి వర్కింగుకమిటీ సభ్యులు, మంత్రులు గాంధిపేరును వినియోగించునపుడు; కలకత్తా ఎ. ఐ. సి. సి. సభల సమయములో వర్కింగు కమిటీలో 4 స్థానాలు తీవ్రవాదుల కిచ్చుటకు అంగీకరించిన అజద్ సూచనను గాంధీజీ మొండిగా నిరాకరించినపుడు....

ప్రజలెవ్వరు గాంధీజీకి వర్కింగు కమిటీపై అధికారము లేదని అనుకోలేదు. 1934 లో బొంబాయి కాంగ్రెసు అనంతరం గాంధీజీ 0-4-0 సభ్యత్వం వదలుకొన్నప్పటి నుండీ కూడా దాదాపు అన్ని వర్కింగు కమిటీ సభలు గాంధీగారుండే ప్రదేశానికి సమీపంలోనే వేస్తూ వచ్చారు. అందులో హెచ్చుగా వార్ధాలోనే జరిగాయి. గాంధిగారితో సంప్రదించుటకు గాకపోతే వార్ధాకు ప్రత్యేక హక్కు, పవిత్రత లేమి లేవుగదా?

వర్కింగు కమిటీ "తీర్మానాలు పత్రికల ద్వారానే తెలుస్తుంటాయి. అనే మాటలు 'సత్య, అహింసలు' ఎల్లపుడూ జపించే మహాత్ముడు పలుకవలసినవిగావు. తదనుచరులయితే అల్పులైతే లెక్క సేయక పోవచ్చు- కాని మహాత్ముడే!

పూజారి మోసాన్ని ఎదుర్కొనవచ్చు! కాని మూల విరాట్టే దగా చేస్తే?

* * *

"హిందూ ముస్లిమ్ సఖ్యతకోసం నాహృదయం తపిస్తోంది" "మహాత్ముని ఆవేదన" యివి యీవారపు కృష్ణాపత్రికలో 21 వ పేజీ శీర్షికలు. ఆ పత్రిక సంపాదకీయంలోనే ఈ మాటలున్నాయి. "శిష్టాచార సంపన్నులైన బ్రాహ్మణులు, గోమాంస భక్షకులైన ముస్లింగులీగర్లు, అసలు మతాలేమిటని వాదించే సామ్యవాదులు కలిసి, కాంగ్రెసును నాశనం చేయకలిగితే అదీ ఘన కార్యమే."

యీ విధంగా ఛాందసులను రెచ్చగొట్టడం, పై మహాత్ముని ఆవేదనకు మంగళహారతియో లేక సాంబ్రాణి ధూపమో?

* * *

దేవుళ్ళమీద సోషలిస్టులకు నమ్మకములేక పోవచ్చు. కాని, సోషలిస్టులు సమాజములో ఎట్టి కృత్రిమ విభేదాలుండగూడదని, మానవుడూ మానవునీ మధ్య అంతర్యాలుండరాదనీ బోధిస్తారు. సమాజ విప్లవాన్ని కోరతారు.

సోషలిస్టులు, తాము కోరే విప్లవము రాకపోయినా, అస్పృశ్యతా నివారణ, విధవా వివాహం, అంతర్వర్ణ వివాహం, రజస్వలానంతర వివాహము, సర్వవర్ణ భోజనం, మొదలయిన సంస్కరణలను ప్రోత్సహిస్తారు. ప్రోత్సహించడమేగాక, ఆచరణలో చూపెడుతున్నారు.

అలాంటి సోషలిస్టులు, దేవాలయ ప్రవేశపు బిల్లు పెట్టినందువల్ల సనాతనులతో, ముస్లిం లీగర్సుతో కలుస్తారట! నాశనము చేస్తారట!

ఇలాంటి వ్రాతలు వ్రాయడానికి కృష్ణాపత్రికకు వృద్ధాప్యంవల్ల మతన్నా చెడి ఉండాలి, లేదా అనవసరంగా అపవాదులువేసి నాల్గు చివాట్లు తినడం సర్దా అయినా ఉండాలి!

మేం అస్పృశ్యతకు కంకణము కట్టుకున్నామని వీధులలో లెక్చర్లుకొట్టి, ఇంటివద్ద మాత్రం 'కొంచెం దూరముగా ఉండు. మా ఆడవాళ్లు ఊరుకోరు' అనే వాళ్లు సోషలిస్టులలో ఎవరూలేరు. ఉంటే గింటే, కాంగ్రెస్ పెద్దల్లోనే ఉన్నారు.

* * *

12 వ తేదీ ఆంధ్రప్రభ సంపాదకీయంలో "సుభాష బాబూపై ద్వేషము చేతనో, మరే కారణము చేతనో వర్కింగు కమిటీ చేసిన ఒక ఘోరకృత్యముగా దీని నెవ్వరైనా వర్ణించబోతే, వారికి చూడ కండ్లుగాని, గ్రహించ బుద్ధిగాని లేవనే చెప్పాలి." అంటూ ఆంధ్రప్రభ వ్రాసింది.

వర్కింగుకమిటీ చర్యలను ఖండించిన తోటి 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సంపాదకులకు ఈ మాటలు వర్తిస్తాయనుకుంటే, ఆంధ్రప్రభకు ఇంత నోటి తొందర ఉండేది కాదేమో.

* * *

11 వ తేది మాకార్యాలయానికి విచిత్రమైన కవరు వచ్చింది. పైన ప్రెస్ మాటరు, బుక్‌పోష్టు అనివుంది పాలకొల్లులో పోష్టయింది. బహుశా "చీనా రోదనం" నాటకంలోని భాగము పంప బడివుంటుంది. closed against inspection అని 0-1-0 డ్యూ ముద్రవేయబడింది. కాని, బిళ్ల ఎచటాలేదు. అసలే అంటించకపోతే 0-2-0 వేసి వుండేవారు. తీరా కవరు చించితే ప్రెస్‌మాటరు లేదు: ఒక ఎన్వలెప్ కట్టపై వుండే రాపర్' వి. పి. కౌపన్ వుంది. కౌపన్‌మీద పెన్సిలుతో ఇంగ్లీషున "పోలీసుస్టేషన్, ట్రాన్స్‌ఫర్డ్, ఓల్డ్‌పోష్టాఫీస్" అని వుంది.

కవరులో అసలు పంపిన 'చీనారోదనం' నాటకంలోని భాగం ఏమయింది? కార్యాలయానికి వచ్చే వుత్తరాలపై సాధారణంగా విప్పి మళ్ళీ అతికించిన గుర్తులు వుంటూ వుంటాయి: ఇపుడు రాష్ట్రంలో చల్లని కాంగ్రెసు ప్రభుత్వము వుంది. సెంట్రల్ ప్రభుత్వము సైతం అసాధారణ పరిస్థితులున్నాయి గాన ఉత్తరాలు సెన్సారు చేస్తామని ఎట్టి గజెటు ప్రకటనా చేసి వుండలేదు. కాని మా కార్యాలయానికి వచ్చే ఉత్తరాలను యవరో కొట్టివేయడం జరుగుతోంది, ఇదేమి నాగరికతా ప్రభుత్వ లక్షణం?

సి. ఐ. డి. శాఖవారు (లాకు విరుద్ధముగానే)తనిఖీ చేస్తారనే సంగతి రాజకీయాల్లో వున్నవారికి తెలసిన సంగతే. కాని ఆ చూచిన పెద్దమనిషి అసలు వస్తువునే కొట్టివేయడ మెందుకు? ఈసారి మతిభ్రమలో వుండి ఏదో చెత్తపెట్టి తిరిగి అతికించి పంపబట్టిగాని అసలే హజామత్ చేస్తే, మాకు తెలిసే వుండేదికాదు. ఇలా ఎన్ని ఉత్తరాలు హజామత్ అవుతున్నాయో?

ఇప్పటికైనా ప్రభుత్వమువారు, పోష్టల్ డిపార్టుమెంటువారు, విచారించి, సి. ఐ. డి. పెద్దమనుష్యులచే, ఆ జాబును మాకు పంపిచాలని హెచ్చరిస్తున్నాము.

[టెర్రరిస్టు వుద్యమాన్ని (వ్యక్తిగత హింసా వాదాన్ని) గురించీ, టెర్రరిస్టులను గురించీ తెలుసుకోవాలనే కోరిక ప్రజా సామాన్యంలో-ముఖ్యంగా యువజన సముదాయంలో గాఢంగా వుంది. టెర్రరిస్టు విధానం అనుసరింప తగ్గది కాకపోయినా టెర్రరిస్టుల దేశభక్తి, త్యాగం ధైర్య సాహసాలు ప్రతి యువకుడున్నూ ఆదర్శంగా తీసుకొని అనుసరింప దగినవి.

ఈ వుద్దేశంతోనే నేను హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ కమాండర్ ఇన్ చీఫ్ అయిన అజాద్ జీవితమును మీ ముందుంచు చున్నాను.]

• టెర్రరిజం – వ్యక్తిగత హింసావాదం

జీవితగాధ

చంద్రశేఖరఅజాద్

కామ్రేడ్ గద్దె లింగయ్య

కాశీపురం అతని జన్మస్థానము. తండ్రిపేరు సైతనాధుడు. అతనకు సంస్కృతమందు మిక్కుటమగు మక్కువ. చంద్రశేఖరుడు మాతృభాషయైన హిందీ చదువుచుండగనే సంస్కృత పాఠశాలలో ప్రవేశపెట్టాడు తండ్రి.

గాంధీజీ 1921 సంవత్సరంలో సహాయ నిరాకరణ శంఖము పూరించెను. ఆయన విలువు దేశ మందెల్లెడల ప్రజాసామాన్యమందే గాక విద్యార్థులందును సంచలనము కలిగించినది. వేలకొలది విద్యార్థులు కాలేజీలను, స్కూళ్ళను బహిష్కరించారు. కాశీలో సంస్కృత విద్యార్థులుకూడా చదువుకు స్వస్తిచెప్పారు. అట్టివారిలో చంద్రశేఖర్ ఒకడు. అప్పుడాతడు పక్కా అహింసావాది. దీక్షపట్టిన స్వయం సేవకుడు.

చిన్నగా 14-వ ఏడు నిండని అల్పవయస్సునందే చంద్రశేఖర్ చూపిన ధైర్య మసమానం. పట్టుదల మెచ్చదగినది. అతడెన్నో పాఠశాలలకు – హైస్కూళ్ళకువెళ్లి వందల కొలది విద్యార్థులకు ప్రబోధము చేసాడు.

ఆ రోజుల్లో ఆందోళనచేయడం సామాన్యం కాదు. ఆందోళనలో పాల్గొన్నవారి ననేక రక్కముల బాధించేది ప్రభుత్వం. ఎలాగైనా వుద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ఎన్నో ఎత్తులు వేసింది. యుక్తులు పన్నింది. గాంధీగారు చెప్పినట్లు విద్యార్థులు పాఠశాలల నైతే బహిష్కరించారు. గాని వుద్యమంలో పాల్గొన సాహసించలేకపోయారు. అట్టి సమయంలో కాశీలో 15 సం॥ల ప్రాయమైనాలేని బాలకులు ఆయిదారుగురు సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని అరెస్టు చేయబడ్డారు. ఆ కొద్దిమంది లోనూ చంద్రశేఖర్ ఒకడు.

అరెస్టుచేసి తీసుకొనిపోయి కోర్టులో నిలబెట్టబడినప్పుడు 'నీ పేరేమి?' అన్న మేజిస్ట్రేటు ప్రశ్నకు చంద్రశేఖరుడిచ్చిన జవాబు బాల్యంలో అతడెట్టి ధైర్యశాలియో, స్వేచ్ఛా ప్రకృతులు కలవాడో తేటపరుస్తుంది. "నా పేరు ఆజాద్ నా తండ్రి పేరు స్వతంత్రుడు. నా నివాసము జైలు" అన్న అతని సమాధానం అందర్నీ చకితుల గావించినది.

ఒక కుర్రవాడు కోర్టులో తమ ఎదుటనే నిర్భయంగా అట్టి సమాధాన మివ్వడం అధికారులు సహించలేకపోయారు. మెజిస్ట్రేటు కుపితుడయి వెంటనే అతనికి బెత్తంతో 15 దెబ్బలు కొట్టుటకు ఆజ్ఞాపించాడు. బాలుని ధీరత్వానికి ముట్టిన బహుమతులవి. పోలీసులు చంద్రశేఖర్‌ను కొయ్యకుముందు త్రాడు కట్టబోతే "కట్టడమెందుకు? నిలబడే వుంటాను. కొట్టుకోండి" అన్నాడతను. దెబ్బలు నిజంగా కొడతారా? అని అక్కడ హాజరుగా వున్న ప్రజలు విచారపడసాగేరు. పెద్ద వాళ్లుకూడా భయంతో వణకిపోయారు. చంద్రశేఖర్ మాత్రం నిర్భీతిగా నిలబడి దెబ్బల కెదురు చూస్తున్నాడు.

ఒక్కొక్క దెబ్బ పడుతూవుంటే 'వందే మాతరం, గాంధీకిజై' అనే నినాదాలతో సమాధానమిచ్చాడు చంద్రశేఖర్. దెబ్బలకు చర్మం వూడిపోయింది. రక్తం వరదలై పారజొచ్చినది. ఇంకనా సుకుమార బాలకుడు సహించ లేకపోయినాడు. స్పృహతప్పి నేలకొరిగాడు. అయినాగాని దెబ్బలు పూర్తిచేయబడ్డాయి. కొంతసేపటికి స్పృహరాగానే చంద్రశేఖర్ లేచి కాలినడకనే యింటికి వెళ్లిపోయాడు.

చంద్రశేఖరుని దెబ్బలు కొట్టినవార్త పట్టణమంతటా వ్యాపించింది. ప్రజలతన్ని చూచుటకు గుంపులు గుంపులుగా వెళ్ళారు. చంద్రశేఖర్ ఎంతమాత్రం విచారపడలా. ముఖం మీద దుఃఖచిహ్నాలేమీ కన్పించలా. కోర్టులో దెబ్బలు అతని శరీరంమీదే కొట్టబడినా అవి అతని హృదయాన్నే గాయపర్చినవి. నాటి నుంచే అతడు విద్రోహిఅయినాడు. ఆ అమానుష శిక్షకు ప్రతీకారవాంఛ అతని హృదంతరాళంలో స్థిరవాస మేర్పరచుకుంది. అనాటి దెబ్బల మచ్చలు అతని అంతరాత్మలో ఆజన్మాంతం మానిపోకుండావున్నాయి. ఆచిన్న కుర్రవాడి ధైర్యసాహసోత్సాహాలు చూచిన వారూ విన్నవారూ కూడా ఆశ్చర్యచకితులయ్యారు. అనాడు కోర్టులో తనపేరు 'అజాద్' అని చెప్పుకున్న చంద్రశేఖర్ ఆజన్మాంతం అజాద్‌గానే వున్నాడు. నాటినుంచీ అతన్ని అజాద్ అనే అందరూ పిలిచేవారు. మరి అతడా పేరుతోనే ప్రసిద్ధిచెందినాడు.

కాశీలో అజాద్ పేరు మారుమ్రోగింది. పురవాసులు గొప్ప సభచేసి అతన్ని సన్మానించారు. సభలో వేయబడ్డ పూలహారాల్లో చంద్రశేఖర్ మునిగితేలాడు. పత్రికల్లో అతని ఫొటోలు ప్రకటింపబడినై. ప్రజాసామాన్యం అతని ధైర్యసాహసాలను వేనోళ్ళ పొగడింది.

సహాయ నిరాకరణం చల్లబడింది. ప్రజల్లో వేడితగ్గింది. కాంగ్రెస్ నాయకులు పోరాటాన్ని బంద్ చేయడం యువకులకు రుచించలా. ఆజాద్‌కు చాలా విచారమూ, నిరాశాకలిగింది. అతనికి అహింసాయుత సత్యాగ్రహమంటే విశ్వాసం పడలిపోయింది. అహింసావాదమంటే రోత పుట్టింది. క్రొత్తమార్గం వెతుకోసాగేడు.

వ్యక్తిగత హింసావాదం (టెర్రరిజం) మళ్లీ చెలరేగింది. వుత్తర హిందూస్థానంలో అన్ని ప్రాంతాలందునూ టెర్రరిస్టు దళాలేర్పడినై. కాశీ చాలా కాలంనుంచీ టెర్రరిస్టు వుద్యమానికి కేంద్రంగా వుంది. శచినిహారీ బోసు రంగంలో ప్రవేశించి నప్పటినుంచీ కూడా కాశీ టెర్రరిస్టు వుద్యమ చరిత్రలో ప్రాముఖ్యత వహించేవుంది. మళ్ళీ అప్పుడు అన్నిశాఖలా దళాలేర్పడుతూ వుంటే కాశీ వెనుకబడుతుందా? ఇక్కడకూడా దళమేర్పడింది.

అహింసావాదంతో అసంతృప్తి చెందిన అజాద్‌ను సహజంగానే హింసాత్మక భావాలు ఆకర్షించినాయి. అరోజుల్లోనే శచీంద్రనాధబక్షీ, రాజేంద్రనాధ లహిరీలతో స్నేహమేర్పడింది. వారిని తరుచుగా కలుసుకుంటూ వుండేవాడు. పెద్దవాళ్ళ పోరుపడలేక ఆజాద్ మళ్ళీ చదువు నిమిత్తం కాశీవిద్యా పీఠంలో చేరాడు. కాని అతనికి చదువుమీద దృష్టిలేదు. టెర్రరిస్టులను కలుసుకోవడమంటే ఆసక్తి హెచ్చైనది. అందు చేతనే చదువు సున్నాచుట్టింది. పార్టీలో ప్రవేశించాడు.

పార్టీకి క్రొత్తసభ్యులను చేర్చడం, దళాలు స్థాపించడం చేస్తున్నప్పటికి సమర వ్యవహారాల్లో మరింత వుత్సాహంతో పాల్గొనేవాడు. అందులో అతనిది అందెవేసినచేయి. అతని సాహసాన్ని ప్రతివారూ మెచ్చుకునేవారు. భయం అనేది అతని డిక్షనరీలోనే లేదు. అవసర సమయాల్లో ఎంత వుపద్రవ కరమైనాసరే ముందుకు దూకేవాడు.

1924 సంవత్సరం. అప్పటికన్ని ప్రాంతాల్లోనూ టెర్రరిస్టు దళాలేర్పడి వున్నయి. కాని అన్నీ రాష్ట్రియ సంస్థలుగానే వుండిపోయాయి. సచీంద్రనాధ సన్యాల్, రామ్‌ప్రసాద్ బిస్మిల్, యోగేశ చంద్రచటర్జీలు వుత్తర దేశమంతా తిరిగి టెర్రరిస్టు సంస్థలన్నిటినీ కేంద్రకృతం చేసి హిందూస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్. అను పేరుతో యావద్భారత సంస్థను స్థాపించారు. ఆజాద్, భగత్సింగు వగైరా యువకులనేక మంది అందులో చేరారు. అప్పటినుంచీ ఆజాద్ అందులోనే పనిచేస్తూ వచ్చాడు.

అజాద్ ఏమంత విద్యావంతుడు కాదు. అయినా అతని సాహస చర్యలముందు ఎవరూ నోరెత్తగలిగేవాడు కాదు. భగత్‌సింగ్, భగవతీచరణీ లిద్దరూ బాగా చదువుకున్నవాళ్ళు. దేశీయ విషయాలనే కాక అంతర్జాతీయ సమస్యలను కూడా హృదయ గ్రాహ్య మొనర్చుకున్నవారు. వారిద్దరూ ఆజాద్‌కు కుడిభుజంగా పనిచేశారు. అందువల్లనే వైజ్ఞానికంగా అతని కున్నలోటు తీరిపోయింది.

1925 సం॥ అగస్టు 9 వ తేదీని కాకోరీవద్ద రైలు నాపి దోపిడీచేసిన వారిలో ఆజాద్ కూడా వున్నాడు. కాకోరీ కుట్రకేసులో అతడు ప్రధాన కుట్రదారుగా ఎంచబడ్డాడు. కాని అతను దొరికితేగా? కాశీపట్టణమంతా గాలించారు. ఊ హూ అతడెక్కడా కన్పించలా. యు. పి. గవర్నమెంటు అతన్ని పట్టిచ్చిన వారికి రెండువేల రూపాయల బహుమతి ప్రకటించింది. ఇంతకూ అతనెక్కడున్నదీ ఎవరికైనా తెలిస్తేనా? అనలతడెప్పుడూ అంటూండేవాడు "నా బొందిలో ప్రాణముండగా పట్టుకోలేర"ని తన ఈ ప్రతిజ్ఞను కడవరకూ నెగ్గించుకున్నాడు కూడాను.

అజాద్ కాశీనుంచి పారిపోయి ఝాన్సీవద్ద అడవిలో దాక్కున్నాడు. కొన్నిరోజుల కాసంగతి పోలీసులకు తెలిసింది. అయితే పోలీసులకావార్త తెలిసేప్పటికి ఆజాద్ ఝాన్సీ పట్నంలోనికి చేరుకున్నాడు. అక్కడి స్థానిక టెర్రరిస్టు దళంతో కలిసి వుండసాగినాడు. ఎక్కడవున్నా వూరకె కూర్చునే మనిషికాదు. అజాద్ అక్కడున్న సమయంలోనే మోటారు డ్రైవింగూ రివాల్వర్ షూటింగూ నేర్చుకున్నాడు. ఈరెండు పనులూ తరువాత జీవితంలో అతనికి బాగా వుపయోగించాయి. ఆ విద్యల్లో మంచి ప్రావీణ్యత సంపాదించాడు. షూటింగులో మరీని. అతని గురి అసమాన మైనది.

కాకోరీ కుట్ర సందర్భంలో అనేకమంది పట్టు బడ్డారు. వారల జైళ్లలో నుంచి తప్పించేందుకు ఆజాద్ ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కాని అన్నీ విఫలమైనాయి. రాంప్రసాద్ బిస్మిల్ వగైరా ముగ్గురకు వురిశిక్ష విధించబడింది. మిగతావారికి జన్మాంతర, దీర్ఘకాల కారావాసము విధించబడింది. అజాద్‌కు పిచ్చెత్తినట్లయింది. అప్పుడతనివద్ద ఒకేఒక మోటు తుపాకి వుంది. దానితోనే అధికారులమీద కసి తీర్చుకోవాలనుకున్నాడు. కాని ఏమిటి లాభం? ఒక తుపాకీతో ఏమౌతుంది? పైగా చేతులార చే జిక్కడం తప్ప. చాలామంది మిత్రులు తన్నుప్రయత్నంనుంచి విరమింప జేశారు.

ఇంతలో పార్టీ సభ్యుల్లో మిగిలిన వాళ్లుకూడా బెదరిపోయారు. యు. పి. లో అజాద్‌కు ఆశ్రయ మిచ్చేవాడే లేకపోయాడు. హతాశుడై ఆజాద్ బొంబాయి వెళ్లాడు. అక్కడకూడా తిండి పెట్టే గతి లేకపోయింది. ఓడరేవులో సామాను మోసే కూలీగకొన్నాళ్లున్నాడు. జీవనోపాధికంతకంటే మార్గం గోచరించలా. ప్రొద్దు అస్తమానం పని చేస్తే తొమ్మిదణాలతో పొట్టనింపుకుని నాల్గణాలతో ప్రతి రోజూ సినిమా చూస్తుండెవాడు. సినిమావదలిన తర్వాత రాత్రి 12 గంటలకు ఓడలరేవులోనే ఎక్కడో కాస్సేపు కన్నుమూసేవాడు. ఎంతటి వీరుడైనా పూటికి కరవై దరిద్రం అనుభవించకతప్పుతుందా. ఆజాద్ వుదర పోషణకు కూలీగా వున్నాడేగాని మళ్ళీ పార్టీని కూడదీసి పనిచేసే దెట్లాగా అని అదనుకు ఎదురు చూస్తూనే వున్నాడు. కొంతకాలం గడిచింది. కాకోరీ కుట్రకేసును ప్రజలు మరచిపోయొచ్చారు. ప్రభుత్వపు హడావిడి కొంతతగ్గింది. వాతావరణము శాంతించుట చూచి ఆజాదింక బొంబాయిలో వుండలేకపోయినాడు. వెంటనే బయల్దేరి వచ్చాడు. ఛిన్న ఛిన్నమైన పార్టీకి పదవీ కాంక్షులైన పిరికి పందలు నాయకులయ్యారు. వారిలో ప్రతీకారవాంఛ మచ్చుకైనా లేకపోయింది. పార్టీ దుస్థితికి ఆజాద్ హృదయం క్షోభించిపోయింది. మళ్ళీ ఎలాగైనా పార్టీని వునరుద్ధరించుటకు తీవ్ర కృషిచేయసాగాడు. అప్పటికి ప్రాతసభ్యులలో భగత్సింగు కూడా మరి కొందరను కలుపుకొని కార్యనిర్వహణకు ప్రయత్నిస్తూనే వున్నాడు. మరి అతనికి ఆజాద్ అంధకారంలో దివ్యజ్యోతిగా లభించాడు. యిద్దరూ కలిసిపని కుపక్రమించారు. అనంతరం వారిద్దరూ పార్టీ నిర్మాణంలో లక్ష్యంలో తెచ్చిన మార్పులే టెర్రరిస్టు వుద్యమ చరిత్రలో నూతనాధ్యాయమును ప్రారంభించినవి. భగత్సింగు మార్క్సిజాన్ని బాగా మననం చేశాడు. సోవియటు రష్యాను గ్రమనించాడు. మన దేశానిక్కూడా సోషలిస్టు సోవియట్ యూనియన్ అత్యవసరమని గ్రహించాడు.

తాను గ్రహించినది ఆజాద్‌కు సూచి పోశాడు ఇద్దరూ కూడబలుక్కున్నారు. అనుచరులకు నచ్చ చెప్పారు. వెంటనే "హిందూస్థాన్ రిపబ్లికన్ అసోషియేషన్"ను "హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ"గా మార్చారు. ఆ స్వతంత్ర సైన్యాన్ని నడుపవగ్గ సమర్థుడు ఒక్క ఆజాద్‌మాత్రమే. పార్టీ సభ్యులందరు అతని నాయకత్వా న్నేకగ్రీవంగా అంగీకరించారు. అప్పటినుంచీ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీకి ఆజాద్ సర్వసేనాపతి. ప్రారంభంలో అందరిలాగా అజాద్‌కూడా ఆస్తికుడే. పార్టీలో చేరిన తర్వాత దేవాలయానికి వెళ్ళిపూజించేందుకు అవకాశం లభించేదికాదు. అందువల్ల మట్టితో ఈశ్వర విగ్రహం చేసి దానినే భక్తితోపూజించేవాడు. మతపిచ్చికూడా బాగా వుండేది. ఎప్పుడైనా తప్పనిసరియగుచో పర మతస్థుల భోజనం తినేవాడే కాని తరువాత మళ్లీ తప్పకుండా స్నానపూజాద్యనుష్ఠానములతో ప్రాయశ్చిత్తము చేసుకొనేవాడు. అయితే భగత్సింగు సనాతనాచార మౌఢ్యతను బోధపర్చిన తరువాత ఆజాద్ నిరీశ్వరవాది అయ్యాడు. ఫొటోలో అతను జందెముధరించి వున్నాడు. కాని కడపటిదినాల్లో దాన్ని త్యజించి వేశాడు. తాను నమ్మినది చేయడానికెప్పుడూ వెరచేవాడు కాదు.

ఆజాద్ మొదట్లో అహింసావాది. తరువాత టెర్రరిస్టు. చివరకు సోషలిస్టుగా మారేడు. ఈవిషయంలో అనేకు లనేకవిధాలుగా వాదించుతున్నారు. జవహర్‌లాల్ అతన్ని ఫాసిస్టుఅనే వ్రాసేశాడు తన ఆత్మకథలో. నేనుమాత్రం అతనుకూడా తక్కిన అతని అనుచరులువలెనే సోషలిస్టుగా మారివుండే వాడంటాను. అందుకు అతను, అతని అనుచరుడు భగత్సింగు వగైరాలు సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీని స్థాపించి ప్రకటించినవారి వుద్దేశాలే ఆధారములు. అయితే అప్పుడు వారు అవలంబించిన విధానము టెర్రరిష్టు మార్గమునే అనుసరించిన మాట నిజమే. కాని వారు హిందూదేశంలో కార్మిక నియంతృత్వాన్ని స్థాపించాలనే లక్ష్యమునె తల్గియుండిరి. కార్మిక-కర్షకులందు వర్గచైతన్యం కలిగించి పోరాట శక్తులను సంఘటిత మొనర్చిననేగాని గమ్యస్థానము చేరలేమనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి అవలంబించక తప్పుత్రోవపట్టేరు. ముందుగా వేలకొలది యువకుల్ను తయారు చేయాలనీ, యువజన సముదాయంతో—ముఖ్యముగా విద్యావంతులైన నవయువకుల్లో రాజకీయ చైతన్యం కలిగించి సాయుధ పోరాటములకు తలపడినచో ప్రస్తుత సామాజిక వ్యవస్థలోవున్న కుళ్లను ప్రజాసామాన్యం కళ్లుతెరచి గ్రహించుతుందనీ, అప్పుడుగాని ప్రజలు పోరాటంలో పాల్గొనరనీ వారినమ్మకం. ప్రజాసామాన్యాన్ని పోరాటంవైపు కాకర్షించేందుకు తీవ్ర విమర్శనలూ, వుద్రేకపూరిత వుపన్యాసాలూ, విద్రోహకర పత్రాలూ మాత్రమే చాలవనీ సాహసంతోకూడిన ప్రదర్శనాలు అవసరమనీ నిశ్చయించుకున్నారు. తరువాత వారు చేసిన పనులన్నీకూడా ఆ నమ్మకంతోనే. విప్లవానికి అడ్డుగోడలు లేవని, ప్రజాసామాన్యంయొక్క దినదిన కోర్కెలకోసం పోరాడి వారిలో చైతన్యం కలిగించి, రాజకీయ రంగంలోకి తెస్తేగాని విప్లవం సాధ్యపడదని వారు గ్రహించలేక పోయారు.

ఆజాద్ నిరాడంబరుడు. కట్టుబట్టలకుకూడా అతడు విశేషధనము వెచ్చించే వాడుకాడు. మిత్రులు బలవంతంచేస్తేనేగాని పాతబట్టలు వదిలేవాడుకాదు. చినిగి మాసిపోయిన అతని దుస్తులే అతన్ననేక పర్యాయములు శత్రువులు గుర్తించకుండాచేసి విపత్ సమయాల్లో కాపాడినవి. పార్టీకెన్ని తిప్పలుపడి అయినా పైకం చేకూర్చేవాడు. కాని స్వార్థానికి ఒక్కదమ్మిడీ కూడా తీసుకునేవాడు కాదు. ఒక పర్యాయం ఆజాద్ తలిదండ్రులు తిండికిలేక చాలా అవస్థ పడుతున్నారని తెలిసి పార్టీ సభ్యులు రెండువేల రూపాయలు ఇంటివద్ద ఇచ్చిరమ్మని ఆజాద్‌కు యివ్వబోయినారు. అతను తీసుకొనక "ముసలి పీనుగులకు రెండువేలెందుకు? రెండు గుప్పెళ్లు చాలు. ఆరెండింటితోనూ వాళ్ళజీవితాలు వెళ్ళిపోతాయి. అందరికీ సంసారాలున్నాయి. మరి అందరమూ ఇలాగే తీసుకుంటే పార్టీ పని ఏమవుతుంది? మన సంసారాలకోసమా పార్టీ సొమ్ము" అన్నాడట.

1928 సం॥ లో సైమను కమిటీ వచ్చింది యిండియాకు. లాహోరు వెళ్ళారు. లజపతిరాయి అధ్వర్యం క్రింద నల్లజెండాలతో జవాబిచ్చారు ప్రజలు. ప్రభుత్వాధికారులా యవమానమును సహించలేక పోయారు. లాఠీలు ప్రయోగించారు. పంజాబ్‌కేసరిమీద కూడా చెయి చేసుకున్నారు. అనాటి లాఠీదెబ్బే లజపతిరాయి ప్రాణం తీసింది. నాయకులు ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు, దేశంలోని అన్ని ప్రాంతములందలి ప్రజలు నిరసించారు. కాని యువజన ప్రకృతి వేరు. వారు విమర్శనలతోనూ, నిరసనతోనూ తృప్తిచెందరు. ప్రతీకారమె వారి ప్రత్యుత్తరము.

లాఠీఛార్జి చేయించిన డిప్యూటీ పోలీసు సూపరింటుండెంటును హతమార్చేందుకు భగత్సింగు రాజగురులు నియమింప బడ్డారు. వారిద్వరకూ అతను తెలిపి అదేశమిస్తూ జాగ్రత్తగా కాపాడుటకు ఆజాద్‌ను నియమించారు. సాండర్సునుచంపి భగత్సింగు రాజగురులు ముందూ ఆజాద్ వెనుక డి. ఏ. వి. కాలేజీ హాస్టలులోకి పోతూవుండగా చనన్‌సింగ్ అను పోలీసు వెంబడించాడు. అతన్ని వెనుకకు సురలిపొమ్మని ఆజాద్ హెచ్చరించి చూశాడు. కాని అతను వెంబడించడం మానలా. అప్పుడు తప్పనిసరియై అజాద్ చనన్‌సింగును కాల్చివైచినాడు.

అప్పటినుంచి యు. పి. గవర్నమెంటేకాక పంజాబు ప్రభుత్వంకూడా ఆజాద్‌పై కసిపట్టింది. ప్రభుత్వం ఎంత ప్రయత్నం చేసినా లాభంలేకపోయింది. బహురూపకవచ్చంతో సాధువేషము దాల్చి పోలీసుల కళ్ళల్లో దుమ్ముకొట్టి అజాద్ లాహోరునుంచి ఫరారై పోయాడు.

సాండర్సు హత్యానంతరం ఢిల్లీవద్ద వైస్రాయి స్పెషలు ట్రైనును టోల్తాకొట్టించేందుకు ప్రయత్నం చేశాడు. అందులో కూడా ప్రధాన పాత్ర ఆజాద్‌దె కాని అతను మాత్రం పట్టుబడలా.

ఢిల్లీ అసెంబ్లీలో పబ్లిక్ సేఫ్టీ బిల్లు చర్చింపబడుతూ వుండగా భగత్సింగు – దత్తులు బాంబులు వేసి, కరపత్రాలు గుప్పిఅద్భుత ధైర్య సాహసాలు ప్రదర్శించారు. అనాడు సింగు దత్తు లిద్దరనూ బాంబులు పేల్చగనే అక్కడి నుంచి తప్పించేందుకు ఆజాద్ నియమింపబడ్డాడు. అతడు ఏర్పాట్లన్నీ సిద్ధంచేసుకున్నాడు కాని కారణాంతరాలవల్ల సకాలంలో అక్కడికి వెళ్లలేక పోయాడు. అందుచే భగవత్సింగు, దత్తులు నిర్భయంగా నిలబడి పట్టుబడ్డారు. ఈవిధంగా ప్రయత్నం వ్యర్థమై వారు పట్టుబడినందుకు అజాద్‌చాలా విచారపడ్డాడు. అంతకంటె ఏం చేస్తాడు?

వీటన్నిటికీ ఆజాద్ మూలకారకుడని ప్రభుత్వము నమ్మింది. అతనిమీద వుక్రోషము పట్టలేక పోయింది. ఎలాగైనా పట్టుకతీరాలని పట్టుబట్టింది. అతని ఫొటోలు అన్ని స్టేషన్లలోనూ వ్రేలాడగట్టేరు. అజాద్‌ను పట్టిచ్చేవారికి అయిదు వేలరూపాయలబహుమతి ఇస్తామని ప్రకటించారీ సారి. అన్నీ బూడిదలో పోసిన పన్నీరు సామెత ననుకరించాయి. ఎంత కృషిచేసినా ఆ వీరసింహము బోనులో పడలా. అతను ఆజాద్. ఆజాద్‌గావే వుండిపోయాడు.

లాహోరు కుట్రకేసులో అనేకమంది నాయకులు పట్టుబడ్డారు. పార్టీ చిందరవందర అయిపోయింది. ఎటుచూచినా విపత్ సూచనలే. ఆజాద్ మిత్రులు ఉరితీయబడ్డారు. మిగిలిన వాళ్ల జైళ్లలో మ్రగ్గిపోతున్నారు. అతను తన మిత్రులందరూ అసువులు కోల్పోయినందుకూ అవస్థలు పడుతున్నందుకూ లోలోపల కుమిలిపోయాడు. దేశంలోని పత్రికలన్నీ తమను దుమ్మెత్తి పోస్తున్నై. నాయకులు నిరసించుతున్నారు. ప్రజా సామాన్యంలో ఏ మాత్రం కదలికలేదు. నలిచోటునుంచీ పార్టీ దళాలు విచ్ఛిన్నమైన వార్తలే. ఎక్కడా ఏ మాత్రం ఆశకూ తావు కనుపించడంలా. అట్టి పరిస్థితిలో ఆజాద్ ధైర్యశాలి కాబట్టి కాని మరొకడైతే పిచ్చెత్తకుండా వుండం అసంభవమే.

ఈ అరెస్టులూ—శిక్షలూ—అయినతరువాత ఆజాద్ ఏకాకి అయ్యాడు. యువజన సముదాయంలో తామాశించిన వుత్సాహం కన్పించకపోగా పై పెచ్చు చల్లదనమే హెచ్చయినదని, ఆజాద్‌కు టెర్రరిజమందలి విశ్వాసంకూడా అంతరించిపోయింది. పార్టీకి నామ మాత్రులు నాయకత్వం వహించారు. వారేపనీ చేయడానికిగ్గాని సిద్ధంగా లేరు. అట్టి పరిస్థితిలో ఆజాద్‌కు పార్టీలోనుంచి తొలగిపోవడం వుత్తమంగా కాన్పించింది. కాని అదో సమస్య. పార్టీకి చెల్లుచీటీ యిస్తే మిత్రులంతా అనుమానిస్తారు, లేకపోతే ఉరి ఎదురు చూస్తోంది. ఏంచెయ్యాలి? ఈ సమస్యనే అతను దేశ నాయకుల ఎదుట పెట్టాడు. వారు అదిచెడ్డది, ఇదిచెడ్డది అన్నారే గాని అట్టి విషమ పరిస్థితిలో ఆజాద్ ఏమి చెయ్యాలో చెప్పలేకపొయ్యారు.

తుదకు ఆజాద్ ఆ సమస్యను స్వయంగానే విడదీసుకున్నాడు. పార్టీని రద్దుచేయడంకంటె వేరుమార్గం లేదు. అతను పార్టీని రద్దుచేసినా చేయకపోయినా ఆజాద్ పట్టుబడితే వురిశిక్ష మాత్రం తప్పదు. అందువల్ల తాత్కాలికంగా అతను హిందూదేశం విడిచి పోవాలి. అంతకంటె మార్గం లేదు. ఏ దేశం వెళ్లాలి? యశపాల్ వగైరా మిత్రులు కలసి రష్యా వెళ్ళడానికే నిశ్చయించుకున్నారు. ఆ ప్రయత్నంలోనే కొంతడబ్బునిమిత్తం అలహాబాదు వెళ్లాడు. పైకం ఇస్తానన్న వ్యక్తి రేపు రేపు అంటూ జరుపుతున్నాడు. రష్యా వెళ్ళడానికి అవసరమైన పైకం చేర్చుకునేందుకు అలహాబాదువెళ్లి 1931 ఫిబ్రవరి 23 వ తేదీ వుదయం ఆజాద్ మరొకనితో అలహాబాదు అల్ఫ్రెడ్ పార్కులో కూర్చుని మాట్లాడుతున్నాడు. అతను తనకు పైకం ఇస్తానన్న వ్యక్తికొరకు పరీక్షిస్తున్నాడు అంతలో ఆకస్మికంగా ఒక మోటారుకారు వచ్చి ఆగింది. వెంటనే అందులోనుంచి పోలీసు సూపరింటెండెంటు రివాల్వరు తీసి ఆజాదుకు గురిపెట్టి 'హ్యాండ్సు అప్,' అన్నాడు.

అజాద్ అట్టి పరిస్థితికి సర్వదా సంసిద్ధుడయ్యే వుంటాడు. అతడేమాత్రం భీతిచెందలా, వెంటనే తోటాలు నింపివుంచిన పిస్తోలుతీశాడు. మరిక్షణం గురిపెట్టి కాల్చాడు. సూపరింటెండెంటుకూడా ఫైర్‌చేశాడు. అజాద్ తొడలో ఒక గుండుదూరింది. సూపరింటెండెంటు చేతికి కూడా తగిలింది. అతని చేతిలోని రివాల్వరు క్రిందపడింది. ఆయుధం పడిపోగానే సూపరింటెండెంటు ఒక చెట్టుచాటుకుపోయి నుంచున్నాడు అజాద్ విడువకుండా పిస్తోలుతో ఫైర్ చేస్తూనేవున్నాడు. గుండు తర్వాత గుండు తగులుతూనే వుంది కాని సూపరింటెండెంటు చెట్టుచాటు చేసుకున్నాడు. లేకపోతే అప్పుడే పరలోకం చూచేవాడు.

అజాద్‌కు తగిలిన దెబ్బకు తొడలోని ఎముక విరిగిపోయింది. అందువల్ల అతను లేవలేకపోయాడు. వెంటనున్న సహచరుడు కాలికి బుద్ధిచెప్పాడు. ఆ సహచరుడు లాహోరులో ఒకతోటలో కూడా ఇలాంటి స్థితిలోనే ఒక స్నేహితుణ్ణి వదిలి పలాయనంచేశాడు.

అజాద్ ఆల్ఫ్రెడ్ పార్కులోవున్న సంగతి పోలీసులకు తెలియడానికి వీరభద్ర తివారీయే కారణమని టెర్రరిస్టులు భావించారు. అందువల్లనే కాన్‌పూర్‌లో ఒకసారి – ఉదయాలో మరొకసారి వీరభద్ర తివారీపై గుండ్లు వదలబడ్డాయి. కాని రెండుసార్లూకూడా ప్రయత్నం వ్యర్థమైనది. రెండవసారి కాల్చిన నేరానిగ్గాను రమేశచంద్ర గుప్తకు 10 సం॥ కారావాసం విధించబడ్డది.

అజాద్ కాలువిరిగి పోవడంవల్ల అతను మరి పారిపోలేకపోయాడు. అంతలో పోలీసు ఇన్స్పెక్టరు విశ్వేశ్వరసింగు వచ్చి అజాద్‌పై మళ్ళీ గుండువదిలాడు. ఆజాద్ పడుకొనివుండే గుండుకు గుండుతో జవాబిచ్చాడు. అజాద్ వదిలిన గుండు విశ్వేశ్వరసింగు దబ్బను ఛిన్నభిన్నం చేసింది. తరువాత చాలామంది పోలీసులువచ్చి చుట్టూ అన్నివైపులనుంచీ అజాద్‌పై గుండ్లవర్షము కురిపించారు. అజాద్ ఆ అసహాయ స్థితిలో కూడా ప్రాణమున్నంతవరకూ పిస్తలుతో ఎదుర్కొన్నాడు. కాని అన్నివైపులనుంచీ గుండ్లే. శరీరమంతా ఛిద్రమయిపోయింది. అవీర అజాదు వీరుడుగానే ప్రాణం వదిలాడు. ఆజాదు ప్రాణం విడిచినా కూడా పోలీసులతనివద్దకు పోవడానికి గడగడలాడారు. ఒక్కడికీ గుండెలేదు. అతని శవం కదలక పడివున్నాకూడా సందేహమే వారికి! మళ్ళీ ఫైర్‌చేశారు. ప్రాణముంటే జవాబిస్తాడనే వారి క్కూడా నమ్మకం.

ఈ విధంగా ఆజాద్ ఆహుతి అయినాడు. అతను చివరిశ్వాసవరకూ కూడా తన ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నాడు. సామ్రాజ్యశక్తి అతన్ని ప్రాణంతో పట్టలేకపోయింది సరిగదా దగ్గరకు చేరనైనా చేరలేకపోయింది. ఆజాద్ ఒక మహావీరుడు. అతనిలో అపూర్వక్రియాశక్తి, అసమానత్యాగం, అద్భుతసాహసం నిండివున్నై. అతడు టెర్రరిస్టుయుగంలో కడపటి చక్రవర్తి భారతప్రభుత్వానికి దొక్కడే గడగడ లాడించివైచినాడు. అతను సమర రంగంలో వీరశయనమలంకరించాడు. ఇంక వ్యక్తిగత హింసావాదము చల్లబడిపోయింది. అతడు జీవితం ధారపోశాడు. ఎందుకు? స్వార్థానికా? అతడు స్వాతంత్ర్యారాధకుడు. స్వాతంత్ర్యమూర్తి. ప్రాణము విడిచేంతవరకు తన అజాద్, నామమును సార్థకం చేసుకున్నాడు. కాని అతని అంత్యేచ్ఛతీరలా, అతడు స్వతంత్రభారత దేశాన్ని చూడదలచాడు, మరి.....!

కాశీపట్టణపు జమీందారు కొత్త ఎత్తులు

కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారు ఈ విధంగా వ్రాస్తున్నారు:

ఈ నెల ఐదవ తేదీన నర్సాపురం సబ్ కలెక్టరుగారు, సర్కిలు యినస్పెక్టరు, యిద్దరు సబ్ యినస్పెక్టరులు, ఒక అరడజను కానిస్టేబిల్సు, అయిదుగురు మామూలు జమాన్లు అంతా ఒకదండుగా కాశీపట్నం వెళ్లిరి. సమాచారము విచారిస్తే ఈ క్రిందివిషయాలు తెలిసినాయి.

ఈ మధ్యన జమీందారుగారు, రివిన్యూ బోర్డుకీ, ప్రభుత్వానికీ తంతుల మూలకంగానూ వృత్తాంతాల ద్వారానూ, కాశీపట్టణ రైతులమీద నేరాలు ఆరోపిస్తూ అందోళన చేస్తున్నారట. కాశీపట్టణంలోని రైతులు దౌర్జన్యమునకు దిగుతున్నారనీ, దొంగతనాలు చేస్తున్నారనీ, ఏవేవో సత్యదూరములయిన విషయాలు ప్రభుత్వానికి తెలిపి రైతులపట్ల ప్రభుత్వానికి ద్వేషం పురిగొల్పాలని వుద్దేశ్యంతో యిట్లా చేస్తున్నట్లు తెలుస్తున్నది. వీరి యీ తంతులవలన ప్రభుత్వమువారు జిల్లా కలెక్టరుగారికి కాశీపట్టణం వ్యవహారమేమిటో విచారణ చేయవలసినదిగా ఆజ్ఞాపించారట. దానిమీద జిల్లాకలెక్టరుగారు సబ్‌కలెక్టరుగారిని విచారణచేయమని తంతినివ్వగా దానిమీద యీ ముఠాఅంతా కాశీపట్టణం వెళ్లినారట.

వెళ్ళి అచ్చట (కాశీపట్టణంలో) నున్న జమీందారుగారి గుమాస్తాలను గ్రామ మునసబుగారిని సబ్‌కలెక్టరుగారు పిలచి, యిచ్చట రైతులేమయినా దౌర్జన్యము చేయుచున్నారా మొదలగు విషయాలను విచారించగా, అట్టిదేమియు జరుగలేదనియు పరిస్థితులన్నియు శాంతముగానే ఉన్నవనియు తెలిపిరట. రైతులను పిలచి అడుగగా తామెట్టి దౌర్జన్యము చేయుటలేదనియు ప్రభుత్వమువారు త్వరగా తీర్పును యిచ్చి రైతులయొక్క సక్రమ హక్కులను నిలబెట్టి జీవనాధారము కల్పించాలనియు కలెక్టరుగారితో చెప్పుచున్నారట. అంతట సబ్‌కలెక్టరుగారు సపరివారంగా వెనక్కు వెళ్లిపోయినారు.

జమీందారుగారు రైతులమీద ఎన్ని రకాల దండయాత్రలు సాగిస్తున్నారో యీ అవక్రంశపు ఎత్తులవల్ల తెలుస్తుంది. యిటువంటివాటికి జమీందారుగారికి అవకాశము ఉండకుండా చేయాలంటే ప్రభుత్వమువారు తమ నిర్ణయాన్ని త్వరగా ప్రకటించాలి. రైతాంగముయొక్క సక్రమహక్కులను ప్రభుత్వము శాశ్వతంగా నిలిపి కాంగ్రెసు ప్రతిష్ఠను కాపాడాలి.

* * *

ఖురంగొండి మొఖాసాదారు దౌర్జన్యం:

కామ్రేడ్ కాకరాల కామేశ్వరశాస్త్రిగారు యీక్రింది విధంగా వ్రాస్తున్నారు:

ఖురంగొండి అనే గ్రామం పెద్దాపురం తాలూకాలో ఉన్న ఏజన్సీలోది. పూర్వం సర్వేకాకుండా ఉన్నప్పుడు అడివికొట్టుకొని సాగుచేసుకున్నంత మేరా, గుడికట్టు 1 కి 5 రూపాయల నుంచి 100 రూపాయలవరకు పన్ను ఉండేది. కాని మొఖాసాదారుగారు నాలుగయిదు సంవత్సరాల క్రిందట ప్రయివేటు సర్వేచేయించి, కొత్త పన్నులు ఒకపద్ధతి లేకుండా, చాలా జాస్తిగావేసారు. అసలు ప్రభుత్వానికి పేష్కష్షుగా చెల్లించుటకు 350 రూ. లును, తాను అనుభవించుటకు 350 రూ. లును, మొత్తం 700 రూపాయలు పన్ను వేయుటకే హక్కుఉంది. కాని కొత్తలెక్కల ప్రకారం చూస్తే మొఖాసాదారుగారు సంవత్సరానికి 5000 రూపాయలుదాకా వసూలు చేస్తున్నారు. పెద్దాపురం కోర్టులో హెచ్చుపన్నుల వసూలుకు దావావేస్తే కోర్టువారు కొట్టేసారు. దరిమిలా పెద్దాపురం డివిజన్ సబ్‌కలెక్టరుగారు, ఖురంగొంది మొఖాసా గ్రామాలకువచ్చి, ప్రయివేటు సర్వే సరియైనది కాదనిన్నీ, రైతులు ఖర్చులు భరిస్తే, గవర్నమెంటు సర్వేచేయిస్తామని చెప్పారు. కాని రైతులు సర్వేఖర్చులు భరించలేమని మొరపెట్టుకుంటే కలక్టరుగారు "మీరూ మొఖాసాదారూ వాకళ్ళమీద ఒకళ్లు దావా వేసుకుని తగువులాడండి" అని అన్నారు. దరిదాపు సంవత్సరం క్రింద పన్నులకి మళ్లీ మొఖాసాదారుగారు దావా వేశారు. దాసరి అమ్మన్న అనే రైతు కొత్తపన్నులు వేయడానికి మొఖాసాదారుకి అధికారంలేదని దావా వేశాడు. కాని, యింతవరకూ ఫలితం తేల్లేదు.

కొత్తగా ఎక్కువచేసిన పన్నుల్ని చెల్లించలేదనే కోపంతో మొఖాసాదారుగారు చెరువు గట్లు కొట్టించేశారు. పైగా రైతులు కట్టవేసుకోబోతూంటే, తుపాకులతో కాలుస్తామని బెదరించారు. ఆచెరువులో చేపల్ని ఏరైతూ పట్టకూడదు. అసలు మినహాయింపుపుంతలో వుండే ఫలవృక్షాల ఫలితాన్ని యిదివరకు గవర్నమెంటు పాట పాడుమని, రైతులు అనుభవించేవారు. కాని యిప్పుడు అదికూడా మొఖాసాదారుగారికే అనుభవమవుతూంది. స్వంతభూముల్లోంచి ఏరైతైనా, కలపకొట్టుకొని తెచ్చుకుంటే మొఖాసాదారు అటకాయించి ఎడ్లతోసహా జప్తు చేస్తున్నాడు. ఆఖరికి స్వంతభూముల్లో రాయిని కూడా తోలుకోనియ్యటం లేదు. రైతుల్ని బూతులు తిట్టడం, ఖైజార్లతో పొడుస్తామని బెదరించడం, తుపాకి బారుపెట్టడం, స్వంత నౌకర్లచేత, రైతుల్ని తన్నించడం జరుగుతోంది. ఆ మొఖాసాగ్రామాల్లో ఏరైతుకూ నిలువ నీడలేకుండా పోతూంది.

రైతు లోకం

* * *

వెంటనే జమీందారీ శాసనం గావించాలి.

6-8339 వ తేదీని గుంటూరుజిల్లా రైతు సంఘ కార్యనిర్వాహకవర్గము వారు తెనాలిలో కామ్రేడ్ ధూళిపాళ్ల కోటయ్యగారి అధ్యక్షత క్రింద సమావేశమై, యీక్రింది తీర్మానాలు ఆమోదించారు:—

1. కామ్రేడ్ శెట్టిపల్లి వెంకటరత్నంగారి అకాలమరణమునకు చింతిస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని ప్రకటించిరి.

2. జమీందారీ విచారణ సంఘనివేదికను యింతవరకూ శాసనము గావించక కాలయాపన చేయుచున్న కాంగ్రెసు మంత్రివర్గమువారి చర్యకు అసమ్మతిని తెలియచేస్తూ, వెంటనే ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారి సూచనలతో శాసనము గావించవలసినదిగా మద్రాసు మంత్రివర్గమును యీ సంఘమువారు కోరుచున్నారు.

3. కొత్తమాగానులకు వేయబడిన నజరానాలు, శిస్తులు అధిక దుస్థితిలో రైతులు చెల్లించుకోలేకుండా ఉన్నారు. సదరు నజరానాలు చెల్లించాలని ఒత్తిడి చేయుటను యీ సంఘం వారు ఖండించుచూ, నజరానాలను కనీసము 30 యెకరములలోపు వారికి రద్దుచేయవలసినదిగా మద్రాసు మంత్రివర్గమును కోరుచున్నారు.

4. జిల్లాయందలి రైతులు డి. పి. డబ్లియు ఉద్యోగస్థులకు లంచాలివ్వని కారణముచేత పొలాలకు చాలినంత నీరు యివ్వనందున కొన్నిచోట్ల అసలే నాట్లుకాక, మరికొన్నిచోట్ల నాట్లు అయిన భూములు ఎండిపోవుట, జరుగుతోంది కాబట్టి కాంగ్రెసు మంత్రివర్గం తగిన శ్రద్ధతీసుకొని, లంచగొండితనాన్ని అరికట్టి, పూర్తి నీటిసప్లయి చేయించవలసినదిగా కోరబడిరి.

5. బాపట్ల, తెనాలి, రేపల్లె తాలూకాలలో పొలాలకు సరియైన నీటిసప్లయి చేయించవలసినదని కోరుటకు ఆయాతాలూకాల సబ్‌డివిజనల్ ఆఫీసర్లవద్దకు యీ నెల 17 వ తేదీలోగా రైతుయాత్రలు సాగించే నిమిత్తము ధూళిపాళ్ల కోటయ్య, వాశిరెడ్డి బుచ్చినాయుడు, గోగినేని లక్ష్మీనారాయణ, కుదితిపూడి సత్యనారాయణ, ముత్తేవి మాధవాచార్యగార్లు నియమించబడ్డారు.

6. జిలా రైతుమహాసభను సెప్టెంబరు 3 వ తేదీని వెల్లటూరులో జరుపుటకు తీర్మానించబడింది.

7. మునగాల సత్యాగ్రహ ఖైదీలను వెంటనే విడుదల చేయవలసినదిగా మద్రాసు ప్రభుత్వాన్ని కోరుచూ తీర్మానించబడెను.

8. జూలై 3 వ తేదీని బహిరంగసభలలో పాల్గొన్న కాంగ్రెసువాదులపై ఎట్టి శిక్షణచర్య తీసుకొనవద్దని రాష్ట్రకాంగ్రెసు కమిటీని, అఖిల భారత కాంగ్రెసు కమిటీని కోరుచు తీర్మానించబడెను.

* * *

రానున్న కృష్ణా జిల్లాబోర్డు ఎన్నికలు.

10-8-39 వ తేదీని శ్రీ కామినేని వెంకటప్పయ్యగారి అధ్యక్షత క్రింద బెజవాడలో రైతుసంఘకార్యాలయమందు సమావేశమైన కృష్ణా జిల్లా రైతుసంఘ జనరల్‌బాడీ సమావేశంలో యీక్రింది తీర్మానాలు ఆమోదించబడ్డాయి.

1. శ్రీ శెట్టిపల్లి వెంకటరత్నంగారి అకాల మరణమునకు సంతాపము వెలిబుచ్చుట.

2. రానున్న జిల్లాబోర్డు ఎన్నికలలో యీ జిల్లా కాంగ్రెసు వాదులలోని చీలికలను తొలగించి, ఎన్నికలలో పాల్గొంటేగాని కాంగ్రెసుకు జయం దుర్లభముగాన యీసందర్భములో యిటీవల వునాదిపాడులో జరిగిన ఉభయకృష్ణా కాంగ్రెసు సంఘముల సంయుక్త సమావేశమునందలి తీర్మానముల ప్రకారము సదరు విభేదములను వెంటనే తొలగింప జేయవలసినదిగా ఉభయ జిల్లా కాంగ్రెసు సంఘములను, రాష్ట్ర కాంగ్రెసు సంఘమువారిని, యీ సభవారు కోరుచున్నారు. సదరు పర్యవసానమును తిరిగి 30-8-39 వ తేదీని కనుమూరులో జరుగనున్న ప్రత్యేక సమావేశములో చర్చించుటకు నిర్ణయించడమైనది.

3. సెప్టెంబరు 1 వ తేదీనుండి స్వయంసేవక ఆధ్యాపక శిక్షణ తరగతులు గుడ్లవల్లేరు ఫిర్కాలో నిర్వహించుటకు తీర్మానించబడెను. 40 మంది విద్యార్థులకు మాత్రమే శిక్షణ యివ్వబడును, ఒక్కొక్కనికి రుసుము 5 రూపాయలు.

4. రైతులకు తమ కాలువనుండి ఎంతనీరు రావలసినదీ, ఆ నీరు యివ్వబడినదీ లేనిదీ, తెలుసుకొనుటకు డెల్టాయందలి ఆయా కాల్వల నీటి సప్లయి లెవెల్సు (ఎస్. ఎస్. ఎల్.) తెలిపే బోర్డుబిల్లలను ఏర్పాటుచేయవలసిందనీ, సదరు బిల్లలమీద కాల్వలకు సంబంధించిన పై కాలువల లెవెల్సు కూడా వేయుటయే గాక ఏ దినమున కాదినము పైకాలువల వాస్తవిక సప్లయి లెవెల్సుకూడా వేయవలసిందనీ, కోరుచూ తీర్మానించబడెను.

5. రైతులు తమ యిరిగేషను యిబ్బందులను పై అధికారులకు సులభంగా తెలియపరచుకొనుటకు టెలిఫోను ఉపయోగించుకొనే వీలు కలిగించవలెను.

6. మునగాల సత్యాగ్రహ ఖైదీలను వెంటనే విడుదల చేయవలసినదిగా కాంగ్రెసు ప్రభుత్వమును కోరుచు తీర్మానించబడెను.

* * *

రేపల్లె తాలూకా రైతు సంఘం

8—8—39 వ తేదీని పైసంఘ సభ్యులు కామ్రేడ్ కంఠంనేని వెంకట సుబ్బయ్యగారి అధ్యక్షతను సమావేశమై యీక్రింది వారిని కార్యనిర్వాహకులుగా యెన్నుకున్నారు:

అధ్యక్షులు—యార్లగడ్డ శ్రీకృష్ణయ్యగారు

కార్యదర్శి—కామ్రేడ్ కంఠంనేని వెంకట సుబ్బయ్యగారు

సహాయ కార్యదర్శి— కామ్రేడ్ కొత్తపల్లి రాఘవయ్యగారు

వీరుగాక మరి 8 గురిని కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నుకున్నారు.

జమీందారీ రైతుబిల్లును వచ్చే శాసనసభా సమావేశములోనైనా ప్రవేశపెట్టవలసిందనీ; పల్లెటూళ్ళలో స్థానికాధికారులు రాబోయేయుద్ధానికి సైనికుల్ని రిక్రూట్ చేస్తున్నారు, కాబట్టి కాంగ్రెసు మంత్రివర్గం అట్టి విధానాన్ని అరికట్టవలసిందనీ: మునగాల రైతు సత్యాగ్రహుల్ని వెంటనే విడుదల చేయవలసిందనీ; రేపల్లి తాలూకాలో రైతుల జాయింటుపట్టాలు విడదీయక పోవుటవల్ల 10, 15 సంవత్సరముల నుంచి మాగాణి సాగుచేస్తున్నప్పటికీ మంజూరుచేయక రెట్టితీరువలు విధించుటవల్ల; మురుగుకాల్వలు పంటకాల్వలు రిపెయిర్ చేయించకపోవుటవల్ల, రైతులకు విశేషనష్టము వాటిల్లుతూన్నందున యీ విషయంలో మద్రాసు ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకోవలసిందనీ; తీర్మానించబడెను.

సుభాష్‌బోసుపై డిసిప్లినరీ చర్య

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానాలు

ఈ నెల 9, 10, 11, 12, తేదీలలో అఖిలభారత కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ బాబూరాజేంద్రప్రసాద్ అధ్యక్షత క్రింద, వార్ధాలో, గాంధీమహాత్ముని సమక్షంలో, సమావేశమై, యీ క్రింది తీర్మానాలు చేసింది:—

"గత అఖిలభారత కాంగ్రెసుకమిటీలో సత్యాగ్రహమును గురించీ, రాష్ట్రకాంగ్రెసు కమిటీలు—మంత్రివర్గాలను గురించీ, ప్యాసైన రెండు తీర్మానాల విషయంలో మొన్నటి వరకు కాంగ్రెసు అధ్యక్షుడుగా ఉన్న సుభాష్ చంద్రబోసు తీసుకున్న చర్యను వర్కింగుకమిటీ అతిజాగ్రత్తతో ఆలోచించింది. ఈసందర్భంలో సుభాష్‌బోసు వ్రాసిన దీర్ఘమైన జాబుసుకూడా పరిశీలించితిమి. వర్కింగ్ కమిటీ ఎక్కువ విచారముతోను, అయిష్టముగాను, యీ క్రింది నిర్ణయం చేయవలసివచ్చింది. కాంగ్రెసు అధ్యక్షుని ప్రకటన యందలి ప్రధానవిషయాన్ని బోసు పూర్తిగా విడిచిపెట్టాడు. అధ్యక్షుని ఉత్తరువు అందిన వెంటనే నిజమైన దేశసేవకుడుగా వాటిని జావదాటి యుండవలసిందికాదు. అంతవరకు తాను కాంగ్రెసు అధ్యక్షుడై యుండి, ఇప్పటి కాంగ్రెస్ అధ్యక్షుని 'రూలింగ్' తనకు యిష్టములేకపోయినా అతని ఆజ్ఞానుసారం నడుచుకొనడం బోసుయొక్క కర్తవ్యం. ఆ 'రూలింగ్' తనకు యిష్టములేకపోతే, వర్కింగ్ కమిటీకి అప్పీలు చేసుకొనడానికి ఆయనకు హక్కుఉంది. కాని, అధ్యక్షుని ఉత్తరువులు వచ్చాక వాటిని ఆచరణలో పెట్టడం ఆయన విధి.

"ఏ సంస్థ పనిచేయాలన్నా, ముఖ్యంగా ప్రపంచమంతటిలోను ఎక్కువ బలమైన,ఎక్కువ నిర్మాణశక్తిగల, సామ్రాజ్యప్రభుత్వంతో హోరాహోరీని పోరాటం సాగించే కాంగ్రెసువంటి బ్రహ్మాండమైన సంస్థ, సరిగా పనిచేయాలంటే యిది ప్రథమసూత్రం.

"కాంగ్రెసు నిబంధనావళిని ప్రతికాంగ్రెసు సభ్యుడు తన యిష్టం వచ్చినట్లు వ్యాఖ్యానం చేసుకోడానికి హక్కు ఉండాలని సుభాషుబాబు అభిప్రాయమయినట్లు అతడు వ్రాసిన ఉత్తరం ప్రకారము తోస్తుంది యీ ప్రకారమే జరిగితే, కాంగ్రెసులో అరాజకం ప్రబలిపోతుంది. కొద్ది కాలంలోనే ఆ సంస్థ ఛిన్నాభిన్నమైపోక మానదు. సుభాషుబోసు బుద్ధిపూర్వకంగాను, ధిక్కారంతోను, డిసిప్లిన్‌ని ఉల్లంఘించినప్పుడు వర్కింగ్‌కమిటీ ఊరుకుంటే, తన కర్తవ్యాన్ని నెరవేర్చనట్లవుతుందని మేము నిర్ణయించక తప్పిందికాదు.

"సుభాషుచంద్రబోసు డిసిప్లిన్‌ని ధిక్కరిస్తూ నడిచినందుకు ఆయన ఆగష్టు 1939 నుండి 3 సంవత్సరాల వరకు బెంగాలీ రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి అధ్యక్షుడుగాగాని, ఏ కాంగ్రెసు కమిటీలోను సభ్యుడుగాగాని ఉండరాదని తీర్మానించడమైనది.

"సుభాషుబాబు తన తప్పును గ్రహించి యీ డిసిప్లినరీ చర్యకు బద్ధుడై యుంటాడని మేము విశ్వసిస్తున్నాము.

"ఇంకా అనేకమంది యితర కాంగ్రెసువాదులు కార్యనిర్వాహకులతోసహా, డిసిప్లిన్‌కి వ్యతిరేకంగా వెళ్ళిన విషయం వర్కింగు కమిటీవారు ఆలోచించారు. వారందరూ సుభాషుచంద్రబోసు ప్రోత్సాహంవల్ల ఆ విధంగా చేశారు కాబట్టి అట్టివారిమీద ఎట్టి చర్య వర్కింగ్ కమిటీ తీసుకోలేదు. కాని, ఆయా రాష్ట్రాలలో డిసిప్లిన్‌కొరకు, ముఖ్యంగా అట్టి సభ్యుల విచారాన్ని తెలియజేయకపోతే, రాష్ట్ర కాంగ్రెసు కమిటీలు తగిన చర్య తీసుకోవచ్చు.

"డిసిప్లిన్‌కి వ్యతిరేకంగా నడిచినందుకు విచారము తెలియజేయక ఎప్పుడూ అ ధోరణిలోనే నడిచే సభ్యుల మీద డిసిప్లినరీ చర్య తీసుకొనే అధికారం కాంగ్రెసు అధ్యక్షునికి ఈయడమైనది."

జూలై 9 వ తేదీ బహిరంగ సభలను గురించి సంజాయిషీ యివ్వవలసినదిగా కాంగ్రెసు అధ్యక్షుడు పంపిన జాబుకు బోసుగారు యీ క్రింది విధముగా జవాబు పంపారు.

"కాంగ్రెసు తీర్మానాలను ఉల్లంఘించడం వేరు, వాటిని ఆక్షేపించడంవేరు. నేను యింతవరకు కాంగ్రెసు తీర్మానాలను ఆక్షేపించానేగాని, వాటిని ఉల్లంఘించి యుండలేదు....కాంగ్రెసు సభ్యులు కాంగ్రెసు తీర్మానాలపై తమ అభిప్రాయా లివ్వకూడదనడం పౌరసత్వ హక్కులను భంగపరచడమే అవుతుంది. ప్రజల పౌరసత్వపు హక్కులకయి మొదటనుండీ బ్రిటిషు ప్రభుత్వంతో పోరాడుచున్న కాంగ్రెసువారే కాంగ్రెసు సభ్యుల పౌరసత్వ హక్కులను యేలాగు భంగపరచగలరు?...."

"ఒకసారి అ.భా.కాం. కమిటీలో ఏ తీర్మానమైనా ఆమోదించబడితే, దాన్ని గురించి మరొకసమావేశములో పునరాలోచించడానికిగాని, సవరించడానికిగాని, మార్చడానికిగాని, ఉపసంహరించు కొనేటట్లు చేయడానికిగాని మాకు హక్కు ఉన్నవిషయం మీరంగీకరిస్తారనుకుంటాను. అంతేగాక, అ. భా. కాం. కమిటీకి పైసంస్థయైన కాంగ్రెసు మహాసభకు అప్పీలుచేసుకొనే హక్కుకూడా మాకు ఉన్నదని మీరు ఏకీభవిస్తారనుకుంటా. అల్పసంఖ్యాకులు ప్రచారం ద్వారా అధికసంఖ్యాకులను తమ వైపుకు త్రిప్పుకొనవచ్చును. ఇందుకై బహిరంగసభలద్వారాను, పత్రికలలో వ్యాసాలద్వారాను, సాధారణ కాంగ్రెసు సభ్యులను హెచ్చరించడం తప్ప మరొకమార్గం మాకేదీ? కాంగ్రెసు యీనాడు కొద్దిమంది వ్యక్తుల సంస్థకాదుగదా? ...."

యుద్ధం వస్తే

యుద్ధంవస్తే భారతీయుల కర్తవ్యాన్ని గురించి వర్కింగు కమిటీ యీ క్రింది తీర్మానాన్ని ఆమోదించింది:—

"....యుద్ధంవస్తే కాంగ్రెసు విధానమెట్టిదో యిదివరకే స్పష్టంగా తెలియజేయబడింది. భారతదేశాన్ని బ్రిటిషుప్రభుత్వం యుద్ధంలో యిరికించ పూనుకొంటే అట్టిప్రయత్నాలను ప్రతిఘటిస్తామని తెలియజేశాము. కాంగ్రెసుయొక్క యీ విధానానికి వర్కింగు కమిటీ కట్టుబడి యుంటుంది. భారతదేశపు సంపద సామ్రాజ్యవాదుల ప్రయోజనానికి ఉపయోగించుకొనబడకుండా అరికట్టడానికి పై విధానం ఆచరణలో పెట్టబడుతుంది.

"1939 వ సంవత్సరం మే 1వ తేదీని కలకత్తాలో సమావేశమయిన అఖిలభారత కాంగ్రెసు కమిటీ యీ దృక్పథాన్నే మరొకసారి తెలియజేసింది. భారతీయ సైన్యాలను విదేశాలకు పంపిన ప్రభుత్వచర్యను నిరసిస్తూ ఆ కమిటీ తీర్మానించింది. అయినా, బ్రిటిష్ ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించి, నేడు ఈజిప్టు సింగపూర్‌లకు భారతీయ సైన్యాలను పంపిస్తూంది. అంతేగాక, తమ అనుమతిలేనిదే విదేశాలకు భారతీయ సైన్యాలను పంపించరాదని యిదివరలో కేంద్రశాసనసభ తీర్మానంకూడా చేసింది. కాబట్టి బ్రిటిషు ప్రభుత్వం కాంగ్రెసుయొక్క, శాసనసభాసభ్యులయొక్క, అభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూంది. ఇందువల్ల యుద్ధంలో ఇండియా తప్పకుండా యిరుక్కునే పరిస్థితి లేర్పడవచ్చు.

"పైగా ప్రభుత్వం కేంద్రశాసనసభను మరొక సంవత్సరం పొడిగించింది. బ్రిటిషు ప్రభుత్వం యొక్క యీ నిర్ణయాలను వర్కింగు కమిటీ అంగీకరించజాలదు. వాటితో ఏకీభవించక పోవడమేకాక, కాంగ్రెసు విధానాన్ని ఆచరణలో పెట్టడానికి అవసరమైన చర్య తీసుకోవలసి యున్నది.

"ఇందుకు మొదటి మెట్టుగా, కేంద్రశాసనసభయందలి కాంగ్రెసు సభ్యులంతా రాబోయే ఎసంబ్లీ సమావేశానికి వెళ్లవద్దని వారిని వర్కింగు కమిటీ హెచ్చరిస్తూంది.

"బ్రిటిషు ప్రభుత్వం చేసే యుద్ధ సన్నాహాలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి సహాయము చేయరాదనీ, కాంగ్రెసు తీర్మానాన్ని మనస్సులో ఉంచుకోవలసిందనీ వారికి వర్కింగు కమిటీ జ్ఞాపకం చేయడమైనది. కాంగ్రెసు తీర్మానాన్ని ఆచరణలో పెట్టడంలో కాంగ్రెసు మంత్రులు రాజీనామా యివ్వడంగాని, తొలగించబడడంగాని, సంభవిస్తే అట్టి ఘటనకు సిద్ధంగా ఉండవలసిందని వారిని హెచ్చరించడమైనది.

"యుద్ధం వచ్చినప్పుడు ఇండియాలో ఏ భాగానికైనా యుద్ధ విమానాలద్వారాగాని, మరొక విధంగాగాని, అపాయం తటస్థించవచ్చు కాబట్టి, దేశ రక్షణకయి కొన్ని పనులు అవసరం. అట్టి పనులపై ప్రజా ప్రతినిధులయిన మంత్రులకు అధికారం ఉంటే, వాటిని యీ కమిటీ ప్రోత్సహించడానికి సిద్ధంగాఉంది. కాని, అట్టి రక్షణ విధానాన్ని సాకుగా తీసుకొని సామ్రాజ్య ప్రభుత్వం యుద్ధ సన్నాహాలు చేస్తే, వర్కింగ్ కమిటీ అంగీకరించజాలదు."

ఇతర తీర్మానాలు

సిలోన్ ప్రభుత్వం భారతీయుల్ని ఉద్యోగాలనుండి తొలగించడము విషయములో తన అభిప్రాయాన్ని మార్చుకోనందుకు వర్కింగు కమిటీవారు విచారాన్ని తెలియజేస్తూ, నేటి క్లిష్ట పరిస్థితులలో భారతీయులెవరూ యికనుంచి సిలోన్‌కు వలస వెళ్ళవద్దని హెచ్చరిస్తూ తీర్మానించారు.

వర్కింగ్ కమిటీ మద్రాసు మంత్రివర్గంయొక్క దేవాలయ ప్రవేశచట్టాన్ని, బొంబాయి మంత్రివర్గంయొక్క మద్యనిషేధచట్టాన్ని, అభినందిస్తూ తీర్మానించింది. బెంగాల్ రాజకీయఖైదీలు నిరశనవ్రతాన్ని 2 నెలలవరకు ఆపినందుకు వారిని అభినందిస్తూ, బెంగాల్ ప్రభుత్వం వెంటనే వారిని విడుదల చేయవలసిందని తీర్మానించింది. కాని, రాజకీయ ఖైదీలుగాని, యితర ఖైదీలుగాని తమ విడుదలకై నిరశనవ్రతాలు చేయడం తప్పు అనీ, ఆవిధంగా చేస్తే "సక్రమ పరిపాలన" అసాధ్యమవుతుందనీ, వర్కింగ్ కమిటీ అభిప్రాయమిచ్చింది.

చీనా రోదనం

రచయిత:

త్రిపియోకోవ్

అనువాదం:

శ్రీ కృత్తివాసతీర్థులు

(నవ్యసాహిత్య పరిషత్తు)

పాత్రలు

★ తెల్లవాళ్లు

కెప్టెన్—'చీనన్' తుపాకీ పడవ
లెఫ్టనంట్ కాపర్
బ్రూచ్‌లే, అతని భార్య, కుమార్తె కార్డీలియా—ఫ్రెంచి వ్యాపారులు
అష్‌లే—అమెరికా కంపెనీ ఏజంటు
మిషనరీ, బోటువాడు, నావికులు
అమెరికన్ పత్రికా విలేఖరి
ప్రయాణీకుడు, అతని భార్య

★ చీనావాళ్లు

డాయిన్—జమీందారు
తాయ్‌లీ—ధనిక వ్యాపారి
చీ—బోటువాడు, భార్య, కుమార్తె
ఫీ—కళాసుల యూనియన్ చైర్‌మన్, వాడి భార్య
విద్యార్థి—డాయిన్ తరపున దొరలతో ఇంగ్లీషు మాట్లాడుతాడు
ముగ్గురు కళాసులు, ఒక ముసలి కళాసు
రెండో కళాసు భార్య, కొడుకు
అమా—తెల్లవాళ్లకు దార్పుడుకత్తె
హోషాంగ్—చైనా జాతీయ సన్యాసి
రేడియో స్టేషన్ కొలిమి కూలీ
తెల్లవారి పడవమీద పనిచేసే కుర్రవాడు
పోలీసు, ఊరివాళ్లు

మొదటి కళాసు

మనకూలీలగతి అందరిదీ వకటే. రెక్కలాడితే డొక్కలాడతవి.

(పత్రికా విలేఖరి రేడియోస్టేషన్‌లోంచి ఇవతలకు వస్తాడు. మెట్లుదిగి ఎండకు చిరాకుపడుతూ, బోటువాడు పరుగెత్తుకొస్తాడు.)

మొదటి ఇద్దరు కళాసులు.

బోటుకావాలా - బోటు....పదిసెంట్లు.

(విలేఖరి ఆగి కెమిరా వాళ్ళమీదికి ఫోకస్‌చేసి మనస్సు మార్చుకుని వెళ్ళిపోతాడు.)

మొదటి కళాసు

వెధవ ముండా కొడుకు!

రెండో కళాసు

ఆ దొర జోబుల్నిండా 'డయాంగులు' పోసుకొని నడుస్తున్నాడు. బోటువాడికి ఒక్క దబ్బియ్యడానికి చేతులురావు!

మొదటి కళాసు

వాడి కాళ్ల పడిపోను. పడిపోతే నడవలేడు. (బొగ్గులు బస్తా మోసుకొని రేడియో స్టేషనుకు వస్తున్నాడు కొలిమి కూలీ)

కొలిమి కూలీ

వాడితల పగలగొడితే....?

మొదటి కళాసు

ఇంకోతల మొలుచుకొస్తుంది.

కొలిమి కూలీ

అతలకూడా నరికేస్తే సరి.

మొదటి కళాసు (తుపాకీ పడవచుక్కాని చూపిస్తూ)

తుపాకులైతే నరకడము కూలీ విరగ్గొయ్యడం వాళ్ళకు బాగా తెలుసు, తెల్లవాళ్ళతలలు ఎగిరిపోవడము భూమిమీద ఎక్కడన్నా చూచావా?

కొలిమి కూలీ

నిక్షేపంగా వుంటాయి వాళ్ళతలలు.

మొదటి కళాసు

ఎక్కడ?

కొలిమి కూలీ

(చేతిలో బస్తావుండడం వల్ల గడ్డం వణుకుతుంది) అదుగో అక్కడ.

రెండో కళాసు

పెకింగ్ నగరములో.

కొలిమి కూలీ

ఇంకాపైన.

మొదటి కళాసు

ఇంకా పైన నాకు తెలియదు.

కొలిమి కూలీ

అలాంటిదేశమే అదంతా!

మొదటి కళాసు

(కొలిమివాణ్ణి నమ్మక దగ్గిరచేరి) అక్కడివాళ్ళు ఇంగ్లీషు వాళ్ళను కొట్టేస్తారా?

కొలిమి కూలీ

అవును.

అమా

(వేళాకోళంగా) బాగా తాగితే పెద్ద ఖబుర్లు వస్తాయి!

కొలిమి వాడు

నోరు ముయ్యి.

(చైనా భిక్షువు, హోషాంగ్ ఆ దారినే వెడతాడు. బోడితల నీలి రంగుగా వుంది. ముఖంలో ఎముకలు బయటపడి పీక్కుపోయినవి. ముఖం ఎండకు మాడుతున్నది. కళ్లు మిలమిల మాడుతున్నవి. నీలిరంగు గౌను వేసుకొన్నాడు. ఎండకు కాగుతున్న రొమ్ముమీద గౌను వదులుగా పట్టుకొన్నాడు. ఒక చేతిలో గులాబీగుత్తి. రెండో చేతిలో రెండు చిన్న రాగి పాత్రలు. జనానికి దేవుడిమీద నమ్మకం కలిగించడానికి పట్టుకొంటాడు. చైనా దేశం చైనా దేశస్థులకే ఉండాలి, అనే జాతీయవాది ఆ సన్యాసి)

హోషాంగ్ (పాట)

ఓ మేయ్ తుఫు—ఓ మేయ్ తుఫు....

(పాడుతూ వస్తాడు. పాట ఆగిపోతుంది. మళ్ళీ సంభాషణ)

మొదటి కళాసు

నువ్వో తల తియ్యగలవు. సిల్కు గుడ్డమీద ప్రార్థనరాసి గుండెల మీద పెట్టుకోవాలి. (సన్యాసి వైపుచూసి) అప్పుడు నీ గుండెల్లోకి తుపాకీ గుండు దూరదు.

రెండో కళాసు

ఇరవయ్యేళ్ళనాడు మతగురువులదే అన్నారు.

కొలిమి వాడు

మతగురువులు వట్టి పశువులు. మూర్ఖులు. ఏ ప్రార్థన చేసినా తుపాకీ దెబ్బకు ఆగలేదు మనిషి.

మొదటి కళాసు (నమ్మి)

అవును. ఆగలేదు. అయితే, నువ్వు చెప్పిన దేశం ఏదీ లేదన్న మాట.

రెండో కళాసు

వుండదు.

కొలిమి కూలీ

వుంటుందని నేనంటాను.

మొదటి కళాసు

వాళ్లు ప్రార్థన చెయ్యరుకారూ?

కొలిమి వాడు

ఉహూఁ తుపాకీ ఉపయోగిస్తారు.

మొదటి కళాసు

నువ్వెప్పుడయినా ఆ దేశం వెళ్ళావా? (తొందరగా) నువ్వు సిపాయివా?

కొలిమి వాడు

(గొంతుక మార్చి) ఉహూఁ నేను కూలీని. టెలిగ్రాఫ్ ఆఫీసులో స్టౌలు వెలిగించి వుంచుతాను.

రెండో కళాసు

(అనుమానంతో) వార్తా పత్రికలు చదువుతావా? ఎప్పుడయినా—

అమా

దుర్మార్గుడా! పోలీసులు పట్టుకుంటారు.

కొలిమి వాడు

(బొగ్గులనంచి కింద పారేసి 'అమా' భుజాలు పట్టుకుని కదిలిస్తాడు) నీళ్ళల్లోకి తోస్తాను నీ కిష్టమేనా?

అమా

(నదికేసిచూసి) చూడు—'ఛీ' అదుగో వస్తున్నాడు.

మొదటి కళాసు

'ఛీ'కి ఎక్కడ దొరికాడు ఆ తెల్లదొర? అదృష్టం.

రెండో కళాసు

(నవ్వి) అమెరికా దొర. వాడు రెండు రాగిడబ్బులు ఇస్తాడు.

(అమా కుంటుతూ నడుస్తుంది. పడవ ఆగే చోటికి)

మొదటి కళాసు

అయితే 'ఛీ' మంచి పట్టుదల మనిషి. దొరవి తిడతాడు!

కొలిమి కూలీ

అంతేనా? తెడ్డుతో ఒక్కటి ఉతుకుతే సరిపోతుంది.

మొదటి కళాసు

న్యాయస్థానాలు ఎందుకున్నై? పోలీసులు బెత్తాలు పట్టుకొంటారేం? కన్‌ఫ్యూనియస్ తత్వవేత్తకంటె రెండాకులు ఎక్కువ చదివినట్టున్నావు?

(నదిగట్టునుండి మహా భయంకరంగా కేకలు వేస్తాడు 'ఏమ్' అంటూ) అష్‌లే 'ఛీ' బోటులో వుంటాడు. అష్‌లే పడవముందున కూర్చున్నాడు. 'ఛీ' నెమ్మదిగా నడుపుతున్నాడు.

అష్‌లే

తొందరగా పోనీ పడవ.

'ఛీ' (నెమ్మదిగా చుక్కాని నడుపుతూ)

కూలీ డబ్బులు ఇచ్చెయ్యాలి. ఇరవై రాగి డబ్బులు రావాలి.

అష్‌లే

(నెమ్మదిగా) ఒడ్డుకు చేరాక నీకెంత ఇస్తే సరిపోతుందో అంత ఇస్తాను.

'ఛీ'

నా కూలీ ముందియ్యి. 20 రాగి డబ్బులూ ఇయ్యి!

అష్‌లే

రేవుకు పోయాక నీ డబ్బిస్తానురా!

('ఛీ' పడవ నడపడు. 'ఛీ'నిచూసి తెల్లపోయి అష్‌లే కూలీని బాగా కొడతాడు)

అష్‌లే

(చురుగ్గా) ఊఁ—ఏయ్ కళాసూ? (రెం. కళాసు గబ గబా మీదికి వస్తాడు. కొలిమికూలీ వెనక్కుతగ్గి)

కొలిమి కూలీ

కొట్టకండి బాబూ? 'ఛీ' తప్పు చెయ్యలేదు.

అష్‌లే

గట్టుకు చేర్చాక 20 సెంట్లు ఇస్తారా!

మొదటి కళాసు

ఆ 20 సెంట్లు ఇప్పుడే యివ్వాలి!

కొలిమి వాడు

మాకొద్దు ఆ కూలీ.

అష్‌లే

(వేళాకోళంగా) మళ్ళీ సమ్మె కట్టారా!

"ఛీ"

ముందు కూలియ్యి. అప్పుడు బోటు రేవుకు తీసుకుపోతా!

అష్‌లే

(కోపం ఆపుకోలేక) పోలీసుల్ని పిలుస్తాను రేవు దగ్గరికి.

'ఛీ'

పోలీసులా? డబ్బిస్తావా, లేదా?

అష్‌లే

సరే, కానీ (డబ్బు విసిరేస్తాడు)

'ఛీ' (పుచ్చుకొని)

అయిదు రాగి డబ్బులా? ఇరవై రావాలి!

అష్‌లే

ఓ పచ్చ పీనుగా! నేటివ్ పీనుగా!

'ఛీ'

ఇంత తక్కువ కూలీ నా మొహాన వేస్తే! రేవుకు రాను ఏం?

(అష్‌లే కళ్ళమీద కూలివాడు డబ్బులు విసిరివేస్తాడు)

అష్‌లే

అంతేనా! సరే గాని (లేచి పడవ చివరకు పోతాడు)

"ఛీ"

(తెడ్డుతో తనను రక్షించుకొంటూ) నువ్వేం చెయ్యలేవు! చేత కాదు! దొంగా! మోసం చేస్తావురా. (అష్‌లే "ఛీ" ముఖంమీద కొడతాడు. "ఛీ" తెడ్డు పట్టుకొనివుండగా. మళ్ళీ కొట్టపోతే బోటుచివరికి పోతాడు. అష్‌లే దెబ్బ కూలీవాడికి తగలదు. బోటు వొరిగి పోయింది. బాలన్సు ఆపుకోలేక దొర నీళ్ళల్లో పడతాడు)

అష్‌లే

రక్షించాలి—రక్షించాలి! సహాయం!

(నదీతీరాన నవ్వు. "ఛీ" పడవ నడుపుకొంటూ కోపంతో తీరానికి పోతాడు)

మొదటి కళాసు

(ఆనందంతో) బాగా తడుస్తాడు దొర!

రెండో కళాసు

జేబున్నిండా దొరగారికి కావలసినన్ని చేపలు! (నవ్వి)

"ఛీ"

నా తెడ్డు విరగ్గొటాడు, దొర. నా కూలీ ఇయ్యడు. మృగం! (విరిగిన తెడ్డు నదిలో విసిరి నదిపైపు తన పిడికిలి చూపిస్తాడు కసిగా) విరిగిన తెడ్డు ఖరీదు బాగా ఇచ్చుకొంటాడులే!

అంతా నిశ్శబ్దం. నదిలో ఏ చప్పుడూ వినపడదు. గొంతు నులిమి వేస్తుంటే వచ్చే కంఠస్వరం సన్నగా నీళ్ళల్లోంచి వినవస్తుంది.

మొదటి కళాసు

(హడలిపోయి) ఏయ్!

(ఇంకా నిశ్శబ్దం)

అమా

(శాంతంగా) దొరగార్లు ఈదలేరు నీళ్ళల్లో!

రెండో కళాసు

నిన్నేంజేస్తానో తెలుసా?

కొలిమి వాడు

వెళ్ళిపో త్వరగా.

"ఛీ"

ఎక్కడికి? పడవ వదిలిపెట్టు.

మొదటి కళాసు

విను, విను. జనం వస్తున్నారు రా. అటునించి!

"ఛీ"

(హడలిపోయి) నే నెక్కడికీ పోను. నా కొడుకు ఆకలిమంటక్కు మసి అయిపోతాడు, నేనూ "ఆకలి, ఆకలి, ఆకలి" అంటూ పోతాను, ఈ లోకంవదిలి. తిండిలేక నా కుటుంబం నాశనమయి పోతుంది. నే నెక్కడికి పోను ఇప్పుడు!

అమా

చీషన్‌కు తెలుసు. ఎక్కడికి పోవాలో!

"ఛీ"

(కోపం పోగొట్టుకొని) ఇక్కడికి మళ్ళీ వచ్చావా? నీ కిదివరకే చెప్పాను.

అమా

ఆరు డాలర్లు ఇస్తాను. ఇటు చూడు! (చేతిలో డబ్బు మోగించి)

"ఛీ"

వెళ్ళిపోవే ముండా!

అమా

(అతని చేయ్యి పట్టుకొని ముఖంమీద డబ్బు మోగిస్తూ) ఎవడైనా ఆరు డాలర్లతో చాలా రోజులు బతుకుతాడు; తిండిలేని వాళ్ళ గతి ఏమిటో ఆలోచించుకో!

"ఛీ"

పది యిద్దూ!

కొలిమి వాడు

పోలీసురా, రా!—పారిపో!

అమా

కాదు, ఆరు!

మొదటి కళాసు

(ఛీని పిలుస్తూ) పారిపోరా!

కొలిమి వాడు

పో, దాక్కో! ఎవరుపిల్చినా పలకవద్దు. నీ కొడుక్కువచ్చి పిల్చినా సరే! నీ మొహం కనపడనీకు.

అమా

(వాడు పారిపోవడానికి సిద్ధమైతే చెయ్యి పట్టుకొంటుంది) నీకూతుర్ని ఇయ్యి యీ సాక్షులుండగా—తర్వాత నేను, దొంగతనంచేసి దాన్ని తీసుకొన్నానంటారు.

"ఛీ"

తీసుకో! (డబ్బు పుచ్చుకొంటూ)

(అమా "ఛీ" కూతుర్ని పట్టుకొంటుంది. "ఛీ" చెయ్యి వదుల్చుకుంటాడు. అమా వెళ్ళిపోతుంది.)

మొదటి కళాసు

ఈ ముసిలిది తార్పుడుముండ! ఆడపిల్లల్ని తార్చి డబ్బు సంపాయిస్తున్నది. అమెరికావాడికి అమ్ముతుంది!

('ఛీ' పెళ్లాం ప్రవేశం)

"ఛీ" భార్య

(అమాతో) నా కూతుర్ని ఏంచెయ్య దల్చుకొన్నావ్?

అమా

డబ్బు వస్తున్నదిగా.

భార్య

ఎంతకు అమ్మకం?

"ఛీ"

ఆరు.

భార్య

ఎంత చవక! (డబ్బుచ్చుకొంటుంది) ముసిలిదొంగా. (హఠాత్తుగా ఆమె జనంలో గగ్గోలు వింటుంది) ఏమిటీ అక్కడ?

(మొదటి కళాసు ఆమెను పక్కకు తప్పించుతాడు. పోలీసులు రావడం చూసి "ఛీ" జనంలోకి దూకి తప్పించుకొని పోతాడు. "ఛీ" భార్య ముందూ వెనకా తారట్లాడుతూ వుంటుంది. అమె చేతిలో సొమ్ము కింద జారి పోతుంది. నెమ్మదిగా ఏరు కొంటుంది.)

సవరణ

గత సంచికలో 'చీనారోదనం' నాటిక చివరికాలం క్రిందనుండి 24 పంక్తి "కొలిమికూలీ....వాడితల పగలగొడితే" మొదలుకొని చివరిదాకా రద్దుచేసుకోవాలి. వరుస సరిగాలేదు. "తిండిలేక గంజిలేక అల్లాడి పోతున్నాడు." అనే భాగం తర్వాత ఈ సంచికలోని కథ ప్రారంభమవుతున్నది.



డిటెన్షను విధానము
నాశనము గావాలి

ఈ నినాదము ఆంధ్రరాష్ట్రమంతటా ఆగస్టు 6 వ తేదీ మారుమ్రోగింది. అన్ని స్థలముల లోని విద్యార్థులు ఆరోజున ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘంవారి ఆదేశానుసారం ఊరేగింపులతో మీటింగులు జరిపారు. ఈవిషయముపై నిద్ర పోతూన్న ప్రజాసముదాయాన్ని, విద్యాశాఖాధి కారుల్ని మేలుకొల్పింది, రాష్ట్రమంత్రిత్వ యాం దోళన జరుగుట చాల ప్రశంసనీయము. మంత్రి గారు త్వరలో నీవిధానము నశించునట్లు సర్క్యూలరు పంపుదురుగాక! యూనివర్సిటీ అధికా రులు విద్యార్థుల తీవ్రఅసమ్మతిని గమనించు దురుగాక! పాఠశాలాధికారులు విద్యార్థులపై తమ దౌర్జన్యము (హామీపత్రములు etc.) మానుకొందురుగాక!

విశాఖపట్నంలో కామ్రేడ్ వెంకట్రామశాస్త్రి గారి అధ్యక్షత క్రిందను: కాకినాడలో వి. సుబ్ర హ్మణ్య శర్మగారి అధ్యక్షతను: పాలకొల్లులో కామ్రేడ్ బోళ్ళ శ్రీరాములుగారి అధ్యక్షతను: కొల్లూరులో కామ్రేడ్ ఎన్. నాగేశ్వరరావుగారి అధ్యక్షతను: ఈమనిలో పండితారాధ్యుల మల్లి ఖార్జునశర్మగారి అధ్యక్షతను బహిరంగ సభలు జరిగి, తీర్మానము లామోదించబడెను. ఇట్లే గుంటూరు, రాజమండ్రి, నరసారావుపేట, బాపట్ల, ఉండి, మొదలైనచోట్ల సభలు తీర్మా నములు గావించబడెను.

* * *

సర్. అక్బర్ హైదరీ స్నాతకోపన్యాసం యివ్వరు.

ఆం॥ రా॥ విద్యార్థిసంఘ వర్కింగుకమిటీ సభ్యుడు యర్రమిల్లి నరసింహారావు గారిట్లు ప్రక టించారు.

ఆం॥ రా॥ విద్యార్థిసంఘ వర్కింగు కమిటీ బెజవాడలో 10-6-39 తేదీని ఆంధ్ర పట్టభద్రులు సర్ అక్బర్ హైదరీగారి స్నాతకోపన్యాసాన్ని బహిష్కరించాలని తీర్మానించింది. దానిపై విమర్శనలు సాగాయి. ఆంధ్రవిద్యార్థులు సభలు జరిపి వారి రాకను ప్రతిఘటించి రాష్ట్ర విద్యార్థి సంఘతీర్మానాన్ని గౌరవించినందులకు అభినం దనీయులు. వార్తలవలన సర్ హైదరీగారు స్నాతకోపన్యాసాన్ని అక్టోబరు 10 వ తేదీని ఇవ్వటానికి వీలులేని పరిస్థితులు ఏర్పడ్డాయనీ. అందువలన సర్ రతన్ సర్కారుగారు స్నాత కోపన్యాసకులయారనీ రూఢిగా తెలియుచున్నది. అందువలన సర్ హైదరీగారు కారణాంతరముల వలన వచ్చుటలేదు కాన పట్టభద్రులు స్నాతకో పన్యాసాన్ని బహిష్కరించనక్కరలేదు. కాని వారిచర్యలయెడ, వారువాటిని మార్చుకొనే వరకూ (వందేమాతరం తగాదా) ఆందోళన సాగిస్తూనే యుండాలి వారు వారి చర్యలు సర్దు కునేటట్లు చెయ్యాలి.

* * *

కృష్ణాజిల్లా అగ్రికల్చరల్ మేస్త్రీల ప్రధమ సమావేశము.

పై సమావేశము శ్రీ యార్లగడ్డ వెంకట కృష్ణయ్యగారి అధ్యక్షతక్రింద 5-8-39వ తేదీన వుయ్యూరులో జరిగెను.

ఈ క్రిందితీర్మానాలు ఏకగ్రీవముగా ఆమో దించబడినవి.

1. మేస్త్రీలు గ్రామకరణములను కలసి కొనినపుడు వెంటనే విస్తీర్ణముల వగైరాలు యిచ్చునట్లుగా రెవెన్యూ శాఖాధికారుల నుండి అర్జీల్లు యిప్పించగలందులకు మద్రాసు ప్రభు త్వమువారిని కోరుచున్నాము.

2. తాత్కాలిక వ్యవసాయ సంబంధమైన ఇంగ్లీషు, తెలుగు కరపత్రములు ప్రతి సంవత్స రము తెప్పించగలందులకు కోరుచున్నాము.

3. అగ్రికల్చరల్ ఫారములలో ట్రైనింగులో యున్నపుడు లోగడ స్టయిపెండు యిచ్చుట వల్ల వారు పొట్టపోషించుకొనుటకు అనుకూలముగా యుండెడిది. యిప్పుడు ఆ స్టయిఫండు యిచ్చుట మానివేసిరి కనుక డిపార్టుమెంటు తిరుగ ఆ స్టయిఫండు యిప్పించ గలందులకు ప్రభుత్వమువారిని కోరుచున్నాము.

4. 1864 వ సంవత్సరమునుంచి పని చేయుచున్న మేస్త్రీలను యింతవరకు పెంప రరీగానే తీసుకొనుచున్నారు కాబట్టి డైరక్టరు దొరవారు మేస్త్రీలకున్ను మిల్లు పరిపాలక వర్గమువారు మిల్లు మేస్త్రీలకున్ను పర్మనెంటు చేయగలందులకు కోరుచున్నాము.

5. ప్రతిసంవత్సరము మేస్త్రీల సమావేశ మునకు డిపార్టుమెంటువారు డిపార్టుమెంటు వారికిన్ని, ఫ్యాక్టరీ పరిపాలక వర్గమువారు ఫ్యాక్టరీ మేస్త్రీలకున్ను, 3 రోజులు పర్మిషన్ యిప్పించగలందులకు కోరుచున్నాము.

6. మేస్త్రీలు తిరుగుచు భత్యముల విషయ ములో కష్టసుఖములు గ్రహించి తగిన వేతన ములు యిప్పించగలందులకు కోరుచున్నాము.

7. ప్రతి తాలూకాలోను ప్రతి ఫిర్కాకును ఒక్కొక్క మేస్త్రీని వర్కు బాగుగా జరుగు టకుగాను అపాయింటు చేయగలందులకు ప్రభుత్వమువారిని కోరుచున్నాము.

8. మేస్త్రీలయొక్క పని తెలివితేటలను బట్టియు వారియొక్క సర్వీసును బట్టియున్ను వారియొక్క విద్యనుబట్టిన్ని గ్రేడు మార్పు చేయగలందులకు కోరుచున్నాము.

* * *

భీమవరం తాలూకా ప్రజలకు హెచ్చరిక

అఖిలభారత కాంగ్రెసు మహాసభ తీర్మా నానుసారం ప్రతి కాంగ్రెసువాది ప్రతిసంఘము ప్రచారము చేయవలసియున్నది.

ఆ ప్రకారము మన తాలూకాలో కూడ సామ్రాజ్యవాదమును బలపరచు యుద్ధములను ప్రతిఘటించుటకును, అట్టి యుద్ధసన్నాహాలకై మనదేశమున బ్రిటిషు ప్రభుత్వమువారు సాగించు సైనిక రిక్రూటుచేర్చు కార్యక్రమమును అన్ని విధముల నిరోధించుటకును, శాంతి సైనికులను చేర్చుకొనుటకును, ప్రాథమిక సభ్యులను చేర్పించుట మొదలగు కాంగ్రెసు ప్రచారము 15-8-39 నుంచి తాలూకా కాంగ్రెసు యాజ మాన్యమున దళములు దయలుదేరును. అయా గ్రామసంఘములవారు, రాష్ట్ర, జిల్లా, తాలూకా సభ్యులు దళములలోచేరి ప్రచారం నిర్విఘ్న ముగా కొనసాగించుటకు సహాయము చేయ వలసినదిగాను, పైదళములవారికి అన్నివిధ ముల సహకారము చూపవలసినదిగా తాలూకా ప్రజలను హెచ్చరించుచున్నాము.

ఇట్లు
కృ॥ వెంకటేశ్వరరావు
కార్యదర్శి,
భీమవరం తాలూకా కాంగ్రెసు సంఘం,
11—8—39

* * *

తూ॥ గో॥ జిల్లా వాలంటీరు మహాసభ.

20 వ ఆగస్టు '39 ఆదివారం ఉదయం 11 గంటలకు కాకినాడ కాం॥ సో॥ పార్టీ ఆఫీసులో కలకత్తా దక్షిణ డివిజన్ వాలంటీరు దళ కమేం డర్ కామ్రేడ్ చున్నీలాల్ ముఖర్జీ అధ్యక్షతను పై మహాసభ జరుగును. అందు "తూ॥ గో॥ వాలంటీర్ బ్రిగేడ్" ఏర్పరుపబడును. కావున జిల్లాలోని వాలంటీర్లందరూ ఆ మహాసభకు విచ్చేసి అందు పాల్గొనకోరుచున్నారు.

కొరపాటి పట్టాభిరామయ్య,
అర్గనైజరు.

* * *

తూ॥ గో॥ జిల్లా కాం॥ సోషలిస్టుపార్టీ

ది 21 ఆగస్టు 39 ఉదయం 8 గంటలకు కాకినాడ కాం॥ సో॥ పార్టీ ఆఫీసులలో పై పార్టీ కార్యనిర్వాహక సంఘ సమావేశము దిగువ విషయాలు చర్చించుటకై జరుగును గాన సభ్యులెల్లరు హాజరుకావలయును.

విషయాలు

1. కార్యనివేదిక
2. కార్యసంఘములో ఏర్పడిన ఖాళీలు పూర్తిచేయుట
3. ప్రచారపు ఏర్పాట్లు
4. రైతు సమస్యలు
5. ఇతరములు

కొ. పట్టాభిరామయ్య,
కార్యదర్శి.

* * *

కాకినాడ సోషలిస్టుల ప్రచారము.

కాకినాడ నగర సోషలిస్టుపార్టీ యాజమాన్య మున 6-8-39 వ తేదీని 25 గురు వాలంటీర్లు కొవ్వాడ, రామేశ్వరం, అచ్యుతాపురం, పెద పూడి, దోమాడ, కడకుదురు, కొవ్వూరు గ్రా మాలలో సంచారముచేసి జాతీయపోరాటమును గురించీ రైతు కూలీ సమస్యలను గురించీ భారతమైక్య సంఘటనావశ్యకతను గురించీ ఫెడరేషనును సామ్రాజ్యవాద యుద్ధాలను ప్రతి ఘటించవలసిన అవశ్యకతను గురించీ ప్రబోధ ముగావించిరి. కాంగ్రెసులో సభ్యులుగా చేరమని రైతు, కూలీ సంఘముల నేర్పరచుకొమ్మని హెచ్చరించిరి. ఉత్సాహవంతులను కొందరను వాలంటీరు దళములో చేర్చుకొనిరి ప్రతిచోటను వాలంటీర్లు ఉపన్యసించిరి. సభానంతరమున దళ సభ్యులందరును ప్రజల దగ్గరకు వెళ్లి వారివారి బాధలను తెలుసుకొని రిపోర్టును తీసుకొనిరి ఇటులనే యీ ప్రచారక దళమువారు ప్రతి ఆది వారము పరిసరగ్రామములన్నింటిలోను ప్రచా రము గావింప పూనుకొనిరి.

* *

ఆత్మకూరు తాలూకా(నెల్లూరు)లో యుద్ధవ్యతిరేక ప్రచారం

యీ తాలూకాలో ప్రతి గ్రామానా మునసబు ద్వారా యుద్ధంలో సైనికులుగా చేర్చుకొనుటకు దండోరాలు వేయిస్తున్నారు. అయినా యిక్క డెవ్వరూ సైనికులుగాచేర ప్రయత్నించడం లేదు. అంతేగాక, యెక్కువ మహమ్మదీయు లున్న ప్రదేశాల్లో. యెక్కువ నిరుద్యోగులున్న ప్రదేశాల్లో, సైనికులెక్కువగా చేర్తారు. అచ్చ టనే యెక్కువ సైనిక ప్రచారాలుకూడావుంటవి. యిది గమనించి కాంగ్రెసు వాలెంటర్లు యెక్కు వగా యుద్ధవ్యతిరేక ప్రచారం గావించాలి. యీనెల 4 వ తేదీనుంచి 10 వ తేదీవరకూ అనంతసాగరం, మంగుపల్లె, కామిరెడ్డిపాడు, గౌరవరం, తోపుగుంట, కాంసాపేట, కేతు గుంట మొదలగు గ్రామాల్లో కామ్రేడ్ జి. సి. కొండయ్యగారు బహిరంగసభలు జరుపుచూ యుద్ధాల్లో సైనికులుగా చేరవద్దనీ, చేరితే వుండే నష్టాలు, యుద్ధసమయములో స్వాతంత్ర పోరా టం మొదలుగాగల విషయాలను గురించి తెలియచేసారు.

* * *

పెదవడ్లపూడి రైతుల సభ.

11—8—39 వ తేదీని పెదవడ్లపూడిలో సూదనగుంట్ల చింపయ్యగారి అధ్యక్షతను బహి రంగసభ జరిగెను. సభకు పనిరోజులుగా వున్నా, సుమారు 200 రైతులు వచ్చారు. గుంటూరుజిల్లా రైతు సంఘాధ్యక్షులు ధూళి పాళ్ళ కోటయ్యగారు, ముత్తేవి మాధవాచార్య గారు ప్రస్తుతం రైతులు అనుభవిస్తున్న కష్టా లను గురించీ, వాటిని పోగొట్టుకొనుటకొరకు రైతు సంఘంద్వారా పోరాడవలసిన అవస రాన్ని గురించి మాట్లాడిరి. సభలో ఈక్రింది తీర్మానములు ఆమోదించబడెను.

1. క్రిష్ణా వెష్టరన్ హైలెవెల్ ఛానల్ యొక్క షట్టర్సుకు దిగువను తూములు వేయ టంవల్ల భూములకు నీరు ఎక్కుటలేదు. అందు వల్ల లోగడ రెండు సంవత్సరాలనుంచీ ఎగ్జి క్యూటివు ఇంజనీరుగారు అడ్డీ వేసుకొనుటకు జూలై 11 వ తేదీ నాటికే అనుమతి నిచ్చుట వల్ల సాగు సక్రమంగా జరిగింది. ఈ సంవత్స రము అడ్డీకి అనుమతి ఇవ్వని కారణంవల్ల చాలాభాగం ఇంతవరకూ నాట్లుకాలేదు. కాబట్టి తూములు షట్టర్సుకు ఎగువనైనా వేయించాలి. లేనిచో శాశ్వత ధాముకైనా అనుమతి ఇవ్వాలి అని ఈసభవారు కోరుచున్నారు.

2. మొట్టమొదట ఆయకట్టులో చేర్చిన 9 వందల యకరాలలో నుంచి 1937 లో హై లెవెల్లో నున్నదనే కారణంతో 2 వందల యక రాలు ఆయకట్టులో నుంచి తొలగించారట, రైతులు చాలా భూములను మెరకలు తీసి లో లెవెల్‌గా మార్చారు. ఆ భూములు ఈ రోజున మెరకపంటకు పనికిరాకుండా పోయినవి. కాబట్టి మొత్తం 9 వందల యకరాలను ఆయకట్టులో చేర్చాలని యీ సభవారు కోరుచున్నారు.

టెక్‌స్టయిల్ కార్మికులపై యజమానుల దాడి

కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

దేశీయ పరిశ్రమలలోకల్ల టెక్‌స్టయిల్ పరిశ్రమ అత్యంత ప్రాముఖ్యత వహించినది. విదేశ వస్త్ర బహి ష్కరణవల్ల ఈపరిశ్రమలో పెట్టుబడిదారులు అత్యధిక లాభములు గడించి తమ పరిశ్రమను సామ్రాజ్యవాదం నుండి కాపాడుకొన గల్గిరి. కాంగ్రెసువారు అధికారా లలోనికి వచ్చినతరువాత యీ కార్మికుల మధ్య గల్గిన సంచలనమును గమనించి విచారణ కమిటీలు నియమిం పబడినవి. ఈ కమిటీలు కార్మికుల వేతనాభివృద్ధి యావశ్యకతను నిరూపించినవి. వేతనాభివృద్ధిని యజమానులు ఆచరణలో పెట్టుటకు కాంగ్రెసుప్రభుత్వాలు యజమానులపై ఒత్తిడి తెచ్చినాయి. అప్పటినుంచి పెట్టుబడి దారులు కాంగ్రెస్‌మీద దెబ్బ తీయుటకు సంక ల్పించుకొనిరి.

మన రాష్ట్రంలో సుమారు 50 వేలమంది యీ పరి శ్రమలో జీవించుచున్నారు. ఇదివరలో వీరికి సుమారు నూటికి 20 వంతున జీతములు అభివృద్ధిఅయినవి. ఈ వేతనాభివృద్ధిని తొలగించాలని దేశమంతట యీ పెట్టు బడిదారులు నిశ్చయించుకొనిరి. అందుకై వ్యాపార మాంద్యము యేర్పడినదని ఆందోళన ప్రారంభించిరి.

యజమానుల దాడి

యజమానులు గుడ్డ ధర, దారము ధర తగ్గినదని, బేలులు నిలువవుండిపోయినవని తెలియచేయుచున్నారు. జపానునుండి దిగుమతి అధికమయినదని; హిందూదేశ మునకు-బ్రిటనుకు జరిగిన ఒడంబడికవల్లను, బ్రిటన్ పోటీ మరింత తీవ్రమయినదని; విదేశపు ప్రత్తిపై దిగుమతి సుంకము అధికము చేయుటవల్ల ప్రత్తి ధర పెరిగి పుత్పత్తి చార్జీలు అధికమయినవని; వీటితోబాటు కార్మికుల వేతనములు అధికమగుటయు, కాంగ్రెసు ప్రభుత్వాలు విధించు పన్నులభారమువల్ల పరిశ్రమ క్షీణించుచున్నదని నిరూపించుటకు యజమానులు ప్రబల నిదర్శనము యేమియు చూపుటలేదు. వీరు తెలి యజేసిన కారణాలు కార్మికులపైదాడిని సాగించుటకు పురస్కరించుకొనిన సాకులా, లేక యదార్ధములా యను విషయం యోచించాలి.

యజమానుల బూటకత్వం

గత విచారణ సమయములందుకూడ యజమానులు యిట్టి సాకులనే చూపిరి. కాని విచారణ కమిటీ యజ మానులు, తమకు మామూలుగా వచ్చు లాభములను ముట్టుకొనకుండగనే, ప్రత్తి ధర విపరీతముగ పడి పోవుటవల్ల, అత్యధికముగా కల్గిన లాభములలో నుంచి నూటికి 20, 25 వంతున వేతనము అధికము చేయవచ్చునని సూచించిరి. ఈ విధముగా రెండు సంవత్సరములవరకుకూడ యజమానులు జీతములివ్వ గలరని కమిటీవారు తెలియజేసిరి.

వ్యాపార మాంద్యమైననూ, యజమానులు ప్రద ర్శించుచున్నంత తీవ్రముగా లేదనే చెప్పవచ్చును. వీరు ధరలు పడిపోయినవని, వాదించుచున్నారు. కాని గుడ్డ ధరతోబాటు ప్రత్తి ధరకూడ పడిపోయింది. అందువల్ల వుత్పత్తి ఛార్జి తక్కువగుటవల్ల లాభాల మార్జన్ తగ్గలేదని తేలుచున్నది. జపాను పోటీ తిరిగి యీ సంవత్సరము ప్రారంభమయిందని యెలుగెత్తి చాటు చున్నారు. అందువల్ల దారము మాత్రమే తీయు మిల్లు లకు మరింత నష్టము అధికమయినదట. కాని జపాను నుంచి దిగుమతి అగు దారము నూటికి 3½ వంతులు మాత్రమే అది అయిననూ మార్చి 1939 సం॥వరకు 315 లక్షల పౌనులు అయితే మార్చి 1940 సం॥ వరకు 340 లక్షల పౌనులు వుండుననని అంచనా వేయబడినది. దీని నిబట్టి యీ పోటీకూడ పరిశ్రమను ముంచు నంత లేదని తేలుచున్నది. ప్రజాభిప్రాయమును తృణీ కరించి భారత ప్రభుత్వం బ్రిటిషు గుడ్డపై నూటికి 5 వంతున పన్ను తగ్గించినందులకు ప్రభుత్వపు చర్యను నిరసించి ప్రతిఘటించాలిసిందే. కాని, ఇం గ్లండులోని టెక్‌స్టయిల్ కార్మికులకు కొన్ని సదు పాయములు చేయుటవల్ల లాంక్‌షైరుకు నూటికి 8 వంతున ఉత్పత్తి ఛార్జి అధిమయింది. అందువల్ల ఇది మన పెట్టుబడిదారులకు ఒక విధంగా రక్షణగా యేర్పడుచున్నది. మన దేశీయ పెట్టుబడిదారులకు మరి యొక విధముగా వ్యాపారం అభివృద్ధి చెందినది, మలయా దీవులందు జపాను వస్తువులను చైనా వ్యాపా రస్థులు బహిష్కరించిరి. వారు మన దేశపు గుడ్డను కొనుచున్నారు. మొత్తంమీద ఆలోచించిన యెడల వ్యాపారం మందగించుట కల్పితమైననూ అయి వుండాలి; లేదా కొద్దిగా నున్న యడల మరింతచేసి యుండాలి. బేల్సు నిలువ వుండుటకు కారణం సహజ ముగా యీ మాసాలందు వ్యాపారము తగ్గుటయే.

యజమానుల ప్రతిక్రియలు.

వ్యాపార మాంద్యమను సాకుతో యజమానులు కార్మికులపై సమర సంరంభము గావించిరి. బొం బాయిలో రాత్రి పని మాన్పించి 30 వేలమంది కార్మి కులను నిరుద్యోగులుగ చేసిరి. కొన్నిచోట్ల వారము నకు ఒకటి రెండు రోజులు అదనముగ పని కట్టి వేయుటకు సంకల్పించిరి. అహమ్మదాబాదులో నూటికి 15, 20 వరకు జీతాలు తగ్గించాలనుచున్నారు. కాన్పూ రులో రేషనలైజేషన్ ప్రారంభించి పనివారల జీతాలు కూడ తగ్గించుచున్నారు. కోయంబత్తూరులో నూటికి 50 వంతును వుత్పత్తి తగ్గించుటకు నిశ్చయించు కొన్నారు. ఇందువల్ల సగానికి సగము కార్మికులు నిరుద్యోగులగుటయో, కార్మికుల సాముదాయకపు సంపాదన సగానికి సగము తగ్గుటయో జరుగును.

ప్రతిక్రియల ముఖ్యోద్దేశము

యజమానుల దాడికి కారణం వ్యాపారమాంద్యం కన్న కాంగ్రెస్ మంత్రుల ప్రజోపకరమగు క్రియలకు ప్రతిక్రియయే. అదనముగా వ్యాపారంమీద నూటికి 14 వంతున రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల చర్యలవల్ల నష్టము వచ్చిందని యజమానులు గగ్గోలు పెట్టుచున్నారు. ఈ 14 వంతులలోను 5 వంతులుమాత్రమే వేతనము అధి కము చేయుటవల్లనూ రాష్ట్ర ప్రభుత్వాలు అదనముగా విధించిన పన్నులవల్ల నష్టమువచ్చిందనీ, మిగిలిన 9 వంతులు సామ్రాజ్యవాదుల కేంద్ర ప్రభుత్వాలవల్ల నష్టమువచ్చిందని యజమానుల లెక్కలనుబట్టి తెలియు చున్నది. 9 వంతుల భారము తొలగించుకొనుటకు ప్రజాసామాన్యపు సహాయంతో సామ్రాజ్యవాదులతో ఢీకొనుటకు మారుగా ప్రత్యక్షముగా కార్మికులపైననూ, పరోక్షముగా కాంగ్రెసు మంత్రులపైననూ దండయాత్ర సలుపుటవల్ల యజమానుల తలంపులను శంకించవలసి వచ్చింది.

కార్మికుల కర్తవ్యం

కాంగ్రెస్ మంత్రులు కార్మికుల వేతనాభివృద్ధి అం గీకరించటము, కనీసము జీతము ఇత్యాదులగు సౌకర్య ములు చెయ్యాలనటం, మద్రాసు రాష్ట్రంలో నిరుద్యోగ భృతి యేర్పరచి యీ టెక్‌స్టయిల్ పరిశ్రమయందు అమలుపెట్టెదమని తెలియచేయటం పెట్టుబడిదారులకు యిష్టములేదు. వీరు కాంగ్రెసు నాయకత్వమును తమకు అనుకూలముగా చేసుకొనుటకు ప్రయత్నించు చున్నారు. ఈ పరిస్థితులను గమనించి భారతదేశమం దలి టెక్‌స్టయిల్ కార్మికసంఘ ప్రతినిధులు సమావే శమై రాష్ట్రప్రభుత్వాలు వెంటనే కార్మికశాసనములు చెయ్యాలనీ, లేనియెడల కార్మికులు జనరల్‌స్ట్రయిక్‌కు సంసిద్ధులుగ నుండవలెననీ తీర్మానించిరి.

మన రాష్ట్రంలో

కోయంబత్తూరు మిల్లు యజమానులు నూటికి 50 వంతులు తగ్గించుటకు సంకల్పించి కార్మికమంత్రి గిరి గారు జోక్యము కలిగించుకొనుటవల్ల నూటికి 30 వం తులు పుత్పత్తి తగ్గించుటకు అంగీకరించిరి. అప్పుడే 12 మిల్లులలో ఆచరణలోనికికూడ వచ్చింది. ఇందు వల్ల యీ కార్మికుల సాముగాయకపు ఆదాయం నూటికి 30 వంతున తగ్గింది. విచారణకమిటీవల్ల కలి గిన నూటికి 20 వంతుల వేతనాభివృద్ధి కోల్పోవుటయే కాక అదనముగాకూడ కార్మికుల సాముదాయకపు ఆదాయం తగ్గింది, ఇందుకు గిరిగారు అంగీకరించుట కడుశోచనీయం. కాని యజమానులు ఇంతటితో గిరి గారి సూచనను మన్నించుతారని నమ్మకములేదు. ఒక నెలలోపు వ్యాపారాభివృద్ధి చెందకపోయిన యెడల వారి చిత్తం వచ్చినంత వుత్పత్తి తగ్గించుటకు హక్కు గలిగివున్నారు.

తమిళనాడు రాష్ట్ర కాంగ్రెసు కమిటీ, యజమాను లకు కార్మికులపై దాడి సల్పవద్దని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి కల్గించి హిందూదేశపు బ్రిటిషు ఒడంబడిక రద్దుచేయుటకు, విదేశపత్తిపై దిగుమతి సుంకము తగ్గించాలని కాంగ్రెసు మంత్రివర్గాన్ని భారత కార్య నిర్వాహక వర్గాన్ని కోరింది. కాని యజమానులు రాష్ట్ర కాంగ్రెసును నిర్లక్షించుటయేకాక కాంగ్రెసు మంత్రి వర్గాలు అయిననూ, కేంద్ర ప్రభుత్వాలమీద ఒత్తిడి చేయలేదని (ఆగష్టు 2 వ తేది వరకు) తెలియు చున్నది. కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గంకూడ యీ విషయమై వుపేక్షించినట్లే తెలియుచున్నది. ఈవిషమ పరిస్థితులలో కోయంబత్తూరు కార్మికుల మధ్య ఐక మత్యత లేకపోవుట విచారం. కార్మిక నాయకులలో కొంతమంది 30 వంతున తగ్గించుటకు అంగీకరించిరి. మిల్లు వర్కర్సు యూనియన్ ఆధిపత్యంక్రింద 10 వేల మంది కార్మికులు సమావేశమై సమ్మెచేయుటకు నిశ్చయించుకొనిరి. పెట్టుబడిదారుల దాడిని యెదుర్కొనుటకు కార్మికులు జరుపు పోరాటములకు ప్రజానీకము పూర్తిగా సహకారము చెయ్యాలి.

ఫ్యాక్టరీ కార్మికుల దుస్థితి

ఫ్యాక్టరీ ఆక్టుకూడా అమలు జరుగుట లేదు

కామ్రేడ్ మునిపల్లి రామారావు

ఆంధ్రరాష్ట్రంలో అనేక వ్యాపార పేద శనగ, ప్రత్తి ఫ్యాక్టరీలున్నవి. వీనిలో కనీసం ఫ్యాక్టరీ ఆక్టు క్రింద కార్మికులకు ఏర్పడవలసిన స్వల్ప సౌకర్యాలైనా ఆచరణలో అమలునందుంచుటలేదు. శాసనం ప్రకారం మధ్యాహ్నం రెండుగంటల విశ్రాంతి అని ఫ్యాక్టరీ రూల్సు వుంటే కూలీలు అన్నపు మూటలు తెచ్చుకొని ముక్కునా నోటనా కొట్టుకొని పనిలో చేరవలసిందే. చుట్ట కాల్చుకొనుటకుకూడా విశ్రాంతి నుండనివ్వరు యజమానులు. స్త్రీ కార్మికులకు వారి పసిపిల్లలకు పాలు యిచ్చివచ్చుటకు కూడా విశ్రాంతి యివ్వరు. పట్టణాలలో మిల్లు యజమానులే మున్సిపల్ కవున్సిలర్లు. అందుచే కమీషనర్లు, హెల్తు అఫీసర్లు వారి చెప్పుచేతలలోనే వుంటారు. ఫ్యాక్టరీ యినస్పెక్టరు తనిఖీ వస్తుందని ముందుగా తెలిసికొని అన్నీ చక్కపరచుకొంటారు. ఇనస్పెక్టరు వచ్చిన రోజున అన్నిరూల్సు అమలు జరుపుచున్నట్లే చూపిస్తారు. ఏదైనా లోపమున్నదంటే లంచాలు వుండనే వున్నాయి. యజమానుల విందుల చుములలో పడని ఫ్యాక్టరీ యినస్పెక్టర్లు సాధారణంగా వుండనే వుండరు. ఇక పల్లెటూళ్ళలో వున్న ఫ్యాక్టరీలలో శాసనం అమలు జరుగుట సంగతి వేరే చెప్పనవసరంలేదు. ఫ్యాక్టరీపెద్దలే గ్రామపెద్దలుగా వుంటారు. వారిచిత్తమే చట్టం! కూలివాడు నోరుతెరచి "నా హక్కు" అని అడగటానికే గుండెవుండదు....

ఫ్యాక్టరీలలో ఆరోగ్య నియమాలు.

ఫ్యాక్టరీ ఆక్టు ననుసరించి కార్మికుల ఆరోగ్యమునకై వలయు సౌకర్యములు చేయబడుట లేదు. ఫ్యాక్టరీలు పురాతన యిండ్లలో పట్టణములమధ్య వుంటూవున్నాయి. గాలియే ఆ గృహాలలోనికి (గుహాలంటే బాగుంటుంది) ప్రవేశించజాలదు. పొట్టు తవుడు, కార్మికుల ముక్కులనిండా, కండ్లనిండా కొట్టుకొనుచుండును. మున్సిపాలిటీవారు ఫ్యాక్టరీలను వూరి వెలుపల కట్టునటుల చేయవలెను. అంతలోపల పట్టణములోని ఫ్యాక్టరీలకు మంచి వెలుతురు గాలి వచ్చేటట్లు చేయవలసినదని యజమానులను ఆజ్ఞాపించవలెను.

ఫ్యాక్టరీ ఆక్టుననుసరించి కార్మికులకు శుభ్రమైన మంచినీళ్ల ఏర్పాట్లు యజమానులు చేయవలెను. కాని అన్ని ఫ్యాక్టరీలలోను సాధారణంగా కూలీలు దాహమైనపుడు పంపులవద్దకు పోయి ఆనీళ్లే త్రాగవలసి వస్తుంది. కొన్ని ఫ్యాక్టరీలలో మంచినీటి పంపులే వుండవు. ఏపాడుబడిన బావో వుంటుంది. ఆనీళ్లే త్రాగవలసి వస్తుంది. మంచినీళ్లకు ఒక మనిషిని ఏర్పాటుచేసి నీళ్లు పరిశుభ్రముగా వడపోయించవలెను. కలరా రోజులలో నీటిని కాయించవలెను.

కూలీలకై మరుగుదొడ్లులేవు. ఏదైనా ఒక పాకీదొడ్డి వున్న యజమానులే వుపయోగించుదురు. వాటిలోనికి కూలీలను పోనివ్వరు. స్త్రీ. పురుష కూలీలకు వేరువేరు మరుగుదొడ్లు కట్టించవలెను. ఆదొడ్లను ప్రొద్దున సాయంత్రం ఊడ్పించవలెను. ఆదొడ్లలో "ఫెనాయిలు" నీళ్లు వుంచవలెను.

ప్రమాదాలు.

ఇంజెన్లదగ్గర, పట్టాలవద్ద కటకటాలు (Fencing) చాలఫ్యాక్టరీలలో వుంచుటలేదు. మన దేశపు కూలీలకు ధోవతులు, చీరలు కట్టుకొను అలవాటు పోలేదు. వస్త్రములు ఇంజన్లలోను, పట్టాలలోను పడి అనేక ప్రమాదములు జరుగుచున్నవి. ఆ ప్రదేశములలో (Fencing) కటకటాలు కట్టించవలెను. ఫ్యాక్టరీలు డ్రైవర్లకు, ఆయిల్‌మన్లకు, హల్లరు మేస్త్రీలకు ప్రతి సంవత్సరం రెండు జతల 'కాకీ, యూనిఫారం దుస్తులు యివ్వాలని వుంటే యివ్వుటలేదు. స్వంతంగానే కుట్టించు కొనిన లాగు చొక్కాలు కట్టుకొందురు. అవి చినిగి చీపులై మసికొట్టుకొని అనారోగ్య కరముగా వుండును. వాని ద్వారా పనివారలకు అనేక చర్మవ్యాధులు వచ్చుచున్నవి. ఫ్యాక్టరీ యజమానులు సంవత్సరమునకు రెండుజతలు కాకీ యూనిఫారము లిచ్చేటట్లు చెయ్యాలి.

ఎప్పుడైనా ప్రమాదము సంభవించిన ఉపయోగించుటకు వలయు (First Aid) మందులు వుంచవలయును. గాయములు తగిలిన వారిని వెంటనే ఆసుపత్రికి పంపించవలెను; 'గోరేగదా ఊడింది', 'వ్రేలేగదా నలిగింది' అని ఏ తడిగుడ్డో చుట్టించి యజమానులు వారి చేతనే పని చేయించుతారు. చిన్న ప్రమాదాలకు జీతంపై నయమగువరకూ నెలవుయిచ్చునట్లు యజమానులపై ఒత్తిడితేవాలి. పెద్ద ప్రమాదాలకు వర్క్‌మెన్స్ కంపెన్‌సేషన్ ఆక్టు ననుసరించి, ప్రమాదం జరిగిన కార్మికునికి (లేక అతని కుటుంబానికి) పరిహారం యివ్వవలసి వుంటుంది. కాని యిపుడు అనేక విషయాల్లో కార్మికు లమాయక స్థితిలో వుండుటచే పరిహారమును పొందుటలేదు. కాంగ్రెసు కమిటీలు లేబరు కమిషనరుకు రిపోర్టుచేసి యిది అమలు జరుగునట్లు చేయాలి.

స్త్రీ కూలీలు

రాత్రులందు స్త్రీ కూలీలచే పని చేయించకూడదని రూల్సు వున్నప్పటికి యజమానులు వాటిని తిరస్కరించకుండా వుండరు. స్త్రీకూలీలకు యిచ్చే కూలి మొగవాళ్లకంటె తక్కువగుటచేత వారినే పెట్టుకొందురు. ఫ్యాక్టరీలలో చేయవలసిన పనులుకూడా భారమైనవి కాకపోవుటచేత స్త్రీలనే యెక్కువగా వుపయోగించుదురు. రాత్రులందు వారిని వుంచుటచే అవినీతికి తావిచ్చిన వారగుదురనియు, స్త్రీలకు రాత్రులందైన విశ్రాంతి లేకపోయిన పిల్లలల పోషణకు కొరత పడుననియు రాత్రులందు వారిని పెట్టకూడదని నిషేధము వుంటే వారినే యజమానులు పనిలో రాత్రులందు వుంచుట 'ధనకాంక్ష' కాక మరి యేమిటి?

జీతముపై గర్భవతి స్త్రీలకు సెలవులు

ఫ్యాక్టరీలలో పనిచేయు స్త్రీలకు గర్భము దాల్చినచో 1 నెల రోజులు జీతముపై శలవు లివ్వబడునన్న విషయము వారికి తెలియనే తెలియదు. సాధారణంగా కూలీలను రోజుకూలీలగానే వుంచుదురు. యజమానుల సౌకర్యమునకై నెలజీతములపై పెట్టుకొనిన స్త్రీ కూలీలు గర్భము దాల్చినచో నవమాసములు నిండకపూర్వమే గిల్లి కయ్యము పెట్టుకొని పనిలో నించి తొలగించుదురు. ఒక నెలజీతము ఆదా చేయుటకు ఎంతఘోరమైన పని చేయుదురు యజమానులు! పాపమాస్త్రీలు నిండుగర్భముతో బజారులలో అడుక్కొని జీవించవలసినదే! రెక్కలాడినన్నాళ్లు డొక్కలాడును. లేవలేని నాడు పస్తు.

శాసనం ప్రకారము గర్భవతులగు స్త్రీకార్మికులకు రావలసిన (మెటర్నిటీ బెనిఫిట్) సహాయము యజమానులు స్త్రీ కూలీలకు యిచ్చునట్లు చేయాలి.

ఎన్నిగంటల పని చేయించుచున్నారు?

ప్రతిఫ్యాక్టరీ యెదుట ఫ్యాక్టరీ పనిచేయు గంటలు, ఎంతమంది పనిచేయుచున్నది ఒక బోర్డుమీద వ్రాసి కట్టబడి వుంటుంది. కాని కార్మికులు చదువు రాకపోవుటచేత వచ్చినా అడుగుటకు ధైర్యములేక దానివలన కార్మికులు లాభము పొందుటలేదు. సీజనల్ ఫ్యాక్టరీ (Seasonal factories) రోజుకి 1 కి 10 గంటలపని సంవత్సరము పొడుగునా ఆదే ఫ్యాక్టరీలలో 9 గంటల పనిచేయవలసి వుంటుందన్న సంగతి కార్మికులకు తెలియదు మధ్యాహ్నము 2 గంటల విశ్రాంతి యివ్వనే యివ్వటములేదు ఆ గంటల మించిన పనికి (Extra time work) అధికంగా కూలి యివ్వటము లేదు. నెలజీతాల డ్రైవర్లకు, ఆయిల్‌మన్‌కు, హల్లరు మేస్త్రీలకు (Extra time) ఎక్‌స్ట్రాపనికి రెట్టింపు వేతనము లిచ్చుటలేదు ఫ్యాక్టరీలలో Shift system రెండు మూడు ముఠాలుగా పనిచెయుచున్న డ్రైవర్లు, ఆయిల్‌మన్లు ప్రతి షిఫ్టుకు వేరువెరుగా మనుష్యులను పెట్టరు ఒక్క డ్రైవరును పెట్టి రాత్రింపగళ్లు పనిచేయించు చుందురు.

రెండు షిఫ్టులకు మూడుషిఫ్టులకు ప్రత్యేకమైన నెన్నులు లేకుండానే రాత్రి 10, 11 గంటల వరకు, ఒక్కొక్కప్పుడు రాత్రియంతా ఆడించుచుందురు. ఆదివారం రాత్రియంతా ఆడించుచుందురు.

అకారణంగా పనిలోనుండి తీసివేయుట

అనేకమంది పనివారలను అకారణముగా యజమానులు తీసివేస్తారు. కూలీలు ధైర్యముగా రూల్సు ప్రకారము మాట్లాడినారంటే ఉద్యోగముపై ఆశ వదలవలసినదే. వారిని తీసివేయునప్పుడు ఏకారణముచేత తీసివేసినది చెప్పరు. 15 రోజుల నోటీసుకూడా యివ్వరు. యజమానుల చిత్తంవచ్చినట్లు పనివారలను తీసివేయటం ఎదుర్కొనాలి. పనివారలు సంవత్సరములకొలది పని చేయుచున్నా రోజుకూలీల మాదిరిగా మస్తరులలో వ్రాయుదురు 3 నెలలు వరుసగా పనిచేయు కూలీల నౌకరీలు ఖాయము చేయవలసినదని కాంగ్రెసు కమిటీలు యజమానులపై వొత్తిడి తీసికొనిరావలెను. అకారణంగా కూలీలను తీసివేసిన కేసుల తరపున కాంగ్రెసు కమిటీలు పోరాడవలెను.

జీతాలు.

రోజు కూలీలుగా వున్నవారి కూలీ ఆరోజునే బట్వాడా చేయునట్లు చూడాలి. నెలజీతముల పై నున్నవారి జీతాలు మొదటివారం లోపలనే ముట్టునట్లు చెయ్యాలి. అసలే వారి జీతములు స్వల్పము. అవికూడా బకాయిలైతే అప్పులిచ్చు దుకాణదారులకేమి సమాధానము చెప్పగలరు? దుకాణదారుల దగ్గర అప్పులు తెచ్చుకొనుటచే రూపాయకి అణాలు. పేదలు వడ్డీలు వ్రాసుకొని ధరలెక్కువచేసి వస్తువుల నమ్ముదురు. ఆ జీతాలు చిల్లర దుకాణ దేవతలకప్పుజెప్పి గుడ్లు తెంచు మిటకరించుకొని పోవలసినదే. జిహ్వా చాపల్యముచే ఎప్పుడైనా బుగ్గారెలుగాని, చేగోడీలు కాని కొనుక్కుందామన్నా కానిడబ్బు చేతలో వుండదు. కార్మికుల పిల్లలు అరటితోళ్లు చీకుతూ, కుళ్లిపోయిన మామిడికాయలు తినుచును కడుపు నింపుకొనవలసివస్తున్నది.

కాబూలీవాలా వడ్డీలను రద్దుచేయించవలెను. యజమానులే కార్మికులకు వలయు అప్పు సౌకర్యములు చూడవలయును.

జుల్మానాలు—ధర్మవసూళ్ళు.

అసలే జీతాలు తక్కువైతే, వాటిలోనుండి జుల్మానాలక్రింద కోతలు, జుల్మానాలు ఏ కారణమునకై విధించబడినదో యజమానులు వ్రాయరు. ఆ జుల్మానాలను కార్మికుల శ్రేయోభివృద్ధికై వినియోగించవలసినది బదులు యజమానులె హరించుచుందురు.

వున్నది వుండగా పైన వుపాకర్మ అన్నట్లు 'ధర్మము' అనేపేరుతో జీతాలలో మినహాయింపులు. అత్తసొమ్ము అల్లుడు దానము చేసినట్లు కూలీల డబ్బు యజమానులు యెందుకో ధర్మముచెయుట. ఇదేకావును యజమానుల ధర్మకర్తృత్వము మనగాంధీ వాదులు చిలుక పలుకులవలె పలుకుచుండేది? 'ధర్మకార్యాల' పేరట జరిగేదోపిడిని ఆపాలి. యజమానులు ధర్మకార్యములు చేయదలచితే వారికి వచ్చేలాభమునుండి చేసుకోమనండి.

కాంగ్రెసు కమిటీల కర్తవ్యము

అతివాదులు కార్మిక శ్రేయోభివృద్ధికై కోరేది గొంతెమ్మ కోరికలుకావు. కరాచీ కాంగ్రెసులో కార్మికుల అభివృద్ధికైచేసిన తీర్మానము, ఎన్నికల ప్రణాళికలోని వాగ్దానములనే కార్యరూపము దాల్చేటట్లు చేయమని కోరుచున్నారు. కార్మికుల కనీసపు కోర్కెలను తీర్చుమని అడుగుచున్నారు. బ్రిటిషు సామ్రాజ్య వ్యతిరేక పోరాటములోనికి ప్రధమశ్రేణిగా పనికివచ్చు కార్మిక సంఘములను స్థాపించి వారి కనీసహక్కులకై పోరాడవలసినదని కోరుచున్నారు.

కార్మిక మంత్రిగారైన గౌ॥ వి. వి. గిరి గారు కార్మిక చట్టమును తీసికొని రాబోవుచున్నారు. కాంగ్రెసు కమిటీలు, కార్మిక ప్రతినిధులను సంప్రతించి వారి సూచనలను కార్మిక మంత్రికి తెలియపర్చి వాటిని చట్టముగా చెయవలసినదని కోరవలెను.

ఫ్యాక్టరీఆక్టును సర్వాంగ మోటముగా అమలు జరిగేటట్లు చెయ్యాలి. వున్నచట్టముల ద్వారానే కార్మికులకు జరుగవలసిన మేళ్ళు జరుగక పోయిన రాబోయే చట్టమువలన లాభముకల్గునని చెప్పుట పరిహాసాస్పదమైన విషయము కాదా? కాంగ్రెసు కమిటీలు ఫ్యాక్టరీ యినస్పెక్టర్లు, మున్సిపలు అధికారులచేత కార్మిక చట్టములు అమలు జరిగేటట్లు వెంటనే చెయ్యాలి.

జాతీయ వాంఛా తీర్మాన ప్రచారం

నెల్లూరు జిల్లాలో తీర్మానప్రచారము.

నెల్లూరుజిల్లా కాంగ్రెసు సంఘము, నెల్లూరు జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీల యాజమాన్యమున జాతీయవాంఛా తీర్మానము ప్రచారము చేయుటకును, రైతుల కూలీల యిబ్బందులను తెలుసుకొని కోవూరు తాలూకా రైతుసంఘమునకు, నెల్లూరుజిల్లా కాంగ్రెసు సంఘమునకు తెలియజేయుటకును, తేది 25-7-39 ఉదయం యిందుపూరునుండి యన్. శంకరయ్య, డి.అక్కయ్య, వై. దశరధరామయ్య,వి. శంకరయ్యగారలు ఒక దళముగా బయలుదేరి, తలమంచి, రేగడచెలిక, వగైరా 9 గ్రామాలలో సభలు జరిపి, రాబోయే ప్రపంచ సంగ్రామాన్ని గురించి, త్రిపురీ కాంగ్రెసులో ప్యాసైన జాతీయ వాంఛా తీర్మానాన్ని గురించి ప్రబోధించిరి.

అయా గ్రామాలలోని యిబ్బందులు.

1. రేగటచెలిక:—ఈగ్రామానికి 50 గజాలలో రిజర్వు వుండబట్టి, పశువులకు, గొర్లెలకు చాలా యిబ్బందిగానున్నది. జుల్మానాలు, పుల్లరులు అధికముగా నున్నవి.

2. తడకలూరు:—డెల్టా వేయుటకు చాలా కొద్ది ఖర్చుతో వీలున్నప్పటికి యెన్ని ప్రయత్నములుచేసినా డెల్టా వేయలేదు. రూ 50 వేలు ఖర్చుపెట్టినచో,తడకలూరు దానికిచుట్టుప్రక్కల 12 గ్రామాలకు డెల్టా వేయవచ్చును. దానికి డెల్టావేయక 80 వేల ఖర్చుపెట్టి రేగటచెలిక గ్రామానికి (చాల కొద్దిపొలమునకు మాత్రమే ఫాయిదలయగును) డెల్టా వేయించుచున్నారు.

కాంగ్రెసు మంత్రుల హయాములో యింత గుడ్డిగా ప్రవర్తించు ప్రభుత్వ చర్యలకు తడకలూరు చుట్టుప్రక్కల గ్రామాల రైతులు అసంతృప్తి చెందియున్నారు. యకరానికి 1 0 తూములు పండే పొలమునకు శిస్తు 11-0-0 లున్నది. అనగా పండేపంటలో సగము సరిపోవును.

3. చెన్నూరు మజరా కట్టుబడిపాలెము, చెన్నూరు:—ఈగ్రామాలు బుచ్చిరెడ్డిపాలెంలోని కోదండరామస్వామివి. దొడ్లవారి ఆధీనములో నున్నవి. ఇక్కడ రొఖ్ఖశిస్తుకన్న ధాన్యపుశిస్తు (మక్తా)యెక్కువగా నున్నది.పండినధాన్యములో దొడ్లవారు తమ బంట్రోతులకు కొంతభాగము యిప్పించి మిగిలినవాటిలో సగము వాళ్లు తీసికొని రైతులకు సగము యిచ్చెదరు. అనేక మంది రైతులను వారుచేయు పొలమునుండి తొలగించి ప్రక్కగ్రామాల రైతులకు సాగుకు ఎక్కువమక్తాకు యిచ్చుచున్నారు. యీజమీ పరిష్కార చట్టము ప్రకారం పాతబకాయీలు రద్దగుటకు వీలుండగా వీరు యిటీవల కట్టుచున్న శిస్తులకు రసీదువ్వక, పాతబకాయి చెల్లువేసుకొని యిప్పటి శిస్తు బాకీ యున్నారని రైతులమీద దావా వేసియున్నారు. పశువులకు చీటిలో మేసినందుకు విధించు పుల్లరిగాక వడక పుల్లరి గేదెలకు 0-8-0 లు, యితర పశువులకు 0-4-0 లు, వసూలు చేయుచున్నారు. చెరువు మరమ్మతు రైతులే చేసుకొనవలెను. డెల్టా వేయించెదనని 20 సంవత్సరాలక్రిందట దొడ్ల పేరారెడ్డిగారు రూ 1000 లు తీసికొనిరి. 8 సంవత్సరముల క్రిందట దొడ్ల వరదారెడ్డి, బెజవాడ రామచంద్రారెడ్డిగార్లు 21 సవర (బంగారము)లు తీసికొనిరి. ఇంతవరకు డెల్టా వేయించలేదు. వారిడబ్బు వారికి తిరిగి యివ్వనూలేదు.

4. తురిమెర్ల:—ఇప్పటి కొంతమంది రైతులు కూలీలు 20 సంవత్సరముల క్రిందట మాగాణిలో ఇండ్లు కట్టుకొని కాపురముచేయుచూ ఆయిండ్ల స్థలమును గ్రామనత్తము క్రిందకు మార్చుమని తహశీల్దారు, కలెక్టరు మొదలగు వారికి యెన్ని అర్జీలు పెట్టినను యింతవరకు మార్పక వాటర్‌రేటుతో సహా శిస్తువసూలు చేయుచున్నారు, వ్యవసాయకూలీలకు తక్కువ కొలత పాత్రలతో కూలి నిచ్చుచున్నారు.

5. మట్టిపాడు:—ఇది షుమారు 1500 జనాభాయుండు గ్రామమైనప్పటికి స్కూలులేదు. జిల్లా బోర్డు కాంగ్రెసు స్వాధీనములోనికి వచ్చిన తర్వాతకూడ అనేక అర్జీలు పంపినప్పటికి యింతవరకు స్కూలు పెట్టలేదు. చాలసమీపములో కొద్ది ఖర్చుతో డెల్టావేయుటకు వీలున్నప్పటికి యెంత ప్రయత్నించినా డెల్టా వేయలేదు.

6. శ్రీకొలను:—ఈ గ్రామానికి సమీపమునుండి బొగ్గేరు, జమ్మరపుకట్ల వాగు, పారుచున్నవి. ఆనీటిని కొద్ది ఖర్చుతో శ్రీకొలను చుట్టుప్రక్కల పదిగ్రామాలకు నష్లయి చేయుటకు అవకాశమున్నది. గ్రామములో బావులు లేనందున యెండాకాలము పశువులకు, మనుష్యులకు త్రాగుటకు నీరులేక చాలా అవస్థపడుచున్నారు.

ఇదేవిధముగా 28-7-39 మొదలు 4-8-39 వరకు చిరమన, వానిలి, సంగం, సిద్ధీపురం, దువ్వూరు, బుచ్చిరెడ్డిపాలెం, దువ్వూరు మజరా మాలవాడ, అన్నారెడ్డిపాలెం, పంచేడు, పెనుబల్లి, కాగుల్లుపాడు, పాటూరు, ఎల్లాయపాలెం చింతచెలిక—గ్రామాలలో వాలంటీరుదళ సభ్యులైన బి. శంకరయ్య, డి. అక్కయ్య, వై. దశయ్య, ఎన్. శంకరయ్యగారలు సభలుపెట్టి, యుద్ధమును గురించియూ, జాతీయ వాంఛా తీర్మానమును గురించియూ, కాంగ్రెసులో చేరవలసిన అవశ్యకతను గురించియూ గ్రామ కాంగ్రెసు సంఘములు స్థాపించుకొని పని చేయవలసిన పద్ధతులను గురించియూ ఉపన్యాసముల నిచ్చిరి.

1. చిరమన:— అబ్బూరి వెంకటస్వామి అబ్బూరి సుబ్బయ్యగార్ల యింటిస్థలమునకు అనుకొని చుట్టూ యెట్టిగోడయులేక పోలీసుల మరుగుదొడ్డి ఒకటియున్నది.దానినిశుభ్రముకూడ చేయుటలేదు. గ్రామస్థులందరు, వాసన భరించలేకున్నారు. చిరమన గ్రామస్థులు పౌరోహిత్యమునకుగాను యిచ్చిన మాన్యమును యిప్పటి పౌరోహితుడు సరిగా పనిచేయనందున పంచాయితీబోర్డు స్వాధీనము చేయమని కలక్టరును కోరగా యిప్పటికిని సదరు మాన్యమును పంచాయితీబోర్డుకు స్వాధీనము చేయలేదు.

2. పెరమన:—బీరావమేరుకు ఆనకట్ట కట్టినచో 1000 యకరాలకు పైగా సాగుఅయి, గవర్నమెంటుకు లాభము కలుగును. యేరు వచ్చినప్పుడు గ్రామమునుండి పశువులు, మనుష్యులు బయటికి పోవుటకు వీలులేదు. వానకాలమంతయు వారి అవస్థ విపరీతముగానుండును.

3. పాటూరు:— దామరమడుగు నుండి 1 మైలు దూరము మాత్రమే పాటూరుకు రోడ్డువేసే యెడల సగండబ్బు పాటూరు పంచాయితీ బోర్డువారు యిస్తామన్నప్పటికి యింతవరకు రోడ్డు వేయలేదు.

25-7-39 నుండి 4-8-39 వరకు మొత్తం మీటింగులుపెట్టిన గ్రామాలు 24. మీటింగులలో పాల్గొన్న ప్రజలు 2000 లు. దుక్కులు మొదలగు పనులు వున్నందుకు 10 గ్రామాలలో మీటింగులు జరుపుటకు వీలుగాక జాతీయవాంఛా తీర్మాన ప్రతులు పంచిపెట్టబడెను.

పొగాకుమీద పన్ను విధించబడినందున ప్రతి గ్రామములోని ప్రజలు కాంగ్రెసుమీద అసంతృప్తి చెందియున్నారు. సరియైన ప్రచారము చేసి వారితో దగ్గర సంబంధము కాంగ్రెసు కమిటీలు పెట్టుకొననిచో ప్రజలు జాతీయ విద్రోహుల వలలోబడిక్రిందకు పోవుటకుగూడ అవకాశములు ఉన్నవి. నెల్లూరు జిల్లాబోర్డు కాంగ్రెసు పరిపాలనలో ఉండియూ గ్రామస్థులు పెట్టుకొన్న అర్జీలకు జవాబుకూడ యిచ్చుటలేదని చెప్పిరి. అన్ని గ్రామాలలోని వ్యవసాయ కూలీలు తక్కువ కొలతపాత్రలతో తమకు కూలిని యిచ్చుచున్నారని తెలియజేసిరి.

ప్రచారకదళంయొక్క ఖర్చులు.

భోజన ఖర్చు

25-7-39	పద్మనాభ సత్రం	0—12—0
27-7-39	చెన్నూరు	0—12—0
31-7-39	సిద్ధీపురం	0—8—0
	దువ్వూరు ఫలహారం	0—2—0
1-8-39	అన్నారెడ్డిపాలెం	0—5—0
2-8-39	కాగుల్లుపాడు	0—10—0
4-8-39	కొడవలూరు	0—4—0
	పద్మనాభ సత్రం	0—2—0
	పోష్టు ఖర్చులు	
29-7-39	పత్రికలకు పంపుటకు	0—2—0
6-8-39	పత్రికలకు జిల్లాకాంగ్రెసుకు జిల్లా కలక్టరుకు పంపుటకు	0—5—0
		3—14—0

వి. శంకరయ్య,
6—8—39.

* * *

సత్తెనపల్లి తాలూకాలో కాంగ్రెస్ ప్రచారము.

గుంటూరు జిల్లా ఫెడరేషన్ పత్రికూల ప్రచారక దళంలోసభ్యులైన శ్రీవావిలాల గోపాలకృష్ణయ్య, మాదల వీరభద్రరావు, పాటిబండ్ల సూర్యనారాయణ, గారలు ఆగష్టు 1 వ తేదీని సత్తెనపల్లి తాలూకాలో సంచారం ప్రారంభించారు. 1 వ తేదీని సత్తెనపల్లిలో శ్రీ బత్తుల రామదాసుగారి అధ్యక్షతను; 2 వ తేదీని బెల్లంకొండలో కొల్లిపర వెంకట్రామయ్యగారి అధ్యక్షత క్రిందను; బలిజేపల్లిలో గంగదాసు పుల్లారెడ్డిగారి అధ్యక్షత క్రిందను; గణపవరములో బెల్లంకొండ ఫిర్కా మహాసభ కమ్మ హనుమయ్యగారి అధ్యక్షతను; 3 వ తేదీని దమ్మాలపాడు గ్రామంలో కాడివర్తి ముకుంద రెడ్డిగారి అధ్యక్షతను; మాదలలో యిందూరి బాలకోటిరెడ్డిగారి అధ్యక్షతను; పణిదెంలో శాఖమూరి శీతయ్యగారి అధ్యక్షతను; అబ్బూరులో మన్నెం వెంకట్రామయ్యగారి అధ్యక్షత క్రింద సత్తెనపల్లి ఫిర్కా మహాసభయు; 4 వ తేదీని వెంటపాళ్ళలో మొక్కపాటి వెంకటకోటి గోపాలరావుగారి అధ్యక్షతను; క్రోసూరులో కామ్రేడ్ అనుముల రామిరెడ్డి అధ్యక్షతను; వెల్లూరుతో కామ్రేడ్ పాటిబండ్ల గిరితాపుగారి అధ్యక్షత క్రింద అచ్చంపేట ఫిర్కా మహాసభయు; 5 వ తేదీని పరసతల్లూరులో శ్రీ చిర్రా మసలారెడ్డిగారి అధ్యక్షతను; పెదకూరపాడులో దర్శి అక్కయ్యగారి అధ్యక్షతను—బహిరంగ సభలు జరిగెను ప్రతి సభకు రైతులు, కూలీలు విరివిగా వచ్చి పాల్గొన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య మాదల వీరభద్రరావు, పాటిబండ్ల సూర్యనారాయణ, గారలు త్రిపురీ కాంగ్రెసులో ప్యాసైన జాతీయ వాంఛ, ఫెడరేషన్ ప్రతికూల్య తీర్మానాలను గురించి ఉపన్యసిస్తూ, త్వరలో రాబోయే స్వరాజ్య పోరాటంలో ప్రజలు విరివిగా పాల్గొనవలసిందని హెచ్చరిస్తూ వచ్చారు. ఇంచుమించు ప్రతిసభకు పోలీసులు, షార్టుహాండ్ రిపోర్టర్లు హాజరయారు. అయినా ప్రజలు ఉత్సాహంతో కాంగ్రెసు సభ్యులుగా చేరడానికి సభ్యత్వ పుస్తకాలు తీసుకున్నారు.

* * *

భీమవరం తాలూకా కాంగ్రెసు కమిటీ.

పై కమిటీ జనరల్ బాడీ సమావేశం 8-8-39 వ తేదీని శ్రీ వేగేశ్న సత్యనారాయణ రాజుగారి అధ్యక్షత క్రింద సమావేశమయి, యీ క్రింది తీర్మానాలు ఆమోదించెను.

1. ప్రతితాలూకా కాంగ్రెసు కమిటీసభ్యుడు కనీసము 40 మందిచొప్పున కాంగ్రెసు సభ్యుల్ని చేర్చుట, యిదివరకు సభ్యులులేని గ్రామాలలో సభ్యులను చేర్పించుట.

2. భీమవరంతాలూకాకు, కైకలూరుతాలూకాకు, మధ్య వున్న ఉప్పుటేరు రహదార్లు దాటించుపాటదారులు ప్రజలవద్ద అక్రమంగా యెక్కువసొమ్ము వసూలుచేస్తున్నారు కాబట్టి కృష్ణాజిల్లాబోర్డు అధికారులు శ్రద్ధతీసుకొని, సదరురేవులలో నోటీసు బోర్డులు కట్టించి అదనపు వసూళ్లను ఆపవలసినదిగా కోరుచూ తీర్మానించుట.

3. తాలూకాలోని రైతులు పంటలకాలంలో రిపెన్యూ, పి. డబ్ల్యు. డి. పోరంబోకులలో కుప్పలు వేసుకొనుటవల్ల ప్రభుత్వం పెనాల్టీలు విధిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం ప్రజల యిబ్బందులు గ్రహించి అట్టి పెనాల్టీలు వసూలుచేయకుండా యేర్పాట్లు గావించడానికి జిల్లా, రాష్ట్ర కాంగ్రెసు కమిటీలను కోరుచూ తీర్మానించబడింది.

4. తాలూకాసంఘంతరపున సుభాసుబోసుకు ఆహ్వానం యిచ్చుట.

5. రాబోవు ప్రపంచసంగ్రామంలో తాలూకా ప్రజలు బ్రిటిష్ ప్రభుత్వానికి సహాయం చేయవద్దని హెచ్చరిస్తూ తీర్మానం.

6. జిల్లాబోర్డు ఎన్నికలలో జిల్లా కాంగ్రెసువారు చేసిన ఎన్నికల ప్రణాళికను అమలు జరిపించ వలసినదిగా జిల్లా కార్యవర్గం వారిని కోరుట.

7. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించవలసిందని అ. భా. కాంగ్రెసు కమిటీ కేంద్ర ప్రభుత్వంమీద ఒత్తిడి తేవలసిన కోరుట

8. బెంగాల్ రాజకీయ ఖైదీలను విడుదల చేయకపోతే ప్రత్యక్ష పోరాటం తీసుకు రావలసినదిగా అ. భా. కాంగ్రెసు కమిటీని కోరుచూ తీర్మానం.

పార్టీ వార్తలు

చిత్తూరుజిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ అవసర కార్యవర్గసమావేశము.

కుప్పంలో 7-8-39 వ తేదీ రాత్రి కామ్రేడ్ డి. రామబ్రహ్మంగారి యింట యస్. నారాయణ అధ్యక్షతక్రింద సమావేశమై యీ క్రింది తీర్మానములు చేయబడెను.

1. కామ్రేడ్ శెట్టిపల్లి వెంకటరత్నంగారి అకాలమరణమునకు చింతించుచూ, వారి కుటుంబమునకు సానుభూతి చూపడమైనది.

2. ఏలమనేరు తాలూకాలోని పెధూరు మొదలగు గ్రామములలో రైతుల పారెస్టు యిబ్బందులు పోగొట్టుకొనుటకై కాంగ్రెసు మంత్రివర్గానికి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకొనినను ఫలములేకపోవుటయూ, కుప్పం తాలూకాలో జమీందారువల్ల అటవీ యిబ్బందుల వలన రైతుల పశుబాధలు ఎంతా అందోళన చేసినను జమీందార్లు, అధికారులు పెడచెవిని పెట్టినందువలన చింతిల్లుచూ, కాంగ్రెసు మంత్రివర్గం జోక్యం కలుగజేసుకొని మేత లేని పశువులను రక్షించుటకు బూనవలసినదిగా కోరుతూ దానికొఱకై జిల్లా పార్టీపూనుకొని పనిచేయుటకు తీర్మానించ బడినది.

★ ★ ★

చిత్తూరు జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యులకు హెచ్చరిక.

కామ్రేడ్స్:

1. ప్రతి పార్టీసభ్యుడూ ప్రతిమాసం ఒక అణా రాష్ట్రపార్టీకి చెల్లించవలసియున్న బాధ్యత (ఆంధ్ర సోషలిస్టుపార్టీ జెనరల్‌బాడీ తీర్మానానుసారం) ఎవరున్ను గుర్తించియున్నటుల కనబడదు. ప్రతిసభ్యుడు ఏప్రిల్ నెలనుండి చెల్లించవలసియున్నది (ఆ తరువాత పార్టీలో చేరినవారు చేరిన నెలనుండి మాత్రమే.) కాబట్టి సభ్యులందరు వెంటనే చెల్లించవలయును.

2. పార్టీలో సభ్యులు వారు ఎప్పుడెప్పుడు, ఏయే స్థలములందు, ఎయే సంఘములలో ఎంతవరకు ప్రచారము చేసినది తెలియపరచడము లేదు. మీరు ఎంతవరకు పనిచేసినను, లేక పార్టీ కనీస కార్యక్రమమునైనను ఆచరణలో తప్పనిసరిగ పెట్టుతూ రిపోర్టుమాత్రం క్రమంగా పంపుతూ వుండవలయును. లేకున్న పార్టీ సభ్యత్వమును కోల్పోవుదురని తెలుసుకొనగోరుచున్నాను.

3. 17 వ తేది పార్టీ సమావేశములో పార్టీసభ్యులు సభ్యత్వ పునఃరుద్ధరణ యందు సభ్యత్వ అర్హతగల కార్డు పొందిన సభ్యులు తమకు పార్టీయిచ్చిన పనిని తప్పనిసరిగ నిర్వర్తించుచూ రిపోర్టు ఎప్పటికప్పుడు పంపుచుండవలయును.

4. పార్టీ తీర్మానము 3 ప్రకారము మదనపల్లి, కుప్పం, తిరుత్తణి, చిత్తూరు, అధీన సంఘములు ఏర్పాటు చేసుకొని 15 రోజులకొకపర్యాయము పార్టీసభ్యులు సమావేశమై పార్టీ రిపోర్టు పంపవలయును.

5. మీరు ప్రచారముచేయు స్థలములందు రైతులు, కూలీల స్థానిక, ఇతర కష్టములు, వాటికై ఇదివరకుచేసిన కృషి, వాటి పర్యవసానము, ఫలితములు, ఇకముందు చేయవలసిన పనులు, పార్టీసమావేశమున చర్చించి (అధీనసంఘములు లేనిచోట వ్యక్తిగతంగా పంపవచ్చును) విపులంగా జిల్లాపార్టీ ఆఫీసుకు పంపవలయును.

6. ప్రతిసభ్యుడూ తమ సంచారము వాటి అనుభవాలు, స్థానిక యిబ్బందులు, వాటికి సంబంధించిన సంగ్రహ చరిత్రలు పార్టీపత్రిక ('నవశక్తి')కి తప్పనిసరిగ పంపవలయును.

(సం.) ఎస్. నారాయణ,
కార్యదర్శి.

★ ★ ★

నెల్లూరుజిల్లా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ.

పై కార్యనిర్వాహకవర్గ సభ తేది 11-8-39 సమావేశములో యీ దిగువ తీర్మానములు గావించబడెను.

1. స్వాతంత్ర్యోద్యమమును పెంపొందించుటకు తీవ్ర కృషిచేయుచున్న కామ్రేడ్ శెట్టిపల్లి వెంకటరత్నం తిరుమలశెట్టి రామమూర్తిగార్ల అకాల మరణమునకు యీ సభవారు సంతాపము తెలియచేయుచున్నారు.

2. అగస్టు 1 వ తేది నుండి జమీందారు గారున్నూ పోలీసువారున్నూ కలసి, శిస్తును నిర్బంధముగా కట్టమని గ్రామాదులలో రైతులను నిర్బంధించుచున్నారు. పంట బొత్తిగా పోయింది గనుక యిప్పుడు తొందర చేయక నాయుడుపేట కాన్ఫరెన్సు సమయమున రైతు నాయకులతో 6 మాసములు పొడిగించెదనని రెవిన్యూ మంత్రి చేసిన వాగ్దాన ప్రకారం జనవరి నెలవరకు వెంకటగిరి ఎస్టేటులో శిస్తు వసూలు నిలుపవలసినదిగాను మద్రాసు మంత్రివర్గమును కోరడమైనది.

బి. శంకరయ్య,
కార్యదర్శి.

★ ★ ★

తణుకుతాలూకా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ

పై పార్టీ సమావేశము 12-8-39 తేదీ శనివారం రాత్రి 8 గంటలకు తాలూకా కాంగ్రెసు ఆఫీసునందు కామ్రేడ్ కలిదిండి సూర్యనారాయణ రాజుగారి అధ్యక్షతను జరుపబడిన నూతన సంవత్సరమునకు కార్యవర్గపు ఎన్నికలు జరుపబడెను.

కార్యదర్శి: ఎన్. ఆనందరావుగారు

కార్యవర్గము:

మల్లంపల్లి సుబ్బారావుగారు
కలిదిండి సూర్యనారాయణరాజుగారు
నాగరాజు సాంబరాజుగారు
దెందుకూరి నారాయణరాజుగార్లు

తాలూకా పార్టీ అర్గనైజరుగా యాళ్లబండి రంగనాయకులుగార్ని ఎన్నుకోవడమైనది.

తదుపరి ఈ దిగువ తీర్మానములు చేయబడెను.

1. కామ్రేడ్ శెట్టిపల్లి వెంకటరత్నంగారి అకాల మరణానికి సంతాపం ప్రకటిస్తూ, "శెట్టిపల్లి గ్రంథనిధి"కి సహాయం చేయవలసినదిగా తాలూకా ప్రజలకు హెచ్చరిక.

2. సత్యాగ్రహమును గురించి బొంబాయి అ. భా. కాం. కమిటీలో ఆమోదించబడిన తీర్మానం ప్రజాపోరాటాన్ని బలహీన పరుస్తుంది కాబట్టి దాన్ని రద్దు చేసుకోవలసినదిగా అ. భా. కాంగ్రెసు కమిటీని కోరుట.

3. రాష్ట్రీ కాంగ్రెసు కమిటీలు – మంత్రివర్గాలు వీటికి ఉండవలసిన సంబంధాన్నిగురించి బొంబాయిలో అ.భా. కాం. కమిటీ చేసిన తీర్మానం ప్రజాతంత్ర సూత్రాలకు విరుద్ధం కాబట్టి దానినికూడా రద్దుచేసుకోవలసినదిగా కోరుట.

4. జూలై 9 వ తేదీని జరిగిన నిరసన సభలలో పాల్గొన్న కాంగ్రెసువాదులపై ఎట్టి శిక్షచర్య తీసుకొనవద్దని కోరుట.

5. యు. పి. రాష్ట్రీ మంత్రివర్గం అవలంబించిన పద్ధతి ప్రకారం మద్రాసు మంత్రివర్గం కూడా వెంటనే కమ్యూనిస్టుపార్టీపై నిషేధాన్ని తొలగించేటట్లు కేంద్రప్రభుత్వంమీద ఒత్తిడి కలిగించి పౌరసత్వపు హక్కుల్ని కాపాడవలసిందని కోరుట.

6. బెంగాల్ రాజకీయ ఖైదీలు విడుదల అయ్యేవరకు అందోళనగావించవలసిందని ప్రజాసంస్థలను కోరుట.

7. తాలూకా కాంగ్రెస్ కమిటీ సహకారముతో జాతీయ వాంఛాతీర్మానాన్ని, తాలూకా అంతటా ప్రచారం చేయాలని నిశ్చయించుట.

8. పొగాకు చట్టములో "నవశక్తి" సూచించిన మార్పులు తేవలసిందని మద్రాసు మంత్రివర్గాన్ని హెచ్చరించుట.

9. పార్టీ సభ్యులందరు కాంగ్రెసు సభ్యుల్ని విరివిగా చేర్పించాలని తీర్మానించుట.

10. ఫిర్కాకు ఒక్క స్టడీ సర్కిల్ (అధ్యయన తరగతి)చొప్పున యేర్పాటు చేయుటకు కార్యనిర్వాహకవర్గానికి అధికారమిచ్చుట.

11. పార్టీ సభ్యులు ఈ నెల 20 వ తేదీ లోగా కనీసం 0-2-0 చొప్పున అయినా పార్టీ ఆఫీసు ఖర్చులకై యివ్వవలసిందని కోరుట.

★ ★ ★

పితాపురం తాలూకా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.

పైపార్టీ సమావేశము 5-8-39 వ తేదీని కొత్తపల్లిలో కామ్రేడ్ ఆర్. బి. పెండ్యాల గారి అధ్యక్షతక్రింద జరిగి, యీక్రింది తీర్మానాలను ఆమోదించినది:

1. కామ్రేడ్ శెట్టిపల్లి వెంకటరత్నంగారి అకాల మరణమునకు విచారము తెలియజేయుట

2. బెంగాల్ రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయవలసినదిగా హెచ్చరించుట.

3. వారి నిరశనవ్రతమును ఖండిస్తూ గాంధీగారు చేసిన ప్రకటనకు అసమ్మతిని ప్రకటించుట.

4. పొగాకుచట్టము 1000 రూపాయలకు మించని చిన్న వర్తకులకు వర్తింపచేయవద్దని స్వంతానికి 2 మణుగుల పొగాకుగాని, 800 చుట్టలుగాని ఉంచుకొనేహక్కు యివ్వవలసినదని మద్రాసు ప్రభుత్వమును కోరుట.

5. మునగాల రైతు సత్యాగ్రహులను వెంటనే విడుదల చేయవలసినదిగా మద్రాసు మంత్రివర్గాన్ని కోరుట.

★ ★ ★

కాళహస్తి సోషలిస్టు పార్టీ.

4 తేదీ సాయంత్రం ఆర్. ఎం. రత్నం, జి. శీతారామయ్య (పార్టీ మెంబరు)గార్లు కలసి కాళహస్తి వర్కర్లు యూనియన్‌లో చేరడము గురించి, అచ్చట సంఘము ఏర్పాటుచేయుటకు కూలీలలో చర్చించినారు. చంద్రగిరి, కాళహస్తి తాలూకాలు కలసి పార్టీగ్రూపు (అధీనసంఘం) ఏర్పాటుచేయుటకు తీర్మానించడమైనది.

తిరుపతి ప్రెస్‌వర్కర్లుల యూనియన్.

6 వ తేదీ సాయంత్రం 5 గం॥కు తిరుపతి ప్రెస్‌వర్కర్ల సమావేశము జరిగింది. విఠల్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించాడు. ఆర్. ఎం. రత్నం ఉపన్యసించాడు. వర్కర్లు మాత్రం అప్పుడే సంఘము ఏర్పాటుచేయాలన్న ప్రయత్నముతోనే వచ్చారు. డాక్టరు జగన్నాథరావుగారు వాటి నిబంధనలు అన్ని పూర్తిగా తెలుసుకోవాలి కాబట్టి రేపు ఆదివారముకు వాయిదాకోరిరి. అప్రకారం ప్రెస్‌వర్కర్లు కూడా ఆమోదించిరి. అందరిని సభ్యులుగా మాత్రం చేర్చడం జరిగింది. మొత్తం 25 మందికన్న ఎక్కువలేరు 5 ప్రెస్‌లలోనివర్కర్లు. అందరూ మెంబర్లుగా చేరిరి.

నవశక్తి

జూలై

రెండు వారములలో చేర్చిన

	సం. చం.	శ్రీ సం.	విరాళాలు
విశాఖపట్టణం	0	1	0
తూర్పుగోదావరి	1	0	0
పశ్చిమ గోదావరి	6	3	25-0-0
కృష్ణా	10	6	0
గుంటూరు	12	6	0
నెల్లూరు	19	0	6-0-0
ఇతరస్థలాలు	3	1	0
	51	17	31-0-0

ఫాసిస్టులు దిగమ్రింగ జూస్తున్న యుగోస్లోవియా

కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య

అల్బేనియా ఆక్రమణ తరువాత యుగోస్లోవియా పరిస్థితికూడ విషమించింది. ఆస్ట్రియా ఆక్రమణానంతరము జకోస్లోవేకియా పరిస్థితులు ఎంతటి ప్రమాదానికి గురి అయాయో నేడు యుగోస్లోవియా పరిస్థితులుకూడ అంత ప్రమాదావస్థలోనే వున్నాయి.


ప్రపంచ యుద్ధానంతరం సెర్బియా; మోంటినెగ్రో; క్రొయేషియా; స్లావోనియా; బానత్–బోస్నియా–హెర్జిగోవినా–లలో ఒకభాగము; కార్నిలోయొక్క ఒకభాగము; స్టిరియాయొక్క ఒక భాగమూ కలసి 1918 లో యుగోస్లోవియాగా ఏర్పడింది. యుగోస్లోవియా వైశాల్యం 96,3000 చదరపు మైళ్ళు: జనసంఖ్య 14,950,000; మతం, నూటికి 47 గురు గ్రీకు పురాతన మతానికి చెందినవారు. ఇంకా కాథలిక్కులు, ప్రొటస్టెంట్లు, యూదులు, ముస్లిములు వున్నారు. భాషలు: సెర్బో, క్రొయేషన్, రుమేనియన్, జర్మన్, హంగేరియన్, అల్బేనియన్, ఇటాలియన్, స్లావ్, భాషలు మాట్లాడేవారున్నారు. ముఖ్యపట్టణం బెల్‌గ్రేడ్. నూటికి 76 మంది వ్యవసాయంమీద జీవిస్తారు.

యుగోస్లోవియా పరిశ్రమలుకూడ చాలప్రాముఖ్యమైనవి. యూరప్‌లోగల ఎక్కువ సీసము (lead) తగరం (zinc) ఇక్కడే తయారవుతుంది. 1936 కంటె గత సంవత్సరము నూటికి 20 రెట్లు ఇవి వుత్పత్తిఅయాయి. 870,000 టన్నులు మొత్తం తయారయినాయి. ఇంతేగాక ఇనుము ఉత్పత్తి 410,000 టన్నులు. ఇది 1936 కంటె నూటికి 30 చొ॥ వృద్ధిఅయిందన్నమాట. అవిధంగానే రాగి ఉత్పత్తి 760,000 టన్నులు. ఇది నూటికి 24 పాళ్లు వృద్ధి. ఆంటిమొనీ (సుర్మా) 15,000 టన్నులు. ఇది నూటికి 90 పాళ్లు హెచ్చింది. బాక్సైట్ 410,000 టన్నులు. నూటికి 40 పాళ్లు వృద్ధి. పోతఇనుము 65000 టన్నులు. నూటికి 35 పాళ్ళు వృద్ధి. క్రోమియమ్ 51000 టన్నులు.

యుగోస్లోవియా పరిశ్రమలన్నీ బ్రిటిష్, ఫ్రెంచి, జర్మను పెట్టుబడిదారులే దోచుకొంటున్నారు. నాజీ జర్మనులకు ఎంత పేరాకలివున్నా బ్రిటిష్, ఫ్రెంచి పెట్టుబడిదార్ల పెత్తనాన్ని ఒకటి రెండు విషయాల్లో తప్ప తొలగించలేకపోయారు. ఉదాహరణకు, యుగోస్లోవియానుండి జర్మనీకి ఎగుమతి అయిన బాక్సైట్ 1932లో 35000 టన్నులనుండి గతసంవత్సరం 348000 టన్నులకు పెరిగింది. ఇట్లే సీసము 1932 లో 16000 టన్నులనుండి, 39000 టన్నులకు పెరిగింది. క్రోమియమ్ పూర్వం అనలే ఎగుమతిలేదు. కాని గతసంవత్సరం 127000 టన్నులు ఎగుమతి అయింది. తక్కిన పరిశ్రమలన్నీ బ్రిటిష్, ఫ్రెంచి పారిశ్రామికుల పెత్తనంక్రిందే వున్నాయి.

అయినా మ్యూనిక్ పద్ధతుల్ని ఇంగ్లీషు పారిశ్రామికులు వదలిపెట్టలేదు. మెకైకాలోని సెంట్రల్‌యూరోపియన్ మైన్సు లిమిటెడ్ కంపెనీలో కొన్ని షేర్లను జర్మనీకి అమ్మారు ఇక్కడ సీసము, తగరము ఈ కంపెనీ అధీనంలో వుంటాయి. రాగి, మేంగనీస్ గనులు పూర్తిగా ఫ్రెంచి కంపెనీల (లా–బాల్ మెటీసీ. కంపెనీ ఫ్రాంకైజ్ డెజ్ మైన్సు డి బార్) చేతులలోనే వున్నాయి.

ఇక రాజకీయంగా చూస్తాం, 1934 లో కింగ్ అలెగ్జాండరును హత్యచేసిన తరువాత అతని కుమారుడు కింగ్ పీటరు II రాజయ్యాడు. ఆ బాలుని తరఫున పాల్ రాకుమారుడు రాజప్రతినిధిగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఇంగ్లండులోని చక్రవర్తి కుటుంబానికి సంబంధబాంధవ్యాలున్నాయి. హిట్లరు, ముస్సోలినీల పలుకుబడిని తగ్గించి యుగోస్లోవియాను కూడా తమహక్కులను కాపాడుకోడానికి ఉపయోగించుకోవాలనే బ్రిటిష్ ప్రభుత్వ ప్రయత్నం. కాని యుగోస్లోవియా చాలకాలంనుంచి ఫాసిస్టులకు అనుకూలంగా నడుస్తోంది. గత ఫిబ్రవరి 5 వ తేదీని స్టోయాడినోవిచ్ ప్రభుత్వం రాజీనామా నిచ్చినా పరిస్థితులేమీ మారలేదు. 34 సం॥ ములు స్టోయాడినోవిచ్ ప్రధానిగా వున్నాడు. ఇతని చర్యలు ప్రజాభీష్టానికి విరుద్ధం. 1935 లో స్టోయాడినోవిచ్ ఇలా అన్నాడు: "లా, ఎన్నికలను పోలీసులచేతులలో పెడుతుంది" అలాంటి ఎన్నికలలో నైతం గత డిసెంబరులో ప్రభుత్వం ఓడిపోయింది. రోమ్ బెర్లిన్‌ల కూటమికిలొంగిపనిచేసే ప్రభుత్వ విధానానికి ప్రజలు తీవ్రమైన అసమ్మతి తెలియజేశారు. దీని ఫలితం, దేశీయ మంత్రి కొరోషెట్స్ రాజీనామా నివ్వవలసి వచ్చింది, ఈ రాజీనామా ప్రభుత్వంలోని అంతరంగిక విభేదాలను బైటపెట్టింది. ముఖ్యంగా "క్రోట్" సమస్యపై కొందరు శాసన సభ్యులు అసమ్మతిని తెలియచేశారు.



జర్మను ప్రకృతి రామణీయతకూడా హిట్లర్ ఆకృతిలో ఉందంటాడు ఒక చిత్రకారుడు.

స్లావ్‌లు, క్రోట్‌జాతివారు ఆస్ట్రో హంగేరియన్ సామ్రాజ్యంక్రింద చాలకాలం వున్నారు. 1918 లో యుగోస్లోవియా ఏర్పడ్డాక అందులో ఒక భాగమయ్యారు. పరిపాలకవర్గంలో వున్న సెర్బియా నివాసులకు స్లావ్‌జాతి ఎక్కువ సంబంధంకలిగివుంది. ఈ రెండుజాతులకు (స్లోవ్, క్రోట్) మధ్య గల వైషమ్యాన్ని ఫాసిస్టులు ఉపయోగించుకొని క్రోట్ జాతివారిని రెచ్చగొడుతున్నారు. క్రోట్‌జాతి నాయకుడు డాక్టర్ మాచెక్.

మాచెక్ 47 గురు క్రోట్ శాసనసభ్యులతో బెల్‌గ్రేడ్ పార్లమెంటు భవనంలోకి ప్రవేశించడానికి నిరాకరించి జాగ్రెబ్ పట్టణంలో "క్రోట్ డైట్" (శాసనసభ) అని ఒకటి ఏర్పరచాడు. రెండురోజులిట్లు జరిగాక మాచెక్‌తో నూతన ప్రధానిఅయిన 'వెట్‌కోవిచ్' ఒక సంధికి వచ్చాడు. కాని దీనిని పాల్ రాకుమారుడు "వీటో" చేశాడు.

ప్రస్తుత ప్రధాని చర్యలను వివరించేముందు గతప్రధాని స్టోయాడినోవిచ్ చర్యలను గమనిద్దాం. అతడు పాన్ సెర్బియన్ పెట్టుబడిదార్ల ప్రతినిధి అని చెప్పవచ్చు. సెర్బియాతో తమ పలుకుబడిని నిలబెట్టుకోడానికి ప్రజలను, ఇతరజాతులను క్రూరంగా అణచేవాడు. దేశములో జాతిసమస్య ప్రబలమై దేశాన్ని దుస్థితికి తెచ్చింది. స్టోయాడినోవిచ్ ఇటలీ జర్మనీల సహాయమర్థించి యుగోస్లోవియా స్వాతంత్ర్యాన్ని బల్గేరియాహంగేరీల నుండి కాపాడుకునేందుకు గ్యారంటీలను సంపాదించాడు. కాని, ఈగ్యారంటీ ఆస్ట్రియా, జకోస్లోవేకియాల కిచ్చిన గ్యారంటీలకంటె ఏమి ఎక్కువ? ఈగ్యారంటీలను పొందిన ఫలితంగా రోమ్ - బెర్లిన్ కూటమికి అనుకూలంగా తన దేశపు విదేశాంగ రాజనీతిని మార్చుకోవలసి వచ్చింది. 1937 జనవరి 4 వ తేదీని యుగోస్లేవియా, బల్గేరియాతో సంధి చేసుకుంది. ఇది బాల్కన్ ఎంటెంటీ (గ్రీస్ రుమేనియా, టర్కీ, యుగోస్లోవియా) లోని ఇతరదేశాలతో చెప్పకుండానే చేశాడు. ఇది ఎంటెంటీ సఖ్యతకు చాలదెబ్బ తరువాత 1937 మార్చి 25 తేదీని యుగోస్లోవియా ఇటలీతో సంధిచేసుకుంది. 1937 ఏప్రిల్‌లో జరిగిన లిటిల్ ఎంటెంటీ (జకోస్లోవేకియా, రుమేనియా, యుగోస్లోవియా) కాన్ఫరెన్సులో జకోస్లోవేకియా పరస్పర సహాయ సంధికై సూచించితే తిరస్కరించాడు. మరొకసారి ఫ్రాన్సు, లిటిల్ ఎంటెంటీలోని దేశాలతో పరస్పరసహాయసంధిని సూచించితే తిరస్కరించాడు. లిటిల్ ఎంటెంటీ ఫ్రాంకోను గుర్తించుటలో ఇతనిదే ప్రోత్సాహం. ఆస్ట్రియా ఆక్రమణములో ఇతడు చూపిన వైఖరికి హిట్లరు సంతసించాడు. జకోస్లోవేకియాను గత సెప్టెంబరులో జర్మనీ దిగమ్రింగినప్పుడుకూడా ఇతని వైఖరి విద్రోహకరమైనదని చెప్పనక్కరలేదు. ఇంతేగాక, సోవియట్ యూనియన్‌తో ఇతవరకూ యుగోస్లోవియాకు సాధారణ, రాజకీయ,వర్తక సంబంధాలులేవు. జకోస్లోవేకియా క్రైసిస్‌లో యుగోస్లోవియా ప్రజలు అసమ్మతి హెచ్చి ప్రదర్శనాలు వూరేగింపులు మీటింగులు జరిపారు. రెండువారాలలో వేలకొలది యువకులు బెల్‌గ్రేడ్‌లోని జకోస్లోవక్ రాయబారి కార్యాలయములో వలంటీర్లుగా చేరుతామని వచ్చివద్దారు. కాని, ఇతని ప్రజావిద్రోహకరమైన పద్ధతి వలన లాభము లేక పోయింది.

ఇప్పుడు ఇటలీ జర్మనీలు గ్యారంటీలిచ్చినా ఎన్నాళ్ళనుండో ఫాసిస్టు సంస్థలు యుగోస్లోవియాలో పనిచేస్తున్నాయి. లైయుబ్లానా సరిహద్దువద్ద "జర్మన్ పీపుల్సుపార్టీ", జాగ్రెబ్ వద్ద "పీపుల్సు అసోసియేషన్" హంగేరీ సరిహద్దులలో "జర్మను యూనియన్ పార్టీ"లు కలవు. జకోస్లోవేకియాలో హెన్లిన్ ఆడిన నాటకాన్నే యుగోస్లోవియా ఆడడానికి చాలా మంది వున్నారు. హంగేరియన్ మైనారిటీ సమస్య, క్రోట్‌జాతియ అందోళన ముస్సుందు ఇందుకుపయోగించవచ్చు. హిట్లర్ ముస్సోలినీలు హంగేరీ, బల్గేరియా, అల్బేనియాలను యుగోస్లోవియాపై పురిగొల్పవచ్చు. స్టోయాడినోవిచ్ ప్రభుత్వంపోయి 'వెట్‌కోవిచ్' ప్రభుత్వం వచ్చినప్పటికి యుగోస్లోవియా పరిస్థితులు మారలేదు. ఇప్పటి ప్రధాని పూర్వపు స్టోయాడినోవిచ్ ప్రభుత్వంలోకూడా ఒక మంత్రి. ఇతడు ఫాసిస్టు అనుకూల కార్మిక సంఘాలను ఏర్పరచాడు. ప్రజాఅందోళన వలన, విద్యార్థుల, యువకుల, కమ్యూనిస్టుల ఒత్తిడివల్ల, క్రోట్ జాతీయ నాయకుడు మాసెక్‌తో, వెట్‌కోవిచ్ గావించుకొన్న సంధిని పాల్‌రాకుమారుడు నామమాత్రం చేశాడు.

బ్రిటన్, పోలండు రుమేనియాలకు హామీ నిచ్చిన నాటినుండి యుగోస్లోవియా ప్రభుత్వం కొంతమారి, అటు ఇటు ఊగులాడుచున్నా, ఇంకా ప్రజాభిప్రాయాన్ని గమనించడంలేదు. ఈ మధ్య, పాల్, ఇటలీ, జర్మనీల పర్యటనం గావించినపుడు తటస్థత మాని తమతో చేరవలసిందని ఫేసిస్టులు ఒత్తిడి తెచ్చారు. కాని పాల్ అంగీకరించలేదు.

అందుచే, హంగేరీచేత కొంత తమకు యుగోస్లోవియాలో రావాలని అందోళన చేయించుతారు. ఫాసిస్టులు బల్గేరియాకు మాసిడోనియా కావాలని అందోళన చేస్తుంది. ఇటలీ తన అల్బేనియనుల (700,000) నివసించే భూమిని గురించి అడుగవచ్చు.

జర్మనీసంగతి చెప్పనక్కరలేదు 300,000 మంది జర్మన్ మైనారిటీలున్నారు. జకోస్లోవేయాకి ఆక్రమణతోపాటు జర్మనీ అందోళన హెచ్చింది. మార్చి 17 వ తేదీని స్లోవేకియాతో ఒక జర్మన్ విమానం ఎగిరింది. స్లోవేకియా వాసులకు స్వాతంత్ర్యం త్వరలో లభించుతుందనీ, అందోళన చేయమనీ, విమానం నుండి కాగితాలు విసరారు. మార్చి 27-28 వ తేదీలలో పిట్టువద్ద జర్మను సైనికులు ప్రవేశించారు. జర్మను ఏజంట్లు పూర్తిగా ప్రచారంచేస్తున్నారు. జర్మన్ కాన్సల్ 'న్యూమన్' ఇందుముఖ్యుడు, స్లోవేకియాకియాలో 30 జర్మన్‌సంస్థలున్నాయి.

ప్రజలందరూ, ఈ ప్రమాదాల నన్నిటిని గుర్తించి, జాతులసమస్య పరిష్కరించమంటుంటే, ప్రభుత్వం మాత్రం సంక్షిప్తకరంగా పనిచేయడంలేదు. క్రోట్ నాయకులకు కొందరిని జైళ్లనుండి వదలివేసినా కమ్యూనిస్టు నాయకులను వదలలేదు. చాలమంది కమ్యూనిస్టులు ఆజన్మశిక్ష ననుభవించుతున్నారు 1925 లో శిక్షింపబడ్డ సెర్బియన్ కమ్యూనిస్టు జర్నలిస్టు "మెసా పిజాడీ" మాత్రం వదలివేయబడ్డాడు. అయినా ఈమధ్య ప్రభుత్వం ఒక సర్క్యులర్ పంపింది. దానిలో "కమ్యూనిస్టులను – గూఢచారులను" కనిపెట్టి ఉండమని. దాని అర్థం ప్రభుత్వం, ఫేసిస్టులకు దేశాన్ని సమర్పించితే, పోరాడే కమ్యూనిస్టులబాధ వదలించుకోవాలనే. అంతరంగిక జాతుల సమస్యను పరిష్కరించి, ప్రజాస్వామ్య పద్ధతులననుసరించకపోతే త్వరలోనే ఫాసిస్టులకు యుగోస్లోవియా బలి అవుతుంది. యుగోస్లోవియాను ఆక్రమిస్తే, బ్రిటన్ హామీకూడా లేదు. లిటిల్ ఎంటెంటిని జకోస్లోవేకియాతో ధ్వంసంచేశారు. యుగోస్లోవియాను మ్రింగడంలో, బాల్కన్ ఎంటెంటి భగ్నం అవుతుంది.

సుధా ప్రశంస

వైద్య విషయమై కొన్ని గ్రంథములను రచించిన నన్ను మాసపత్రిక నొకదానినిస్థాపించవలసినదిగా అనేకమంది కోరుటచేతను, యీ విషయమై నాకు అనేక సంవత్సరములనుండి కుతూహలముండుటచేతను "సుధ" అనెడి పేరుతో మాస పత్రిక నొకదానిని స్థాపించి నిగూఢములైన శాస్త్ర విషయములను మరియు ఔషధ యోగములను చికిత్సావిధానమునకును సంబంధించిన అనుభూత విషయములను ప్రధానముగ ప్రచురింప దలచితిని. కావున సమర్థులగువారు పై విషయములను దయతోవ్రాసి పంపింపగలందులకు అనేక విధముల ప్రార్థించు చున్నాను.

మరియు "సుధ" అనెడి యీ మాసపత్రికకు సంవత్సరపుచందా రు 2-8-0 మాత్రమే ఏర్పర్పబడినది. కావలసినవారు చందాదారులుగా వెంటనే చేరవచ్చును.

ఇట్లు,

డాక్టర్. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి,
బెజవాడ.



మిస్. రాధ

ఈమె కుబేరా: మైరావణలో, సాగరి పాత్రధారిణి.

ఉత్తమ నటనా కౌశలముగల ఖ్యాత్యభ్యున్నతి అర్థిస్తున్న బాల తార.

★

"అజూరీ" సముద్రోతరంగ నాట్యవైభవం

కుబేరా పిక్చర్స్‌వారి

"మైరావణ"

గతవారం, పై కంపెనీవారి "మైరావణ" చిత్రం షూటింగ్ సందర్భములో తీయబడిన సుప్రసిద్ధ నాట్యసుందరియగు "అజూరీ" యొక్క సముద్రతరంగ నాట్యశోభ అతిమనోహరంగా వున్నది. సముద్రతరంగాల మధ్య ఒక పెద్ద శంఖుపైన "అజూరీ" యొక్క ఛాయావిగ్రహము వుంటుంది. ఆశంఖున కిరువైపుల కొన్ని నత్తగుల్లలుండును. సముద్రతరంగ మొక్కొక్కటి లేచి పడుటలో ఒక్కొక్క నత్తగుల్ల నుండి యొక్కొక్క నాట్యసుందరి లేచి నృత్యమొనర్చుచుండును. అజూరీయొక్క నాట్యభంగిమ సముద్రతరంగములో విలీనమై పోవునట్లుండెను.

ఈ దృశ్యాన్ని తీయించడంలో డైరెక్టరు చిత్రపు నారాయణమూర్తిగారు కెమెరాను అనేక స్థలములందుంచి, అనేక రకములుగ ఆ దృశ్యానికి చలనాన్ని కల్పింపజేసారు.

(ఒక విలేఖరి)

సారథి

రైతుబిడ్డ

ఆగష్టు 27 వ తేదీ 6-54 గంటలకు 11 కేంద్రాలలో విడుదల

సూర్యకుమారి
సుందరమ్మ
పద్మావతీదేవి
గంగారత్నం
సంజీవకుమారి

నెల్లూరు
వినాయక సినిమా

తెనాలి
సత్యనారాయణ టాకీస్

గుంటూరు
శ్రీ సరస్వతీ టాకీస్

బెజవాడ
శ్రీ దుర్గాకళామందిరం

ఏలూరు
రామకృష్ణా టాకీస్

బందరు
మినర్వా టాకీస్

రాజమండ్రి
వెంకటేశ్వర సినిమా

కాకినాడ
క్రౌన్ టాకీస్

విశాఖపట్నం
పూర్ణా థియేటర్

విజయనగరం
శ్రీ కృష్ణా సినిమా

సికింద్రాబాద్
రాజేశ్వరీ టాకీస్

రాఘవాచారి
సీతాపతిరావు
నగరాజారావు
వెంకట్రామయ్య
సూరిబాబు



డైరెక్టరు:
గూడవల్లి రామబ్రహ్మం

మ్యూజిక్:
భీమవరపు నరసింహారావు

కథ, సినేరియో
గూడవల్లి రామబ్రహ్మం

డైలాగ్సు:
గోపీచంద్

అసిస్టెంటు డైరెక్టర్లు:
గోపీచంద్
మాడపాటి రామచంద్రరావు

ఆర్టు డైరెక్టరు:
ఏ. వి. బసవయ్య చౌదరి

స్టుడియో:
మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్సు కంబైన్ లిమిటెడ్

Rytu Bidda

సారధి మూడవ చిత్రం
"దేశబంధు"
నటీ నటులు ఫొటోలతో దరఖాస్తులు పంపండి.

PRODUCERS:
Sarathi Films Ltd.,
Madras.

DISTRIBUTORS:
Saraswati Talkies Ltd.,
Bezwada.

Published by M. Chandrasekhara Rao at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE